
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 12 - సంచిక 3
**ఆగస్టు 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD


## ఆదర్శ వ్యక్తిత్వం

సృష్టి ప్రవాహంలో ఎంతోమంది జన్మిస్తూ ఉంటారు, జీవిస్తూ ఉంటారు, గతిస్తూ ఉంటారు. అనంతమైన ఈ చరిత్ర పుటలో మరచిపోలేని వ్యక్తుల పేర్లు కూడా వ్రాయబడి ఉంటాయి. అవి రాబోయే వ్యక్తులకు మార్గదర్శనం చేస్తూ దివ్య ప్రకాశంతో వెలిగిపోతూ ఉంటాయి. కాల ప్రవాహం వారి పేర్లను ఏ మాత్రం మలిన పరచలేదు. వేలాది సంవత్సరాలు గడిచిపోయినా వారు ఆదర్శ మూర్తులుగానే వెలుగొందుతూ ఉంటారు.

ఏకత్వంలోనే భిన్నత్వం ఉంటుంది. సమిష్టి యొక్క సమగ్రత వ్యక్తి యొక్క అంతఃశ్చేతనలోనే ఇమిడి ఉంటుంది. ఈ వాతావరణంలో జీవించే వారికి ఇది సహజంగానే ఉంటుంది. అందువల్ల ఒకచోట పోగుచేసే ప్రయత్నం చెయ్యరు. తమ తమ జీవితాల్లో ఆదర్శవంతంగా జీవించినవారే చరిత్ర పురుషులు అయ్యారు. ఆచరణ లేకుండా కేవలం ఉపన్యాసాలు చెపుతూ గడిపిన వారు చరిత్రలో మరుగున పడిపోయారు.

శత్రువులను సంహరించేవాడు వీరుడు అవుతాడు. కాని సంహరించనివాడు మహావీరుడు అవుతాడు. ఆతని హృదయంలో అహింసపట్ల దృఢమైన సంకల్పం, ప్రాణి కోటి యెడల అపారమైన దయ నిండి ఉంటాయి. చంపేవారిలోనూ, చంపబడేవారిలోనూ ఉండేది ఒకే ఆత్మ అని భావిస్తాడు. ఈ విధమైన అద్వైత భావన వల్ల ఆతని జీవితం సార్థకత చెందుతుంది. ఆతని మనస్సులో భయం ఉండదు. తన ప్రాణం మీద వ్యామోహం ఉండదు. పిరికితనం ఆతని ఛాయలకి కూడా రాదు. అహింస విషయంలో ఆదర్శాలను విడిచిపెట్టి పతనం కాదు.

పెద్ద పెద్ద ఆదర్శాలను ముందుంచుకుని, బలహీన భావాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయరాదు. జీవితంలో ప్రతి అడుగులోను తనవైన శాశ్వత విలువలను గుర్తించాలి. అంతులేని కోర్కెలతో క్షుద్రమైన స్వార్థాన్ని వదులుకోవాలి. జీవన విలువలను ఎప్పుడూ అపహాస్యం కాకూడదు. దీనిని చరిత్ర ఏనాడూ క్షమించదు. నిస్వార్థంగా జీవన విలువలను గౌరవిస్తూ జీవించేవారే చరిత్ర పురుషులు అవుతారు. అలాంటివారి వ్యక్తిత్వమే ఆదర్శ వ్యక్తిత్వం అవుతుంది.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబర్లనుసంప్రదించగలరు.
**9032674117, 9603509900**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


విజయాన్ని ఎలా సాధించాలో ఓటమి నుండే నేర్చుకోవాలి.

## విషయ సూచిక


1. **సంపాదకీయం :** ఆదర్శ వ్యక్తిత్వం 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** ఆత్మ ఆదేశాన్ని పాటించు 2
3. **వేదమంత్రం :** పవిత్రత 3
4. **వర్తమాన భారతం :** వైజ్ఞానిక ఆధ్యాత్మికతే అన్ని సమస్యలకు పరిష్కారం 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం** ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా? 6
6. **బాలల భవితకు బంగారు బాట-10 :** మా నాన్న 7
7. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ : ప్రథమ మండలం-తృతీయ అధ్యాయం :** అంతులేని అనుదాన ఉపలబ్ది ప్రకరణం-2 8
8. **తత్వ చింతన :** జాతస్య హి ధృవో మృత్యుఃధ్రువం జన్మ మృతస్య చ 10
9. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-15** చీమల జీవనం 13
10. **మనం-మన ఆరోగ్యం :** మన రోగాలకు మన ఆలోచనా సరళే కారణం 15
11. **ధారావాహిక : హనుమత్ కథామృతం-28** సాటిలేని భాగ్యశాలి 18
12. **ఈ శతాబ్దికి అధిష్ఠాత - సూర్యుడు** 20
13. **ధారావాహిక : భక్తిగాథ - 33** అనుభవిస్తేనే రుచి తెలుస్తుంది 23
14. **ప్రత్యేక వ్యాసం : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా** స్వతంత్ర భారతం-జీవన మూల్యాలు-ప్రస్తుత పరిస్థితి 25
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి** దేవత్వమును వికసింపచేసుకోండి-కాలనేములు కాకండి-2 27
16. **వైజ్ఞానిక ఆధ్యాత్మికత :** బుద్ధ భగవానుని వైజ్ఞానిక ప్రయోగములు 30
17. **జీవించేకళ :** త్యాగమే జీవామృతం 33
18. **గాయత్రీమాత-24 శక్తిధారలు 15 :** లక్ష్మీ 35
19. **మహిళాజాగరణ :** విద్యా వ్యాప్తియే స్త్రీలకు గౌరవాన్ని ఇవ్వగలదు 36
20. **వ్యక్తి నిర్మాణము :** నాలుగు ఆదర్శములు - యుగధర్మము 39
21. **ధారావాహిక : ఆదిశక్తి యొక్క లీలా కథలు-2** 41
22. **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)** అగ్ని పరీక్ష నుండి రక్షింపబడడానికి మహాకాలుని ఆహ్వానం 44
23. **దేవ సంస్కృతి విశ్వవిద్యాలయము :** తక్షశిలా విశ్వవిద్యాలయం - 2 47
24. **వార్తలు** 48




## సద్గురు వచనామృతం

### ఆత్మ ఆదేశాన్ని పాటించు

"మరణ ధర్మం కలిగిన ఓ మానవుడా! నిన్ను నీవు తెలుసుకో." ఎందుకంటే నీ లోపల, అందరి లోపల అద్వితీయమైన ఒకే ఆత్మ ఉంటుంది. అది బయట ప్రపంచ రంగస్థలంపై పలువిధాలుగా అభినయిస్తుంది. భగవంతుడు ఉన్నాడని నిరూపిస్తుంది.

నీవు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని నిజంగా కోరుకుంటే ఆత్మ పిలుపును శ్రద్ధగా విను. దానికి అనుగుణంగా పనిచెయ్యి. శుభము, సాత్వికము, దైవోచితము అయిన ప్రతి శక్తికీ పుట్టినిల్లు నీలోనే ఉంది. మనిషి తనలోని ఆత్మిక శక్తులను వికసింపచేసుకోవాలి. ప్రపంచంలోని అతి శ్రేష్ఠ వస్తువులన్నీ ఆ వికాసంలోనే ఇమిడి ఉన్నాయి. మనిషి తన ఆత్మ నిర్దేశాన్ని అనుసరిస్తున్నాడు అంటే అతని అభ్యున్నతి నిశ్చయం.

ప్రపంచంలో సఫల జీవితాన్ని కోరుకున్న ఆధ్యాత్మిక పురుషులు చేసిన మొదటి పని తమ అంతరాత్మను మేలుకొల్పడం. అంతఃకరణ ద్వారా శ్రద్ధగా వినడం వల్ల మనం భగవదాజ్ఞను తెలుసుకోగలం. అంతరాత్మ ఆజ్ఞను పాటించడం నేర్చుకుంటే పెద్ద పెద్ద ధార్మిక గ్రంథాలలో మునిగిపోవాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే బరువైన గ్రంథాలు కూడా అంతరాత్మను సద్వినియోగపరచడం వల్ల కలిగిన ఫలితాలే. అంతఃకరణ పిలుపులోని ఆదేశాలను పాటించడమే ప్రపంచంలోని మతాలన్నింటికీ మూలం.

*(అఖండజ్యోతి ఏప్రియల్ 1954)*

*- అనువాదం : ఊటుకూరి సత్యనారాయణగుప్త*

### పండుగలు

**ఆగష్టు 2010**

| | |
|---|---|
| 14-08-2010 | నాగపంచమి |
| 15-08-2010 | స్వాతంత్ర్య దినోత్సవం |
| 20-08-2010 | వరలక్ష్మి వ్రతం |
| 24-08-2010 | రాఖీ పౌర్ణమి |

**సెప్టెంబరు 2010**

| | |
|---|---|
| 01-09-2010 | కృష్ణాష్టమి |
| 11-09-2010 | వినాయక చవితి |
| 27-09-2010 | మాతా భగవతీ దేవి శర్మ జయంతి |

**మానవుడు ప్రకృతిని అనుసరించడానికి జన్మించాడు, కాని జయించడానికి కాదు.**

## వేద మంత్రం

# పవిత్రత

**పవమానః పునాతు మాక్రిత్వే దక్షాయ జీవసే ।**
**అథో అరిష్ఠ తాతయే ॥**

**భావార్థం :** ఓ పరమాత్మా! నా హృదయంలో భక్తి భావన, కర్మ భావనలను వికసింపచేయుము. నాకు ఆరోగ్యం, జీవనం ప్రాప్తించునట్లు చేయుము. నన్ను అన్ని వైపుల నుండి పవిత్రునిగా చేయుము.

**సందేశం :** మానవుడు బయటా, లోపలా పవిత్రుడుగా ఉండాలి. ఎందుకంటే పవిత్రతలోనే ప్రసన్నత ఇమిడి ఉంటుంది. శీతలత, శాంతి, నిశ్చింత, ప్రతిష్ఠ, నిజాయితీ మొదలైనవన్నీ పవిత్రతలోనే దాగి ఉంటాయి. చైతన్యము, జాగరూకత, సాత్వికత, స్వచ్ఛత, నిరాడంబరత, సువ్యవస్థలలోనే సౌందర్యం ఒదిగి ఉంటుంది.

పవిత్రత ఒక ఆధ్యాత్మిక గుణం. ఆత్మ సహజంగానే పవిత్రమైంది, సుందరమైంది. అందువల్లనే ఆత్మ పరాయణుడైన వ్యక్తి ఆలోచనలు, వ్యవహారం, వస్తువులు అన్నీ స్వచ్ఛంగాను, సుందరంగాను ఉంటాయి.

మానవుడు ఎల్లప్పుడూ బయటా, లోపలా స్వచ్ఛంగా ఉండే ప్రయత్నం చేయాలి. లోపలి పవిత్రత వల్ల మానవుడు శ్రేష్ఠుడు, గౌరవనీయుడు, సజ్జనుడు, సంస్కారవంతుడు అవుతాడు. మానసిక పవిత్రత మానవుని తపస్విగాను, సంయమిగాను, ఆరోగ్యవంతునిగాను తయారు చేస్తుంది. వీటివల్ల దీర్ఘాయువు కలుగుతుంది. ఇంద్రియపుష్టితో బలవంతుడు అవుతాడు. మనస్సు ద్వారానే ఇంద్రియనిగ్రహం లభిస్తుంది. మనస్సులోనే మంచి చెడు కోరికలు ఉత్పన్నం అవుతాయి.

శారీరిక, మానసిక పవిత్రతోపాటు ఆధ్యాత్మిక పవిత్రత కూడా అవసరం. ఇది లేకుండా మానవుడు ఆత్మోన్నతిని పొందలేడు. ఆధ్యాత్మిక పవిత్రతవల్లనే నిజమైన ప్రేమ, దయ, భక్తి, ఉదారత, పరోపకార బుద్ధి జాగృతం అవుతాయి. దైవత్వం వికసిస్తుంది. వ్యక్తులలో సహజంగా తమోగుణం, రజోగుణం ఎక్కువగా ఉంటాయి. ఆధ్యాత్మిక సాధన వల్ల సాత్విక గుణం వికసిస్తుంది. సాత్విక గుణమే మానవుని సాహసిగాను, ప్రాణవంతునిగాను చేస్తుంది. ఓజస్సును, తేజస్సును, వర్చస్సును కలిగిస్తుంది. సత్సంగం, స్వాధ్యాయం, సేవ, సంయమం, సాధనలతో ప్రేరణనిచ్చి యశస్విగా తయారుచేస్తుంది.

"జన్మతః మనమందరం శూద్రులమే. ఎవ్వరూ పుట్టుకతో బ్రాహ్మణులు కారు. బ్రాహ్మణులు కావాలంటే ఆత్మబలం, తపోబలం, నైతిక బలం, ధర్మాచరణ కావాలి. ఈ గుణాలు లేని వ్యక్తి బ్రాహ్మణ కులంలో పుట్టినా శూద్రుడే. ఆతని మనస్సు, గుణాలు మారిన నాడు బ్రాహ్మణుడు అవుతాడు" అని శాస్త్రాలు స్పష్టం చేశాయి. కపటం, నటన మనకు అన్ని విధాల శత్రువులు. మాటలో, చేతలో తేడా లేని వాని హృదయంలో భక్తి, కర్మణ్యతా భావాలు జాగృతం అవుతాయి. అలాంటి వ్యక్తులే జీవితంలో విజయాలను సాధించగలుగుతారు. వారి సంపర్కంలోనికి వచ్చినవారిని కూడా సన్మార్గంలో నడిపించగలుగుతారు. వారు తమ శక్తి యుక్తులతో సమాజంలోని తామసిక, రాజసిక స్వభావాలను దూరం చేసి, సాత్విక భావాలను మేల్కొలుపుతారు. వారి జీవితాలను కూడా పవిత్రం చేస్తారు.

శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక పవిత్రతనే జీవనోద్దేశ్య ప్రాప్తి సంభవం అవుతుంది.

★★★

## ఆహ్వానం

**ఆదరణీయ డా॥ ప్రణవ పండ్యా గారు హెడ్, గాయత్రీ పరివార్, శాంతికుంజ్ హరిద్వార్ పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సందర్భముగా ఆంధ్రప్రదేశ్ గాయత్రీ పరివార్ కార్యకర్తలకు మార్గదర్శనం గావించేందుకు 19.09.2010న హైదరాబాద్ విచ్చేయుచున్నారు. గాయత్రీ పరివార్ కార్యకర్తలందరినీ ఈ సమావేశంలో పాల్గొన వలసినదిగా ఆహ్వానిస్తున్నాము.**

శాంతిని సమకూర్చలేని వ్యక్తి యుద్ధోన్మాది అవుతాడు.

వర్తమాన భారతం

# వైజ్ఞానిక ఆధ్యాత్మికతే అన్ని సమస్యలకు పరిష్కారం

మనం 21వ శతాబ్దం యొక్క మొదటి పది సంవత్సరాలు దాటుతున్నాం, విజ్ఞానం యొక్క చరమ సోపానం వరకు చేరుతున్నాం. 50 సంవత్సరాల క్రితం అసంభవం అనుకునేవి, ఊహకు కూడా అందని అనేక పరికరాలు, ఆవిష్కారాలు ఈనాడు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానం మానవ శరీరం యొక్క లెక్కలేనన్ని రహస్యాలు చెప్పడమే గాక తరతరాల నుండి వింతగా చూచేటువంటి బ్రహ్మాండంలోని అవిజ్ఞాత అంధకార కోణాలను గురించి కూడా చెప్తున్నది. బ్లాక్ హోల్స్ (Black holes) అంటే ఏమిటి? ఈ సృష్టి ఎలా మొదలయింది? ఎవరు చేశారు ఈ సృష్టి? ఇతర గ్రహ నక్షత్రాలలో మనిషి వంటి జీవులున్నారా? ఉంటే వారికి కూడా మనలాగా జిజ్ఞాస ఉంటుందా? బ్రహ్మీచేతన యొక్క అవిజ్ఞాత తెరలలో రిద్ధిసిద్ధులు పడి ఉన్నాయా? ఇలాంటి ప్రశ్నలు జిజ్ఞాసువుల మనస్సులలో వస్తుంటాయి. కాని వీటిలో అనేక ప్రశ్నలకు విజ్ఞానం జవాబు ఇవ్వబోతున్నది. రాబోయే రెండు శతాబ్దాల కాలంలో అంటే 2030 సంవత్సరం నాటికి విజ్ఞానం తన అత్యున్నత స్థితికి చేరుకుంటుంది, తద్వారా మానవజాతి లాభాన్వితమవుతుంది.

## దైనందిన జీవితంలో విజ్ఞానం

వైజ్ఞానిక వికాసం మన దైనందిన జీవితాన్ని కూడా ప్రభావితం చేసింది. మన ఆహారంలో తీరుతెన్నులలో, జీవన శైలిలో విజ్ఞానం యొక్క ప్రభావం కనిపిస్తున్నది. ఒకప్పుడు మెదడుతో, జ్ఞాపకశక్తితో చేసే పనులను విజ్ఞానం ఇచ్చిన వస్తువులతో చేసుకుంటున్నాము. కొద్ది సంవత్సరాల క్రితం లెక్కలు ఎక్కాల పుస్తకంతోనో, లాగ్‌టేబుల్స్‌తోనో జ్ఞాపకశక్తితోనో చేసేవారు. ఇప్పుడు కాలుక్యులేటర్లు వచ్చాయి. చిన్న చిన్న దుకాణాలలో కాలుక్యులేటర్స్, పెద్ద పెద్ద షాపులలో కంప్యూటర్స్ సహాయంతో పనులు చేసుకుంటున్నారు. చిన్న నగరాలలో, పెద్ద నగరాలలో ఈ పరిస్థితి చూడవచ్చు. ఒకప్పుడు తిరగటానికి ఉపయోగించే సైకిల్ స్థానంలో బైక్‌లు, స్కూటి, కార్లు వచ్చేశాయి. (జపాన్ వంటి వర్ధమాన దేశాలలో ఇప్పటికి సైకిల్‌ను నిత్య జీవితంలో వాడుతున్నారు)

## అల్లాఉద్దీన్ అద్భుతదీపం వంటిది విజ్ఞానం

స్మార్ట్‌హోమ్ అనేది ఇప్పుడు ఒక కలకాదు. మీరు మీ రిమోట్‌తో ఇంటిలోని ఎలక్ట్రానిక్ పరికరాలను ఇంటిలోకి వెళ్ళకముందు బయటనుంచే స్విచ్ ఆన్ చేయవచ్చు. మీ ఇల్లు చల్లగా కావాలంటే చల్లగా, వెచ్చగా కావాలంటే వెచ్చగా ఉంచుకోవచ్చు. వంట ఇంటిలో ఎలాంటి పదార్థాలు కావాలంటే అలాంటివి చేసుకోవచ్చు. విజ్ఞానం క్రొత్తక్రొత్త పరికరాలను అందిస్తూనే ఉన్నది. అది వెబ్ సర్ఫింగ్ కావచ్చు, మొబైల్‌ఫోన్ ద్వారా రకరకాల పనులు కావచ్చు. సంగీత ప్రపంచం కావచ్చు, చికిత్సా ప్రక్రియలు కావచ్చు, ఈ నాటి విజ్ఞానం అన్ని రకాల పనులను తేలిక చేసేసింది. ఇంటర్‌నెట్‌లో ఏది కావాలంటే దాని వివరాలు లభిస్తాయి. పుస్తకాలు కొనవలసిన పనిలేదు. ఈనాటి ఇంటర్‌నెట్ ద్వారా ఎక్కడ కావాలంటే అక్కడ ప్రపంచంలోని సమస్త విషయాలను తెలుసుకోవచ్చు. శాటిలైట్ విజువల్ ఎఫెక్ట్స్ ప్రపంచాన్నే మార్చివేశాయి. మనము ఊహించలేని దృశ్యాలను టీవిలో చూడగలుగుతున్నాము. ఇదంతా విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ మహత్యమే. విజ్ఞాన రూపంలో అల్లాఉద్దీన్ అద్భుతదీపం చేతిలోకి వచ్చినట్లయింది. ఎప్పుడు ఏది కావాలన్నా అది ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నది.

ఇవన్నీ మాకు లేవు కదా! మాకు ఎందుకు చెప్తున్నారు ఇదంతా అనే ప్రశ్న వస్తున్నదా? ఇక్కడ విజ్ఞానం యొక్క వికాసాన్ని గురించిన వివరణ మాత్రమే ఇస్తున్నాము. తింటానికి తిండి ఉన్నా లేకపోయినా ప్రపంచంలోని మూడవవంతు మనుష్యులు వరల్డుకప్ ఫుట్‌బాల్ ఆటలను టెలివిజన్‌లో శాటిలైట్ సహాయంతో చూస్తున్నారు, చాలా ఆనందిస్తున్నారు. దీనిలో ఘనా, ఆల్జీరియా, నైజీరియా, వంటి ఆఫ్రికా దేశాలు, పెరుగ్వే, ఉరుగ్వే, అర్జంటైనా వంటి దక్షిణ అమెరికా దేశాలు ఈ పోటీలలో పాల్గొన్నాయి. వీటి పరిస్థితి భారతదేశం కంటే మెరుగ్గా లేకపోయినా ఈ దేశస్థులు మనస్సుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ప్రతినిత్యం ఆహారంగా చేసుకుంటున్నారు.

## పెరుగుతున్న సమస్యలు - ఎదుగుతున్న విజ్ఞానం

మేము వ్యంగ్యంగా చెప్తున్నామని అనిపించటం లేదు కదా! కొంచెం సేపు మెట్రోరైలులో ఢిల్లి నలువైపులా తిరుగుదాం. భారతదేశం యొక్క మారుతున్న చిత్రాన్ని చూపిస్తున్నాము. ఇదొక విచిత్ర ప్రపంచం, విరోధాభాస ప్రపంచం. ఇక్కడ ఆకలి చావులుంటాయి. ప్రక్కనే ఆకాశాన్నంటే భవనాలు ఉంటాయి. విశ్వంలోని రెండోదో, మూడోదో పెద్దదయిన విమానాశ్రయం ఇక్కడ నిర్మించబడుతున్నది. విజ్ఞానం యొక్క వెదుకులాటంతా నగరంలోని చదువుకున్న వారికి, ఉద్యోగస్తుల కొరకు, నేతల కొరకు, వ్యాపారస్తుల కొరకే. బీదవారు ఎలాగోలా బ్రతుకుతుంటారు. గ్రామాల నుండి నగరాలకు మనుష్యులు పరిగెత్తుతున్నారు. నగరాలలో జన సంఖ్య పెరుగుతున్నది. చెత్తాచదారంతో నిండిన ఇరుకు ప్రదేశాలలో నివసించవలసివస్తుంది. విద్యుచ్ఛక్తి కొరత విపరీతంగా ఉన్నప్పటికి మన విజ్ఞానవేత్తలు వీటిని పట్టించుకోవడం లేదు. పెట్రోలు, డీజల్, వంటగ్యాస్, కిరోసిన్ ధరలు మండిపోతున్నాయి. ఈ

**వాయువు, నీరు, కాంతి వలె విజ్ఞానం కూడా అందరికీ అందుబాటులో ఉండాలి.**

ఇబ్బందికరమైన బాధాకరమైన, దుర్గతి నుండి తప్పించుకునే మార్గం ఎందుకు ఆలోచించడం లేదు?

## విజ్ఞానం యొక్క అసలు అర్థం ఏమిటి?

విజ్ఞానం అంటే ప్రగతిలో ముందుచూపు ఉండటం, ప్రగతిశీల ఆలోచనలు చేయడం, కనిపించే భౌతిక జగత్తులో వెదకడం, కనిపించని పరోక్ష జగత్తుతో (సూక్ష్మజగత్తు) అనుసంధానం, మానవులు జీవించటానికి కావలసిన ఆహార పదార్థాల పానియాల లభ్యం, చికిత్సా పద్ధతులలో నూతన ఆవిష్కారాలు మొదలైనవి. మన ఋషులు తమ శరీరాన్నే ప్రయోగశాలగా చేసుకుని, ప్రకృతి రహస్యాలను తెలుసుకొని వాటిని వేదములలో ఉపనిషత్తులలో, బ్రాహ్మణ, ఆరణ్యకములలో అందించారు. చరకుడు, కణాదుడు వీరందరు వైజ్ఞానికులే. వీరి ప్రయోగాల వివరణ పైన చెప్పిన గ్రంథములలో చూడవచ్చు. మానవజాతి శ్రేయస్సు కొరకు ప్రయోగాలు జరుగుతూనే ఉండాలి.

## మరి ఎందుకు ఈ వ్యతిరేక పరిస్థితులు?

ఈనాడు భారతదేశాన్ని ఒక వర్ధమాన దేశంగా, సంస్కార వంతమైన దేశంగా భావిస్తాము. మనం జి-20 దేశాలలో సభ్యులం. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థలో మన దేశం ఒకటి. కాని ఇక్కడే ఖాఫ్ పంచాయితీ నిర్ణయం ద్వారా కుటుంబ మర్యాద పేరుతో నూతన వధూవరులను చంపుతున్నారు. ఎందుకు ఈ హత్యలు జరుగుతున్నాయి? విజ్ఞానం ఇంతగా పెరిగిన రోజులలో కూడా, ఇటువంటి ఆర్థిక పరిస్థితులలో కూడా ఇలాంటి దుర్ఘటనలు, వ్యతిరేక పరిస్థితులు కనిపిస్తాయి. విద్యాలయాలలో విద్యార్థులకు 90% కన్నా అధికంగా మార్కులు వస్తే ప్రతిభావంతులుగా భావించబడుతున్నారు. మిగిలిన పిల్లలను చిన్న చూపు చూస్తున్నాయి. అందువల్ల వికసిస్తున్న అనేక ప్రతిభలు ఆత్మహత్యలు చేసుకుంటున్నాయి. ఇది మనకు కనిపించడం లేదా? లక్షల, కోట్ల రూపాయలు వివాహాల కొరకు, కట్నం అనే పేరుతో ఖర్చు చేయబడుతున్నాయి. ఈ డబ్బును గ్రామాల వికాసం కొరకు ఖర్చుచేస్తే ఎన్ని స్కూళ్ళను పెట్టవచ్చు, ఎన్ని హాస్పిటల్స్‌ను పెట్టవచ్చు, ఎన్ని రకాల మృత్యువులను నివారించవచ్చు. కాని మనకు తళుకు బెళుకులు కావాలి. ఎవరు ఆపుతారు వీటిని? పెట్రోలు నిల్వలు రాబోయే సంవత్సరాలలో ఖాళీ అవుతాయని చెప్తున్నారు. కానీ కార్ల సంఖ్య ఎక్కువ అయ్యింది. ఖరీదైన కార్లు కూడా వస్తున్నాయి. కొనేవారు కూడా ఉన్నారు. విద్యుచ్ఛక్తి ఉందో లేదో, జనరేటర్‌తో అయినా పని గడుపుతున్నారు. విద్యుచ్ఛక్తి ఆదా చేయ్యమని, పెట్రోలు ఆదా చెయ్యమని ప్రభుత్వం కూడా అనడం లేదు. అది ఈ నాడు 2010 నాటి పరిస్థితి.

విజ్ఞానం అంటే వివేకంతో కూడిన ప్రగతి. కాని ఈ నాడు విజ్ఞానం రాజ్యం ఏలుతున్నటువంటి రోజులలో ఇటువంటి పరిస్థితులు ఎందుకున్నాయి? ఎందువల్లంటే దీని ఆధ్యాత్మికత అనే ఆత్మను ఆపరేషన్ చేసి, బయటకు తీసి దూరంగా పారేశారు. అందువల్ల విజ్ఞానం భస్మాసురుని వలె పశ్చిమ దేశాలనే గాక తూర్పు దేశాలను కూడా వినాశనం అనే రోడ్డు మీదకు తీసుకుపోతున్నది. మనం విజ్ఞానాన్ని జీవంతో నింపాలి. విజ్ఞానాన్ని ఆధ్యాత్మిక-శ్రద్ధ, విశ్వాసం-ఆదర్శవాదం, అందరికి సౌభాగ్యం అనే ఆలోచనతో కలపాలి.

## ఆధ్యాత్మికత అంటే అర్థం ఏమిటి?

ఆధ్యాత్మికత అంటే ఒక విశిష్టమైన మతమో, ఒక కర్మకాండో, వేషభూషలో, పూజావిధానాలో కాదు. వీటితో పాటు వైజ్ఞానిక దృష్టితో కూడిన అర్థం, పరమార్థం ఉన్నప్పుడే అది ఆధ్యాత్మికత అనిపించుకుంటుంది. గ్రుడ్డి నమ్మకాలతో దీనికి సంబంధం లేదు. తరతరాల నుండి వస్తున్న పరంపరను వివేకమునే గీటురాయి మీద పరీక్షించాలి. ఆధ్యాత్మిక దృష్టికోణం ఎవరి జీవనంలో దిగుతుందో వారికి సాధనములను సవ్యముగా ఉపయోగించుకునే విధానం అర్థం అవుతుంది. ఇది జీవనమును అందంగా తీర్చిదిద్దుకునే కళ. మనిషి అంతరంగంలో దాగివున్న అనంతమైన సామర్థ్యములను జాగృతం చేసే విద్య ఆధ్యాత్మిక విద్య. దీనిని పరావిద్య అని కూడా అంటారు. పరోక్షజగత్తులో దాగి ఉన్న అనంతమైన శక్తి సామర్థ్యములను మానవుల పురోభివృద్ధికి ఉపయోగపడే విద్య. ఇది సౌరశక్తి కావచ్చు. గ్రహనక్షత్ర ప్రభావములు కావచ్చు. వనౌషధుల విజ్ఞానం కావచ్చు. ఆధ్యాత్మిక విద్య ప్రకృతిని సంతులనముగా చేసే, సువ్యస్థితం చేసే విషయాలు చెప్తుంది.

## రెండు శక్తులు కలిసే ఉంటాయి

ఆధ్యాత్మికతను విజ్ఞానం యొక్క సహోదరుడన్నా, ఆత్మ అన్నా తప్పుకాదు. ఈనాటి అన్ని సమస్యలకు పరిష్కారం కావాలంటే ఒకే ఒక మార్గం ఉన్నది. అదే విజ్ఞాన సమ్మతమైన ఆధ్యాత్మికత. ఈ రెండింటికి అన్యోన్యాశ్రితమైన సంబంధం ఉన్నది. మనం ముందు చూపులేకపోవడం వల్ల ఈ రెండింటిని వేరు వేరు చేశాము. ఆ తప్పు యొక్క ప్రతిఫలం ఈనాడు అనుభవిస్తున్నాం. ఈ రెండింటిని కలపమని ఈనాటి కాలం కోరుకుంటున్నది. రెండూ కలిస్తే ఒక సమన్విత ప్రక్రియ వికసిస్తుంది, ప్రగతి వేగవంతమవుతుంది. మనం దైనందిన జీవనంలో వైజ్ఞానిక ఆధ్యాత్మికత నింపాలని గాయత్రీ తీర్థం, శాంతికుంజ్, బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్, దేవ సంస్కృతి విశ్వవిద్యాలయాలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. వైజ్ఞానిక ఆధ్యాత్మిక వాదం జన జీవనంలోకి తీసుకెళ్ళాలి. విజ్ఞానం ఒంటరిగా ఉండకూడదు. ఆధ్యాత్మికతతో కలిసే ఉండాలి. విజ్ఞానంపై ఆధ్యాత్మికత యొక్క అంకుశం రావాలి. మనం ఆధ్యాత్మికతకు విజ్ఞానం యొక్క సపోర్టు (ఊతం) ఇవ్వాలి. అప్పుడే ఆధ్యాత్మికతలో చోటుచేసుకున్న అంధ విశ్వాసాలు, మూఢ విశ్వాసాలు రూపుమాపబడి విజ్ఞానంతో చేతులు కలిపి నడవగలుగుతుంది. అలాగే జరగాలి. జరిగి తీరుతుంది. ఈ ప్రగతియాత్రలో పాలుపంచుకునేందుకు అందరిని ఆహ్వానిస్తున్నాము. పాలుపంచుకునేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?

★★★

ప్రతి ఒక్కరూ అందరికోసం బ్రతకాలి - స్వామి వివేకానంద.

ఉపాసన - రెండు పాదాలు : జపం-ధ్యానం

# ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?

బ్రహ్మాండం చాలా పెద్దది. దాని విస్తారం మన కల్పనా శక్తికి అందదు. బ్రహ్మ శక్తిని పూర్తిగా తెలుసుకోవాలంటే మానవునితరం కాదు. ప్రకృతి యొక్క కార్యకలాపాలు అన్ని లోకాలలో కన్నా భూలోకంలో భిన్నంగా ఉంటాయి. పృథ్విపై గల ప్రాణుల ఆకారం, స్వభావం, ఆలోచన, జీవన శైలి అన్నీ భిన్నమైనవే. బ్రహ్మను పూర్తిగా తెలుసుకోవడమూ కష్టమే. తెలుసుకోవాల్సిన అవసరమూ లేదు. బ్రహ్మ చేతనకు, మానవీయ చేతనకు సంబంధం ఉన్న భాగాన్ని ఈశ్వరుడు అంటారు. మన ఆనందంలో, ఉన్నతిలో ఆయన ఉనికిని కలుపుకుంటే సరిపోతుంది.

అవసరాన్ని అనుసరించి విశేష సూక్ష్మశక్తిని సంపాదించడానికి దేవీ-దేవతల ఉపాసన చేయాలి. దానికి ధ్యాన సాధన చేయాలి. నా అనుభవంతో ఇచ్చే సలహా ఏమంటే సమగ్ర బ్రహ్మయొక్క సాధనే సర్వ శ్రేష్ఠమైనది. ఆహారంలో అన్ని రకాల పోషణ తత్వాలు ఉండాలి అనుకుంటాం. ప్రొటీన్లు ఎంత గొప్పవి అయినప్పటికీ కేవలం ప్రొటీన్లనే తినం కదా! ఏదో ఒక దేవతను ఉపాసించడం అనేది ప్రొటీన్లు మాత్రమే తినడం వంటిది. వైద్యుల సలహా ప్రకారం అవసరమైనప్పుడు ప్రొటీనును తినాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రత్యేక ప్రయోజనం కొరకు ప్రత్యేక దేవతను ఉపాసించడం జరుగుతుంది.

భిన్న భిన్న దేవీ దేవతల యొక్క భిన్న భిన్న రూపాలను ప్రోగుచేసుకోవడంలో ధ్యానం అన్ని వైపులకు పంచబడుతుంది. నిష్ఠ చెదిరిపోతుంది. రకరకాలైన ప్రయోజనాల కోసం రకరకాలైన దేవతలతో సంబంధం ఉంచుకోవాలని తగిన సామాగ్రిని ప్రోగుచేసుకుంటాం. ఉపాసనా రంగంలో ఈ సిద్ధాంతం పనిచేయదు. దానివల్ల ధ్యానం, నిష్ఠ పూర్తిగా చెదిరిపోతాయి. పరబ్రహ్మను ఉపాసించడంలో సవితా దేవత రూపం సర్వశ్రేష్ఠమైనది. కాంతి కిరణాల సాధన సాకారవాదులకు, నిరాకారవాదులకు రెండు పక్షాలవారికి సరిపోతుంది. జ్యోతి రూపాన్ని ధ్యానించడం గొప్పదనాన్ని ఆపాదించిపెడుతుంది. ప్రతి సాధకుడు దానిని తన ఇష్టదైవం యొక్క చైతన్య రూపం అని భావించాలి. గాయత్రీ మంత్రం యొక్క దేవత సవిత. కాంతి స్థూలం, ఆలోచన సూక్ష్మం, భావన కారణ జగత్తుకు సంబంధించినది. ఈ మూడింటినీ సమన్వయపరుస్తూ ఉపాసించే సత్‌జ్ఞాన రూపం సూర్యుడు. ఆతని కిరణాలతో గాయత్రీ మంత్రం యొక్క సదాశయాన్ని పడుగు-పేకల్లాగా ప్రేమకు మాతృ సత్తాను జోడించి ప్రతిబింపచెయ్యాలి. ధ్యానంలో మూడు శరీరాల అవసరాలను పూర్తి చేయగలిగే శక్తి ఉంది. దీనిలో సాకార, నిరాకారాల సమన్వయం ఉంది.

భగవంతుడు సచ్చిదానంద స్వరూపుడు. ఆయనను ధ్యానించడంవల్ల గాఢమైన ఆనందానుభూతి కలుగుతుంది. కాంతిరూపంలోకాక రసరూపంలో ధ్యానించడం ఎక్కువ ఉపయోగకరం. ఖేచరీముద్ర ద్వారా రస రూపంలో ధ్యానించవచ్చు. "రసోవైసః" అనే దిశాస్త్రవచనం.

ఖేచరీ ముద్రలో నాలుకను అంగిలికి ఆనించి, భగవంతుని రస ప్రవాహ రూపంలో అవతరింపచేసుకుంటాము. మన మెదడు శివునికి కైలాసం. విష్ణువుకు క్షీర సాగరం. బ్రహ్మకు సహస్ర దళకమలం. విశ్వవ్యాపితమైన సూక్ష్మ చైతన్యంతో ఇదే మనకు కేంద్రం అవుతుంది. ఈశ్వరీయ చైతన్యం యొక్క అనుభూతి కూడా ఈ కేంద్రం ద్వారానే జరుగుతుంది. ఉపాసనలో జప ధ్యానాలతో పాటు ఖేచరీ ముద్రను కూడా చేర్చడం ఇందుకే. ఖేచరీ ముద్రలో నాలుకను ప్రత్యేకమైన స్థితిలో ఉంచడం వల్ల జపం చేయలేకపోతాం. అందువల్ల ఈ ధ్యానం విడిగా చేయాల్సి ఉంటుంది.

ధ్యానం యొక్క స్వరూపాన్ని సరిగ్గా అర్థం చేసుకుని, సరి అయిన పద్ధతిలో ఉపయోగించగలిగితే మన యొక్క లౌకిక, పారలౌకిక ప్రగతికి చెందిన అనేక అడ్డంకులు తొలగిపోతాయి.

*- అనువాదం : ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

**మర్రి గింజంత చిన్న పదంలో మహా వృక్షమంత అనుభవాన్ని అందించగలవాడే మహా కవి.**



## బాలల భవితకు బంగారు బాట-10

# మా నాన్న

హిరణ్య కశ్యపుడు ఎన్ని విధాల బాధించినా గాని ప్రహ్లాదుడు విష్ణు భక్తిని విడిచిపెట్టలేదు. నిప్పుల్లోకి నెట్టించాడు. పాముల చేత కరిపించాడు. కొండపై నుండి దొర్లించాడు. ఒకటేమిటి? ఎన్ని విధాల బాధించవచ్చో అన్ని విధాల బాధించాడు. అయినా ప్రహ్లాదుడు విష్ణు నామాన్ని వదలలేదు. "దుష్టుడా! మనవంశంలో ఒక్కరు కూడా శ్రీహరి పేరును తలవలేదు. నువ్వు మాత్రం ఎప్పుడు చూచినా అదే పేరు పట్టుకుని వేలాడుతున్నావు. నీవల్ల కుల మర్యాద మంటగలసిపోతున్నది. ఇది క్షమించరాని నేరం" అంటూ తిట్టి పోశాడు. "శ్రేష్ఠమైన పనివల్ల కుల మర్యాద ఎన్నడూ నశించదు తండ్రీ!" అన్నాడు కొడుకు.

తండ్రికి విపరీతమైన కోపం వచ్చింది. అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. చిటపటలాడిపొయ్యాడు. "ఏడిరా నీ శ్రీహరి? స్తంభంలో ఉంటే బయటకు రమ్మను" అంటూ చేతిలోని గదతో స్తంభాన్ని గట్టిగా బాదాడు. స్తంభం పగిలిపోయింది. దాని నుండి ఉగ్రనరసింహమూర్తి బయటకు వచ్చాడు. రెండు చేతులతో హిరణ్య కశ్యపుని ఎత్తి తొడలపై పెట్టుకున్నాడు. రౌద్రంతో ఊగిపోతూ రెండు చేతులతో చీల్చివేశాడు. అయినా రౌద్రం చల్లారడం లేదు. భయంకరంగా ఊగిపోతున్నాడు. దేవతా గణాలు దిగివచ్చి ఎంత స్తుతించినా శాంతపడడంలేదు. లక్ష్మీదేవిని పిలిపించారు. ఆమె కూడా ఏమీ చేయలేకపోయింది.

బ్రహ్మదేవుడు చిట్టచివరకు ప్రహ్లాదుని పిలిచాడు. ఏవిధంగా అయినా నువ్వే శాంతపరచాలి అన్నాడు. ప్రహ్లాదుడు ఉగ్రమూర్తికి ఎదురుగా ప్రాణాచారం పడ్డాడు. తన ప్రియాతిప్రియమైన శిష్యుడు ఎదురుగా ప్రాణాచారం పడి ఉండడం చూచి విష్ణుమూర్తి శాంతించాడు. ప్రేమతో తట్టిలేపాడు. "నాయనా! నీ భక్తికిమెచ్చాను. లేచి ఏదైనా కోరిక కోరుకో తీరుస్తాను" అన్నాడు. "ప్రభూ! మీ దర్శనం కన్నా మించిన కోరిక నాకేముంటుంది? నాకేమీవద్దు" అన్నాడు ప్రహ్లాదుడు.

ప్రహ్లాదా! వద్దు అనవద్దు. ఏదైనా కోరుకో" అన్నాడు మళ్లీ. "భగవాన్! నాకు ఏ కోరికాలేదు. నేను ఎప్పుడూ కోరికతో సేవించలేదు. మీ దయ ఉంటే అంతే చాలు. అంతగా మీకు వరం ఇవ్వాలని ఉంటే, నా మనస్సులో ఎప్పుడూ కూడా ఎలాంటి కోరిక పుట్టకుండా వరం ఇవ్వండి. నాకు అంతే చాలు" అన్నాడు భక్తితో. 'తథాస్తు' అన్నాడు భగవానుడు. అంతటితో ఊరుకోలేదు. "భక్తా! నీ కొరకు ఒకే ఒక కోరిక కోరుకో. తప్పకుండా ఇస్తాను" అన్నాడు ప్రేమగా.

ప్రహ్లాదుడు ఆలోచనలో పడ్డాడు. ఎన్ని సార్లు వద్దన్నా ఇన్ని సార్లు భగవంతుడు అడుగుతున్నాడంటే నా మనస్సులో ఏదో కోరిక నాకు తెలియకుండానే దాగికొని ఉండి ఉంటుంది అనిపించింది. జాగ్రత్తగా తరచి తరచి చూసుకున్నాడు. నారాయణుని మీది భక్తి తప్ప ఇంకేమీ కనిపించలేదు. ఇంతలో భయంకరంగా చంపబడి క్రింద ఉన్న తండ్రి కళేబరం కనిపించింది. ఒక్కసారిగా హృదయం ద్రవించింది. అంతరాళం నుండి "మా నాన్న మా నాన్న" అన్న పదం ముమ్మారు ప్రతిధ్వనించింది. చలించిపోయాడు. దాగి ఉన్న కోరిక ఏదో కన్నుల ముందు నిలబడింది. విష్ణుమూర్తి పాదాలపైబడ్డాడు.

"ప్రభూ! నా తండ్రి జన్మాంతర కారణాల వల్ల మిమ్మల్ని అనేక రకాలుగా దూషించాడు. మీ మీద కోపంతో మీ భక్తులను హింసించాడు. దాని ఫలితంగా ఘోరాతిఘోరంగా చంపబడ్డాడు. ఆయన విధివశాత్తు చేసిన పాపాలను క్షమించి దయతో ముక్తిని ప్రసాదించండి" అని దీనంగా వేడుకున్నాడు. నరసింహమూర్తి చిరునవ్వుతో భక్తుని ప్రేమగా లేవదీశాడు. "ప్రహ్లాదా! నీ జన్మధన్యం. నీ పితృభక్తి ధన్యం. నీ నారాయణ భక్తి ధన్యం. నీ కోరిక తప్పక నెరవేరుతుంది" అంటూ ప్రశాంత చిత్తంతో అంతర్ధానమయ్యాడు.

**కం॥నాన్న పలికినట్టి పలుకు**
**లెన్నగ బాధించుగాని యెంచుచు చూడన్**
**మిన్నగమేలే తలచును**
**నాన్నను దూషించరాదు నమ్ముము బాలా!**

★★★

**కాలాన్ని వృథా చేయడం అంటే జీవితాన్ని వృథా చేయడమే.**

ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-తృతీయ అధ్యాయం

# అంతులేని అనుదాన ఉపలబ్ధి ప్రకరణం-2

*ఆరణ్య కాస్య సత్రస్య ద్వితీయేహ్ని మనీషిణః*
*ఋషయః కృతనిత్యాస్తే ప్రభాత సమయే శుభే* (1)

*దేవతారుతరుణాం తే సంగతాః సఘనే శుభే*
*ఉపవనే తం మహాప్రజ్ఞాం వ్యాస పీఠం సుశోభితమ్* (2)

*నత్వా పిప్పలాదం తే క్రమశః స్వం స్వమాసనే*
*యథా క్రమం వ్యరాజన్త తత్వ జిజ్ఞాసవః సమే* (3)

*స్మారయన్ ప్రథమం తత్వచిన్తనం నిర్గతాహ్నికమ్*
*శ్వేత కేతుః సమాధాతారం పప్రచ్ఛతు వాగ్మినమ్* (4)

**టీకా:-** ఆరణ్యక సత్రం యొక్క రెండవరోజు ప్రాతః కాల సమయాన నిత్య కర్మలు పూర్తిచేసుకుని ఋషులు, మనీషులు పునీతమైన దేవదారు వృక్షములతో నిండిన సుందరమైన ఉద్యానమందు ఏకత్రితమయ్యారు. వ్యాస పీఠంపై విరాజమానమైన మహా ప్రాజ్ఞ పిప్పలాదునికి వందనం చేసిన పిదప ఆ తత్వ జిజ్ఞాసువులందరు తమ నియమిత స్థానంలో కూర్చున్నారు. ముందు రోజు జరిగిన తత్వచింతన గురించి గుర్తుచేస్తూ ఆలోచనాపరుడైన శ్వేతకేతు పిప్పలాద ఋషిని అడిగాడు.

*దేవ! కిం సర్వథా మర్త్యః స్వతంత్రోథ చ సర్వథా*
*పరిపూర్ణోన పేక్ష్యోన్యైః ప్రగతేః పథి సంచరన్* (5)

*స్వతంత్రతాయాం తస్యాస్తి బాధకో నహి కోపికిమ్*
*యద్ యద్ వాంఛతి తత్తత్ సక్షమః కర్తుమృషీశ్వరః* (6)

*సర్వస్వం కిం తదిచ్ఛాస్తి సామర్థ్యంచ తదీయకమ్*
*భవతా మానవస్యాలం గరిమ్ణో యద్వినిర్మితౌ* (7)

*ఈశ్వరానుగ్రహః ప్రోక్తో వ్యక్తి సౌభాగ్యమేవచ*
*యథార్థమపి తత్రాలం కాఠిన్యం వ్యావహారికమ్* (8)

*క్షమామాణో బాలబుద్ధిం కృపయా వద మానవః*
*సన్మార్గ ప్రస్థితోన్య స్యాపేక్షాం కురుతే న వా* (9)

**టీకా:-** దేవా! మనిషి ఎల్లప్పుడు స్వతంత్రుడు, పరిపూర్ణుడేనా? అతను ప్రగతి మార్గంలో ముందుకు వెళ్ళటానికి ఇతరుల సహాయం అవసరం ఉన్నదా? దీని వల్ల అతని స్వతంత్రతకు అడ్డంకులు వస్తాయా? అతను ఏది అనుకుంటే అది చేయగలడా? అతని ఇచ్ఛ, సామర్థ్యమే అంతానా? మీరు మనుష్యుని గొప్పదనాన్ని చెప్తూ ఈశ్వరుని అనుగ్రహం, వ్యక్తి యొక్క సౌభాగ్యం గురించి చర్చించారు. అవి యదార్థం అయినప్పటికి వ్యావహారిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. నా బాల బుద్ధిని క్షమిస్తూ మనిషి సన్మార్గంలో ముందుకు వెళ్ళటానికి, ఎత్తు ఎదగటానికి ఇతరుల సహాయం అవసరమా? కాదా? దయచేసి వివరించండి.

*ప్రశ్నం శ్రుత్వా మహాప్రాజ్ఞః ప్రసన్నం ప్రశశంస సః*
*జిజ్ఞాసూనా మతి సూక్ష్మాం కథయా మాస తాత హే* (10)

*సారయుక్తా వ ఆశంకా సమాధానం చ శ్రూయతామ్*
*తస్యాః సర్వైః బుధైః సార్ధం సావధానేన చేతసా* (11)

**టీకా:-** ప్రశ్న విని మహాప్రాజ్ఞ చాల ప్రసన్నుడయ్యాడు, జిజ్ఞాసువుల సూక్ష్మ బుద్ధిని మెచ్చుకుని నాయనా! నీ సందేహం చాల సారగర్భితము. దానికి సమాధానం ఇతర విద్వాంసులతో పాటు ధ్యాన పూర్వకంగా విను.

**పిప్పలాద ఉవాచ :**

*జీవోంశ ఈశ్వర స్యాతి తన్నైవాస్తి చ సంయుత ః*
*శ్రేష్ఠమార్గే ప్రయాతుం చేద యాచతే శక్తి మేషతు* (12)

*ఉదారః సదదాత్యేనాం ప్రాప్య చైవం సహాయతామ్*
*కృతకృత్యా భవన్త్యేతే భక్తాస్తే జస్వినో పి చ* (13)

*సిద్ధీస్తా అద్భుతాస్తే తు వృతుం శక్తా భవన్తి చ*
*అగ్రగానాం సురు పాశ్చ ప్రాప్యభూతాః గతాః శ్రమమ్* (14)

**టీకా:-** జీవి ఈశ్వరుని అంశ, అతనితోపాటే జోడింపబడి ఉన్నాడు. శ్రేష్ఠమైన మార్గంలో వెళ్తున్నప్పుడు శక్తి అడిగినట్లయితే ఆయన ఉదారపూర్వకంగా ఇస్తాడు కూడా. ఇలాంటి సహాయాన్ని పొంది అనేక భక్త జనులు కృతకృత్యులయ్యారు. తేజస్విలయ్యారు. అద్భుతమైన సఫలతలు పొందటానికి సమర్థులయ్యారు. అగ్రగాముల వలె విభూతులు ప్రాప్తించుకుని పరమలక్ష్యం వరకు చేరారు.

మనిషికి నిర్ణయించుకోవడానికి పూర్తి స్వతంత్రం ఉన్నది.

పూవులలోని సువాసన, మానవునిలోని యోగ్యత దాచినా దాగవు.

దీనిలో ఆయన ఎప్పుడు వేలుపెట్టడు. మనిషి వివేకముతో ఉత్కృష్టత వైపు అడుగులు వేస్తుంటే అతనికి సహాయం చేయడానికి భగవంతుడు ఎల్లప్పుడు సిద్ధంగానే ఉంటాడు.

*అనన్తం తత్పరం బ్రహ్మేతదచిన్త్యమగోచరమ్*
*సమగ్రం తత్తు విజ్ఞాతుం న హి శక్యం కథఞ్చన* **(15)**

*మనుష్యేణ సహై వాస్తి సత్తా తు పరమాత్మనః*
*సంయుక్తో త్కృష్టతాదర్శవాదితా పరమాత్మనా* **(16)**

*సఘనతా తస్య జీవేన సహ సంయుజ్యతే తతః*
*అనుగ్రహేణ తస్యాపుర్ఫక్తా భూతీర్వరానలమ్* **(17)**

**టీకా:-** పరబ్రహ్మ అనంతుడు, అగోచరుడు. ఆయన ఒక అద్భుతం. ఆయనను సమగ్రంగా తెలుసుకోవడం ఎవరికి సాధ్యం కాదు. మనిషితో పాటు పరమాత్మ సత్తాయే జోడింపబడి ఉన్నది. ఉత్కృష్ట ఆదర్శముల సముచ్చయమే పరమాత్మ. జీవునితో ఆయనకు దగ్గర సంబంధం ఉంటుంది. ఆయన అనుగ్రహంతో వైభవ వరదానాల భాండారం భక్త జనులకు హస్తగతమవుతుంది.

*ఆదర్శ భూత సత్తా తు పరమాత్మన ఏవ సా*
*యుజ్యతే మానవైర్యోగ్యై రనురు పైరలల ముదా* **(18)**

*అనురూపత్వమేవైతదనుకూలత్వమేచ చ*
*ఉచ్యతే మాత్రతా తాం చ ప్రాప్తుమేవాప్త పురుషాః* **(19)**

*ఉపాసనాసాధనానాం విధానాని వ్యధుర్న తు*
*స్తవనోపక్రమస్యాస్తి ప్రభోర్నో పహృతే రతిః* **(20)**

*పాత్రతాం వికసితాం కృత్వా మనుష్యః పరమాత్మనః*
*అనేకానేక దివ్యాను దానాన్యా సాద యత్యయమ్* **(21)**

**టీకా:-** ఆదర్శముల ప్రతీకమైన పరమాత్మ సత్తా ఆయనకు అనురూపమైన మనుష్యులకే సహాయం ఇస్తుంది. ఇలా ఆయనకు అనురూపంగా ఉండటాన్నే పాత్రత అంటారు. పాత్రత వికసింపచేసుకోవడానికి ఉపాసన-సాధన పద్ధతులు చెప్పబడ్డాయి. భగవంతునికి ఎవరి ప్రశంసలు, బహుమతులు అవసరం లేదు. మనిషి పాత్రతని వికసింపచేసుకుని మాత్రమే పరమాత్మ నుండి అనేకానేక దివ్య అనుదానాలు ప్రాప్తించుకుంటాడు.

*గుణ కర్మ స్వభావే షూత్కృష్టత్వస్యాభి వృద్ధికా*
*పరమేశస్య ముఖ్యా సానుకమ్పా విద్యతే ధృవమ్* **(22)**

*ఏత ద్రాశిత్య వ్యక్తిత్వం పరిష్కృతమథా భవత్*
*ఫలతోస్త ప్రఖరతాం బాహ్యేస సాధు భావనామ్* **(23)**

*వర్ధమానాం సదా పశ్యత్యలం ద్వే యస్య బాధతే*
*విభూతీ వస్తునస్తస్య నాస్తి కస్యాపి న్యూనతా* **(24)**

**టీకా:-** పరమేశ్వరుని ప్రధానమైన అనుగ్రహం ఏమిటంటే గుణ కర్మ స్వభావాలను అభివృద్ధి చేయుటయే. దీని వల్ల మనిషి వ్యక్తిత్వం పరిష్కృతమవుతుంది (ఎదుగుతుంది). ఫలస్వరూపంగా ఇది పొందిన వారి అంతఃక్షేత్రములో ప్రఖరత, బాహ్యక్షేత్రంలో సద్భావనలు ఎక్కువ అవుతూ కన్పిస్తాయి. ఈ రెండు విభూతులు ఎవరికి లభిస్తాయో వారికి ఎటువంటి వస్తువుల లోటు ఉండదు.

*ఈశ్వరస్య తు సద్భక్తిః సాధకం మాన్య సద్ గుణైః*
*పరిపూర్ణం వినిర్మాతి సహైవోదారతాం తథా* **(25)**

*దదాతి యేన కార్యం స్వం పూరయన్న్యున తస్తథా*
*ఉపలబ్ధేర్లాభయుక్తం కర్తుం శక్యేత భూతలమ్* **(26)**

*ఏతాదృశాస్తు భక్తా యే భూసురాస్తే తు నిశ్చితమ్*
*ఆయాచితమజస్రం తే లభన్తే యోగమైశ్వరమ్* **(27)**

**టీకా:-** నిజమైన ఈశ్వర భక్తి సాధకుడిని మానవీయ సద్గుణములతో పరిపూర్ణుడిని చేస్తుంది. దీనితో పాటు ఎలాంటి ఉదారత ఇస్తుందంటే తమ పనులను వీలయినంత తక్కువతో పూర్తి చేసుకొని తన సంపత్తితో విశ్వవసుధను లాభాన్వితం చేస్తాడు. అటువంటి భక్తజనులను భూమిపై దేవతలుగా చెప్పబడతారు. వారేమి అడుగకుండానే ఈశ్వరుని సహాయం నిరంతరం లభిస్తూనే ఉంటుంది.

*ఈశ్వరానుగ్రహమాత్మ విశ్వాసం యోధిగచ్ఛతి*
*సమర్థః స తథా మాన్యే కుబేరేంద్రాను కమ్పితః* **(28)**

*ఇమాన్యప్తు మేకమాత్రముపాయో యోగ్యతోదయః*
*సఘనాత్మీయతా చాస్య హేతోర్యోజ్యేశ్వరేణ తు* **(29)**

*అనుశాసనం ప్రభోస్తస్య స్వీకర్తవ్యం భవత్యపి*
*మహతే సమర్పితాత్మాన స్త ద్రూప సమతాం గతాః* **(30)**

**టీకా:-** ఆత్మ విశ్వాసం, ఈశ్వర అనుగ్రహం పొందిన వ్యక్తి ఎంత సమర్థుడు, సంపన్నుడు అవుతాడంటే ఇతనికి ఇంద్రుడు, కుబేరుడు సహయోగం లభించిందా అని అనిపిస్తుంది. వీటిని ప్రాప్తించుకునేందుకు ఒకటే ఉపాయం ఉన్నది. తమ అర్హతలను పెంపొందించుకోవాలి. దీని కొరకు ఈశ్వరునితో అతి సన్నిహితమైన ఆత్మీయత కావాలి. ఆయన ఆజ్ఞలను పాటించాలి. గొప్ప వారికి సమర్పణ చేసుకునే వారు వారిలాగే తయారవుతారు.

– అనువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

స్నేహం ఎక్కువ కాలం నిలవాలంటే అతిగా సలహాలివ్వడం మానివేయాలి.

తత్వ చింతన

# జాతస్య హి ధృవో మృత్యుఃధృవం జన్మ మృతస్య చ

జీవాత్మ అమరమైనదని, మరణించిన తరువాత అది తాను చేసిన కర్మలను బట్టి చిన్నవి, పెద్దవి అయిన క్రిమి కీటకాలు, పశు పక్ష్యాదులతో సహా మనిషిగా పుట్టడం జరుగుతుంది అని భారతీయ దర్శనాలు తెలుపుతున్నాయి. శాస్త్రాలలో ఈ యోనుల సంఖ్య ఎనభైనాలుగు లక్షలుగా పేర్కొనబడింది. మనిషిగా పుట్టిన జీవుడు మరు జన్మలోకూడా మనిషిగానే పుడతాడని కూడా తెలియచేశాయి. ఈ మాట తర్క సమ్మతమైన మాటయే. జీవుడు పొందిన చైతన్యాన్ని బట్టి అతని మరుజన్మ ఏర్పడుతుంది. ఆ చైతన్యము పరిపూర్ణ స్థితికి చేరితే మరుజన్మ మానవ జన్మకావడము తథ్యం. వ్యక్తి తన చిన్ననాటి దుస్తులను ధరించి వ్యవహరించలేడు. అదే విధంగా మనిషిగా పుట్టిన జీవుడు మళ్లీ పశువుగానో, పక్షిగానో పుట్టడము జరుగదు. జీవుడు క్రింది స్థాయినుంచి క్రమముగా వికసిస్తూ మానవుడుగా పుడతాడు. డార్విన్ యొక్క ప్రఖ్యాతమైన పరిణామ సిద్ధాంతము ప్రకారము జీవుడు ఒకసారి జన్మించిన తరువాత మరు జన్మలో దానికన్నా పైదయిన ప్రాణిగా పుడుతూ చివరకు మానవ జన్మ ధరిస్తాడే గాని క్రింది స్థాయికి దిగజారడు.

చేసిన కర్మలకు తగిన ఫలితము అనుభవించడం తప్పదన్న దృష్టితో చూసినట్లైతే మానవ జన్మలోనే చెడు కర్మల యొక్క ఫలితాన్ని ఎక్కువగా అనుభవించడము జరుగుతుందిగానీ ఇతర జన్మలలో జరుగదని గ్రహించాలి. మనిషికి శరీర కష్టాలకన్నా మానసిక చింత అధికముగా ఉంటుంది. శోకము, అవమానము, చింత, భయము, నష్టము, వియోగబాధ వంటివాటితో మనిషి ఎంతో మానసిక వ్యాకులతను అనుభవిస్తాడు. ఇతర ప్రాణులకు మనిషికి గల మానసిక వికాసముండదు. అందువలన వాటికి మానసికమైన బాధ అంతగా ఉండదు. పాపపు పనుల యొక్క ఫలితాన్ని అనుభవించడానికి మనిషి పశుపక్ష్యాదుల జన్మలను ఎత్తవలసిన అవసరము రాదు. ఈ విషయములో యావత్తు విశ్వములో లభించిన ప్రమాణాలన్నీ మనుష్యులకు సంబంధించిన అనుభవాలు, జ్ఞాపకాలను గురించి వివరించేవి మాత్రమే. దీనినిబట్టి మనిషి మళ్లీ మనిషిగానే పుడతాడుగాని ఇతర జీవులుగా పుట్టడని తేలుతోంది.

పునర్జన్మకు సంబంధించిన సంఘటనలను వైజ్ఞానిక భాషలో "పెరానార్మల్ ఫినామినా" అంటారు. అందులో పునర్జన్మను గురించి అధ్యయనము చేయడము జరుగుతుంది. ఈ విషయంలో వైజ్ఞానికులు ఎంతో లోతుగా పరిశోధన చేసి అనేక ప్రమాణాలు చూపించారు. పాశ్చాత్య దార్శనికులలో పైథాగరస్, ఎమర్సన్, డ్రాయిడన్, వర్డ్సవర్త్, మేద్యూ, యర్నాల్డ్ వాల్ట్ విట్‌మెన్, రౌలీ, బ్రవునింగ్ మొదలైనవారు పునర్జన్మ సత్యమని అంగీకరించారు. అనుసంధానకర్తలైన విజ్ఞానవేత్తలలో సర్‌విలియం చార్నెట్, అవి వర్‌లోంజ్, సర్‌విలియమ్ కూల్, అల్ఫ్రెడ్ రసేలేవా లేస్, ఇవాన్ స్టీవెన్సన్, గనే, మాయర్జ్, ఫ్రెంక్ పోయిమీర్ హయిసన్, విలియమ్ జేమ్స్ మొదలైన ప్రముఖులు మనిషికి పునర్జన్మ కలదని సోదాహరణంగా తెలిపారు. ఈ విషయాన్ని గురించి పాశ్చాత్య దేశాలలో ఎన్నో పరిశోధనా సంస్థలు కృషి చేస్తున్నాయి. అవి ఇప్పటివరకూ చేసిన పరిశోధనలు మనిషి మరల మనిషిగానే పుడతాడన్న సిద్ధాంతానికి బలము ఇచ్చాయి. పునర్జన్మకు సంబంధించిన అనేక ప్రామాణిక గ్రంథాలు కూడా అక్కడ వెలువడ్డాయి.

అమెరికాలోని వర్జీనియా విశ్వవిద్యాలయములో ప్రముఖ పరిశోధకుడుగా పని చేసిన డా. స్టీవెన్‌సన్ అను విజ్ఞానవేత్త భారతదేశముతో సహా విశ్వమందలి వివిధ దేశాలనుంచి పునర్జన్మనకు సంబంధించిన అనేక సంఘటనలను సేకరించడం జరిగింది. దేవ సంస్కృతిలో ఆత్మ యొక్క అమరత్వాన్ని గురించి, పునర్జన్మను గురించి, కర్మఫలము యొక్క సునిశ్చిత స్థితిని గురించి అనాదిగా నమ్మకము ఉంటూ వచ్చింది. బెంగుళూరులో గల రాష్ట్రీయ మానసిక స్వాస్థ్య మరియు తాంత్రిక విజ్ఞాన సంస్థానమునకు చెందిన మనో విజ్ఞానవేత్త డాక్టర్ పసరీచా అనువారు ఈ విషయాన్ని గురించి చాలా లోతుగా అధ్యయనము చేశారు. ఆయన డాక్టర్ స్టీవెన్సన్ యొక్క నిర్దేశనములో పునర్జన్మకు సంబంధించిన అనేక ప్రామాణిక సంఘటలను సేకరించి డాక్టరేట్ డిగ్రీని పొందారు.

ఆయన సేకరించిన సంఘటనలలో ఒకదానిని ఇక్కడ ఉదహరించడం జరుగుతోంది. ఉత్తరాఖండములోని పామౌలీ అన్న గ్రామములో మాలతీ శంకర్ అన్న పేరుగల ఒక బాలిక ఉండేది. ఆ బాలిక పూర్వజన్మ నామము కృష్ణ. ఆమె చమోలీలో ఉండేది. మాలతి రెండు సంవత్సరాల వయసులో ఉండగా ఒక రోజున

నిన్ను నీవు నిర్దయగా విమర్శించుకుంటే ఇతరుల పట్ల దయగా మెలగడం నేర్చుకుంటావు.

తన తల్లిదండ్రులను ఆశ్చర్యపరుస్తూ తాను పూర్వజన్మలో అక్కడికి నాలుగు మైళ్ల దూరములోగల చమోలీ గ్రామవాసినని చెప్పింది. తన తండ్రి తమలపాకుల వ్యాపారి అని చెప్పింది. తన కుటుంబాన్ని గురించి తన మరణాన్ని గురించి ఎంతో విపులంగా వివరించింది. ఒక రోజున తాను శివాలయంలో శివునికి అభిషేకం చేయడానికి నీళ్లు తీసుకురావడానికి వెళ్లినప్పుడు నీటిలో మునిగి అకాలమృత్యువుకు లోయినట్లు చెప్పింది. కాని ఆ పసిదాని మాటలను తల్లీ, తండ్రీ పట్టించుకోలేదు. సామాన్యంగా పిల్లలు చెప్పే ఇటువంటి మాటలను పిల్ల మాటలుగా భావించి పట్టించుకోకపోవడము జరుగుతూనే ఉంటుంది. కొంత కాలానికి పూర్వజన్మను గురించి మరచిపోవడం జరుగుతుంది, పూర్వ జన్మ స్మృతి, విస్మృతి అన్నగోతిలో పడి పూడుకుపోతుంది. వయసు పెరిగిన కొద్దీ మాలతి తన పూర్వ జన్మను గురించి మరచిపోవడం జరిగింది. మామూలు జీవితం సాగిస్తోంది.

కానీ ఒక రోజున చమోలీ గ్రామనివాసి బలదేవుడన్న పేరుగల ఒక వ్యక్తి పామోలీకి వచ్చాడు. సమీపంలో ఆడుకుంటున్న మాలతి చూపు అతని మీద పడింది. వెంటనే అతనిని చిన్నాయనా అని పిలవడం మొదలు పెట్టింది. బలదేవుడు మాలతి పిలుపును పట్టించుకోలేదు. ఆ పిల్లను అతను గుర్తించలేదు. మాలతి తన పూర్వ జన్మకు సంబంధించిన కుటుంబాన్ని గురించి చెబుతూ అతడిని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

బలదేవుడు మాలతి చెప్పిన విషయాలను గుర్తుపెట్టుకుని తన స్వగ్రామానికి వెళ్లిన తరువాత కృష్ణ తల్లి దండ్రుల దగ్గరకు వెళ్లి జరిగినదంతా వాళ్లకు చెప్పాడు. అతను చెప్పినదంతా వినిన మీదట ఆ కుటుంబ సభ్యులకు వెంటనే పామౌలీకి వెళ్లి ఆమెను చూడాలన్న ఆరాటం కలిగింది. వెంటనే బయలుదేరి పామౌలీ చేరుకున్నారు. వాళ్లను చూడగానే మాలతి అందరినీ గుర్తుపట్టింది. ప్రధానంగా తన పూర్వ జన్మలో తల్లిని గుర్తించి ఆమెను కౌగిలించుకుని ఏడవడం మొదలుపెట్టింది. కుటుంబంలోని ఇతర బంధువులు ఆమెను చూసి ఎంతో ఆనందించడము జరిగింది. వాళ్లు ఆమెను అడిగిన ప్రశ్నలకన్నింటికీ సంతోషంగా సమాధానమిచ్చింది. దాంతో వాళ్లందరికీ ఆమె పూర్వజన్మలో తమ కుటుంబ సభ్యురాలు కృష్ణయే అన్న నమ్మకం కలిగింది. ఆ తరువాత డాక్టర్ పసరీచా, ఇతరవైజ్ఞానికులు ఆ సంఘటనను గురించి లోతుగా పరిశీలించి నిజమని తేల్చి చెప్పారు.

పునర్జన్మకు సంబంధించిన అనేక సంఘటనలు ఆయా సమయాలలో వెలుగు చూస్తూ వచ్చాయి. లోగడ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' అన్న సమాచార పత్రికలో గోపాలుడన్న రెండున్నర సంవత్సరాల వయసుగల ఒక పిల్ల వానికి సంబంధించిన విషయము ప్రచురింపబడింది. ఆ పిల్లవాని తండ్రి ఢిల్లీలోని అసఫ్ ఆలీ రోడ్డులోనున్న ఒక పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఒకరోజున గోపాల్ తన తండ్రితో తాను మథురా నగరములోని ఒక పేరున్న కుటుంబములో సభ్యుడనని, తన పేరు శక్తి ప్రసాద్ అని, 1948వ సంత్సరంలో తాను మూపై ఐదు సంవత్సరాల వయసున్న వాడినని, ఆ సమయంలో తనకు, తన సోదరునికి మధ్య తగాదావచ్చిందని, దాని ఫలితంగా తన సోదరుడు తన మీద తుపాకీ పేల్చి హత్య చేశాడని చెప్పాడు. తండ్రికి మొదట్లో అతని మాటల మీద నమ్మకం కలుగలేదు. కానీ గోపాల్ తాను చెప్పింది నిజమని, తన మాటనమ్మమని గట్టిగా పట్టుబట్టాడు. అప్పుడు తండ్రి గోపాల్‌ను మథురకు తీసుకువచ్చి విచారించి చెప్పినది నిజమని తెలుసుకున్నాడు.

ఇదే విధమైన సంఘటన శ్రీలంకలో కూడా జరిగింది. అది ఈనాడు అంతటా చర్చింపబడుతున్న విషయమయింది. ఆ సంవత్సరము జనవరి మాసము మధ్యలో శ్రీలంకలోని వార్తా పత్రికలు ఆ వార్తను ప్రచురించాయి. శ్రీలంకలోని నువారా ఏలియా జిల్లాకు చెందిన ఒక రైతు కుటుంబంలో పుట్టిన రెండు సంవత్సరాల పిల్లవాని పునర్జన్మకు సంబంధించిన సమాచారాన్ని వార్తా పత్రికలు ప్రచురించాయి. 'సామంత్ నువాన్ బండారా విజేబహు' అన్న పేరుగల ఆ పిల్లవాడు తాను పూర్వజన్మలో శ్రీలంకకు పూర్వ రాష్ట్రపతియైన ఆర్.ప్రేమదాసనని, తనను బాబు అన్న పేరుగల తమిళ ఆత్మాహుతి దళ సభ్యుడు ఏ విధంగా హత్య చేసినదీ వివరంగా తెలియజేశాడు. 1993వ సంవత్సరములో తమిళ ఆత్మాహుతి సభ్యుడు బాంబు పేల్చి అప్పటి శ్రీలంక రాష్ట్రపతి ప్రేమదాసను చంపిన విషయము అందరికీ తెలిసినదే. ఆ తరువాత నాలుగు సంవత్సరాలకు 1997 సెప్టెంబరు 2వ తేదీన విజేబహు జన్మించాడు. ఈ రెండు సంవత్సరాల పిల్లవాని రూపురేఖలు, అతని పూర్వ జన్మకు చెందిన ప్రేమదాస రెండు సంవత్సరాల వయసులో గల రూపురేఖలు ఒకే విధముగా ఉన్నాయని వాళ్లిద్దరి ఫొటోలు ప్రత్యక్షంగా చూచినవాళ్లు నిర్ధారించడం జరిగింది. అతను పూర్వ జన్మలో తన దిన చర్యను గురించి, తన కుటుంబ సభ్యుల నామధేయాలను ఎంతో వివరంగాను, స్పష్టంగాను పాత్రికేయులకు తెలియచేశాడు. అతని దినచర్య వయసు ముదిరిన వృద్ధుల దినచర్యను పోలిఉండేదట. ప్రతి రోజు తెల్లవారు ఝామున మూడు గంటలకు

**సిగ్గు, బిడియం అనేవి పరిమిత సమయాల్లోనే ఉండాలి.**

నిద్రలేచి బౌద్ధ ప్రార్థన చేయడము అతని దిన చర్యలో ప్రముఖమైన కార్యము. ఇదే పద్ధతి చనిపోయిన రాష్ట్రపతి ఆర్. ప్రేమదాస యొక్క దిన చర్యలో ఉండేదట.

ఈ ఘటన పరామనో విజ్ఞానవేత్తల చేత విశ్లేషించబడింది. అందులో కనబడిన వాస్తవాలను చూసి వారికి ఆశ్చర్యం కలిగింది. ఐతే ఆత్మయొక్క ఉనికిని విజ్ఞాన శాస్త్రము నిజమని నిరూపించినప్పుడు విషయము వేరుకావచ్చును. కానీ ఇప్పుడు పునర్జన్మ ఆత్మ యొక్క నిరంతర ప్రయాణము ప్రత్యక్షముగా ప్రమాణితములౌతున్నాయి.

ఈ విషయాన్ని గురించి యోగా వాశిష్టములోని 6/1/50/39/ లో

**"కాలే కాలే చితా జీవస్త్వన్యోన్యో భావయతి**
**భావితా కారవానంతము కలికోద వాతే**

అనగా తన లోపల గల వాసనలకు ఒక స్వరూపాన్ని కల్పించడానికి గాను జీవుడు తన శరీరాన్ని మార్చుకుంటూ ఉంటాడని అర్థము.

ఈ విధంగా పునర్జన్మకు సంబంధించిన అనేక ఉదాహరణలు భారతదేశములోను, ప్రధానంగా హిందూ సమాజములోను అనేక సమయాలలో లభిస్తూ వచ్చాయి. వాటిలో పూర్వజన్మకు చెందిన జ్ఞాపకాల వాస్తవికతల ఆధారంగా గొప్ప గొప్ప విజ్ఞాన అనుసంధానవేత్తలు వాటిని నిజమని నిరూపించారు. అయితే ముస్లిమ్, క్రైస్తవ సమాజాలలో పునర్జన్మను అంగీకరించే సంప్రదాయములేదు. పరామనో విజ్ఞాన సంస్థలు ఆ సంప్రదాయముల వారిలో కూడా సంభవించిన పునర్జన్మకు సంబంధించిన సంఘటనలను సేకరించి చూపించడం జరిగింది. అవి గీతా చార్యుడైన శ్రీకృష్ణపరమాత్మ తెలిపిన "వాసాంసి జీర్ణాని యథావిహాయ" అన్న మాటను అక్షరశః నిజమని నిరూపించాయి.

1959కి చెందిన మరి యొక సంఘటన. ఉత్తర ప్రదేశ్‌లోని వరేలీ జిల్లాలో కరీమ్ ఉల్లాహ్ అన్న పేరుగల ఒక ఐదు సంవత్సరాల పిల్లవాడు తన పూర్వజన్మకు సంబంధించిన వివరాలు చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ పిల్లవాని తండ్రి ఇస్మనుల్లాహ్ అంసారీ అతనిని తీసుకుని బరేలీలోని ఒక పేరున్న ముస్లిమ్ శ్రీఇక్‌రామ్ అలీని కలవడానికి వెళ్లిన సందర్భంలో ఈ సంఘటన జరిగింది. అతనికి ఇద్దరు పిల్లలు. వాళ్లలో ఒకడు పాకిస్తాన్‌లోను, రెండవవాడు భారతదేశములో అతని దగ్గరే వుండేవారు. అతని దగ్గరున్న పిల్లవాని పేరు మహమ్మద్ షారుక్. షారూక్ 1954లో చనిపోయాడు.

శ్రీ అంసారీ ఇక్ రామ్ ఆలీ దగ్గర పిల్లలకు చదువు చెప్పేవాడు. ఆ రోజున అతను కరీమ్‌ను తీసుకుని అలీ ఇంటికి వెళ్లగానే కరీమ్ అది తన ఇల్లేనని, తాను పూర్వ జన్మలో మహ్మద్ ఫరూక్ అన్న పేరుతో ఆ ఇంటిలో కుటుంబంలో ఒకడినని చెప్పడం మొదలు పెట్టాడు. అక్కడున్న తన పూర్వ జన్మకు చెందిన వస్తువులనన్నింటినీ గుర్తు పట్టాడు. అప్పటి తన భార్య ఫాతిమా బేగమ్‌ను కూడా గుర్తు పట్టాడు. ఆమెతో అప్పటిలాగే మాట్లాడాడు. ఆనాటి తమ దాంపత్యానికి చెందిన అనేక రహస్యాలు తమకు మాత్రమే తెలిసిన వాటిని కూడా చెప్పడం మొదలుపెట్టాడు. అంతేగాక తాను తన సోదరుని కోసము ఐదువేల రూపాయలు పాకిస్తాన్ పంపించినది, తన పేర బ్యాంక్‌లో మూడు వేలు జమ చేయబడినది వంటి రహస్యాలు కూడా చెప్పాడు. ఇవన్నీ విన్న మీదట ఇక్‌రామ్ అలీ కుటుంబసభ్యులు అవన్నీ నిజమని తేల్చి చెప్పారు. మహమ్మద్ షారూక్ 1954లో మరణించాడు. అదే సంవత్సరము కరీమ్ ఉల్లాహ్ అదే ఊళ్లో పుట్టడం జరిగింది. పునర్జన్మకు సంబంధించిన ఈ సమాచారము వారణాసినుంచి వెలువడే 'సంసార్' అన్న వార్త పత్రిక 3/7/59లో వివరంగా ప్రచురింపబడింది. ఇదే గాక ఇతర వార్తా పత్రికలు కూడా ఈ విషయాన్ని ప్రచురించాయి.

అనుసంధానకర్తలు పునర్జన్మకు సంబంధించిన అనేక వాస్తవాలను సేకరించారు. ఐతే వాటన్నింటిలోకి ఎడ్గర్ కేసీ ప్రకటించిన వాటికే ఎక్కువ ప్రాధాన్యతను, ప్రామాణికతను ఇవ్వడం జరిగింది. ఆయన ఇచ్చిన వివరణల వలన మంచి పనుల లేక చెడ్డ పనుల ఫలితములు ఈ జన్మలోగాని, లేక మరుజన్మలోగాని తప్పకుండా లభిస్తాయని తేలింది. అతను చూపించిన ప్రమాణాలలో చాలామటుకు కష్టాలతో పీడింపబడిన, లేక వికలాంగులు, రోగ పీడితులకు సంబంధించినవి. ఆయన వివరించిన సంఘటనలను, వాటి వివరాలను బట్టి కర్మఫలము అనుభవించక తప్పదని, పునర్జన్మ అన్నది నిజమని, శరీరము పోయినా ఆత్మపోదని, అది అనేక జ్ఞాపకాలను తనలో నింపుకుని ఉంటుందని తేలింది. ఈ విషయము నిరూపింపబడడం వలన వ్యక్తి ముందు చూపుతో, వివేకంతో సత్కర్మలు చేస్తూ, చెడు పనులను విడనాడి, భగవంతునియందు నమ్మకము కలిగి మంచి పనులు చేయడంలో నిమగ్నుడు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది.

★★★

**సత్యాలను నిర్లక్ష్యం చేస్తే ఏదో ఒకనాడు అవి నీపై దాడి చేస్తాయి.**

ధారావాహిక: పరమేశ్వరుని చిరునామా-15

# చీమల జీవనం

సుప్రసిద్ధ జీవ శాస్త్రవేత్త ఒకసారి చీమల సామాజిక జీవనాన్ని అధ్యయనం చేస్తున్నాడు. ఏకావికిన మస్తిష్కంలో ఒక కుతూహలం నిద్రలేచింది. ఈ చీమలను వాటి పుట్టను వదిలివెళ్ళేట్టు చేస్తే అవి ఏం చేస్తాయి? బేట్ చీమల గంభీరమైన బుద్ధిని, వాటి సూక్ష్మతను అంచనా వేయాలని అనుకున్నాడు. చీమల పుట్ట వద్ద వాటికి ఆటంకం కలిగే వాతావరణాన్ని సృష్టించాడు. పుట్ట దగ్గర భూమిమీద కొట్టడం, నీళ్ళు చిలకరించడం, విచిత్రంగా గోలచేయడం లాంటివి చేశాడు. చీమలు వీటిని అతివృష్టి, అనావృష్టి, తుఫాన్, సముద్ర ఉప్పెన లాంటివిగా గుర్తించాయి.

చీమల పుట్ట ఉన్న స్థానానికి అర అడుగు దూరంలోనే ఒక చిన్న లోతట్టు ప్రాంతం ఉన్నది. సర్వేయరు చీమలు హడావుడిగా బయటకు వచ్చి ఆ ప్రాంతమంతా తిరిగి లోతట్టు ప్రాంతాన్ని సురక్షితంగా నిర్ణయించాయి. పుట్టలోకి వెళ్ళడంతోనే కార్మిక గణం సామాను తీసుకొని బయటకు వచ్చి రెండు దళాలుగా తయారయ్యాయి. ఒక దళం తమ మహారాణిని తీసుకొని క్రిందకు దిగి కొత్తగా కనిపెట్టిన స్థానం వద్దకు వచ్చి పుట్ట బయట వరుసగా నిలబడ్డాయి. అవి ఏదో విశేషమైన పని చేయడానికి తయారవుతున్నట్లు కనిపించింది.

ఎక్కువ సామానుతో చాలా దూరం ప్రయాణం చేయవలసి వచ్చినపుడు మనిషి బస్సు, రైలు, విమానాలను ఆశ్రయిస్తాడు. చీమల దగ్గర అలాంటి వాహనాలు లేకపోవచ్చు. ఆదిమ యుగ పురుషులలాగా తెలివితో యాంత్రిక జీవనాన్ని ఉపేక్షించి ప్రాకృతిక జీవనమే మంచిదని భావించి ఉండవచ్చు. అందుకే వాహనాల రచన చేసి ఉండకపోవచ్చు. అయితే వాటిలో పరిస్థితులను విశ్లేషించి తదనుగుణంగా పనిచేసే శక్తి లేదని అనలేము. పైన ఉన్న చీమల రెండవ దళం సమయం మరియు భారం కాపాడుకోవడానికి సమాను క్రిందికి వేయడం ప్రారంభించాయి. క్రింది చీమలు వాటిని అందుకొని పుట్టలోపలికి చేరవేస్తున్నాయి. తుఫాన్ ప్రాంతంలో హెలికాప్టర్ ద్వారా అన్నం పొట్లాలను విసిరివేసినట్లు ఉంది ఆ పరిస్థితి.

బుద్ధిపరంగా చీమలు మనిషికి ఏ మాత్రం తీసిపోవని ఈ సంఘటన ఋజువు చేస్తున్నది. చిన్న చిన్న జీవుల సూక్ష్మ జ్ఞాన శక్తి ఏమి చెబుతుందంటే ఆత్మతత్వం ఎంత చిన్నదైనా లేదా ఎంత పెద్దదైనా ఆత్మిక గుణాల దృష్టిలో ఒక్కటే. మరి మనిషి తనకు తాను సృష్టిలో అన్నింటికంటే తెలివైన జీవి అనే అహంకారం ఉండకూడదు.

మానవజాతి ఆచార వ్యవహారాలు, నివాస విధానం చిన్న చిన్న చీమలలో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. జీవులలోని కందిరీగ, తేనెటీగ లాంటి 'హీమెనోటెరా' చీమలు అన్నింటికంటే తెలివైనవి. ఐకమత్యం, సలహాలు సంప్రదింపులు, ఆలోచనా శక్తి, ఆంతరిక ప్రేరణలతో పాటు కర్తవ్యపాలనా నియమాలు, పరస్పర మంచి చెడుల చింతన చీమలలో ఉన్నట్లుగా మనిషిలో కూడా ఉండియుంటే సృష్టిలోని జీవుల అన్నింటికంటే మనిషి ఎక్కువ సుఖజీవిగా ఉండి ఉండేవాడు. భగవంతుడు చీమలకు వాక్కు ఇవ్వలేదు కాని వాటి తలలో ఉండే జ్ఞాన తంతువులు ఎంత జాగృతమై ఉంటాయంటే తలను మరొకదాని తలను స్పర్శించడంతోనే దాని ఆలోచనలను సునాయాసంగా గ్రహిస్తుంది. భారతీయులు పరావాణి జ్ఞానాన్ని చీమల నుండే పొంది అద్భుతమైన యోగసాధనాలను అభివృద్ధి పరిచారు. వాటి ద్వారా ఎవరైనా నోటితో చెప్పకపోయినా వారి భావాలను ఆకాశం ద్వారా పట్టుకోగలిగే విధంగా మస్తిష్క జ్ఞాన తంతువులను జాగృతం చేయగలరు.

స్వార్థం మరియు అహంకారం వలన చీమలు కూడా లూటీలు, దొంగతనాలు చేస్తాయి. ప్రక్కనే ఉన్న చీమల కాలనీల మీద దాడి చేసి వస్తువులు లాక్కు వెళ్తాయి. అయితే ఇందులో కూడా వాటి క్రమశిక్షణ, నైతికత, మనుషుల కంటే అధికంగా ఉంటుంది. జీవ శాస్త్రవేత్త డా॥ డగ్లస్ ఆఫ్రికా అడవులలో చీమల మధ్య జరిగే యుద్ధాలను రోమాలు నిక్కబొడుచుకునే విధంగా వర్ణించాడు. మహాయుద్ధం లాంటి ఈ దాడి రెండు చీమల దళాల మధ్య 17 రోజులు జరిగింది. ప్రతిరోజు ఉదయాన్నే యుద్ధం ప్రారంభమవుతుంది. సాయంత్రం విరామం. చీమల రెండు దళాలలో సైనిక ఆహార సామాగ్రి చేరవేసేవి వేరుగా, నిర్మాణ కార్యాన్ని నిర్వహించేవి వేరుగా, సందేశాలు చేరవేసే విభాగం వేరువేరుగా పనిచేస్తూ కనిపించాయి. పోరాడే చీమలను సెంగ్విన్ అంటారు. రాత్రులలో వాటి గూఢచార విభాగం చక్కగా పనిచేస్తూ ఉంటుంది. అనేక శత్రుచీమలు బందీలుగా దొరుకుతాయి. వాటిపట్ల ఖైదీలతో ఎలా వ్యవహరిస్తారో అలాగే వ్యవహరిస్తాయి. లూటీలో లభించిన ఇతరుల సామాగ్రిని అక్కడ జమ చేయడం జరుగుతుంది. గెలిచిన పక్షానికి చెందిన చీమలు ఆనందంతో సంబరాలు జరుపుకుంటాయి. బాగా తాగి తోకలు ఆడించుకుంటూ నృత్యం చేశాయి. ఈ ఉత్సవం చాలా రోజుల వరకు జరిగింది. ఓడిపోయిన దళంలో మిగిలిన చీమలను విజయం సాధించిన దళం బానిసలుగా మార్చి కూలి పని చేయించుకుంటుంది.

**గుణానికి మనకంటే ఎక్కువ వారితోను-ధనానికి తక్కువ వారితోను పోల్చుకోవాలి.**

'పైన త్రాగడం' అనే పదం ఉపయోగించబడింది. అది అనవసరంగా ప్రయోగించబడలేదు. మానవజాతి తమ మద్యపానంలోని చెడును అర్థం చేసుకోలేక పోతున్నది, తమ దోషములను దోషములుగా కాక ప్రత్యేకతగా గుర్తిస్తున్నారు. అందువలననే మద్యపానాన్ని నాగరికతకు ప్రతీకగా గుర్తిస్తున్నారు. కాని దానివల్ల వచ్చే రోగాలు శారీరిక సామర్థ్యాన్ని నాశనం చేస్తాయి. ఆర్థిక దుబారా జరుగుతుంది. బుద్ధి నశిస్తుంది. వంశపారంపర్య కుసంస్కారాలు వేళ్ళూనుకుంటాయి. భయంకరమైన ఆపదలు ఎదురవుతాయి. వీటిని ప్రజలు గుర్తించరు. చీమలు కూడ అనేకసార్లు ఇలాంటి మూర్ఖత్వాన్నే ప్రదర్శిస్తాయి. దానికి ఎంత భారీ మూల్యం చెల్లిస్తాయో మనిషి తెలుసుకోగలిగితే అతడు కూడా మద్యపానానికి భయపడకుండా ఉండలేడు.

చీమల కోసం మద్యం కాంట్రాక్టును ఒకరకమైన చీమలు తీసుకుంటాయి. వీటి శరీరంలో బంగారు రంగుగల వెంట్రుకల కుచ్చులు ఉంటాయి. వాటి నుండి ఒక విశేష సువాసన గల ద్రవాన్ని విడుదల చేస్తాయి. ముందుగా ఒక సమ్మోహక సంగీత ధ్వనిని వినిపిస్తాయి. ఆ ధ్వని చీమలను అటువైపు లాక్కుంటుంది. గుంపులు గుంపులుగా చీమలు దాని వెనకబడతాయి. అది అలా శబ్దం చేసుకుంటూ ముందుకు సాగుతుంది. సమ్మోహితులైన చీమలు దాని వెనుక ఉంటాయి. ఇపుడు ఆ చీమ తన శరీరం నుండి ఆ మాదక పదార్థాన్ని విడుదల చేస్తుంది. దానిని తమ ప్రియమైన మద్యంగా భావించి చీమలు తాగితాగి తూలుతూ, ఊగుతూ ఉంటాయి. తల మీద కూర్చున్న సైతాను ఉచితానుచితాలను ఆలోచించనివ్వదు. అదేవిధంగా చీమలు కూడా తాగితాగి స్పృహను కూడా కోల్పోతాయి. అపుడు ఆ మద్యం చీమలు మనుషులను రోగాలు వేటాడినట్లు చీమలను వేటాడుతుంది. ఈ దృష్ట్యా మనిషి కూడా చీమలలాగానే మూర్ఖుడని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. చీమలలో కూడా తెలివైన రాణీ చీమలు ఆ మద్యం చీమల ఇంద్రజాలంలో పడకుండా హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. కాని మానవ సమాజంలో అలాంటి తెలివైన, సేవాభావం గల మనిషిని చెడు నుండి రక్షించే వారు ఎక్కడున్నారు?

అనేక మద్యం చీమలు వేటచీమలు కావు. అవి చీమలకు మద్యం తాగించి విశృంఖలంగా, కర్తవ్య విముఖులుగా, క్రూరంగా తయారు చేస్తాయి. అలాంటి మద్యం చీమలను దళంలోని ఇతర చీమలు చెడ్డవిగా భావించినపుడు తాగుబోతు మనిషిని చెడ్డవాడు అనడంలో ఆశ్చర్యం ఏముంది?

మానవ ప్రపంచం చాలా విచిత్రమైనది. చీమల ప్రపంచం కూడా అంతకంటే తక్కువేమీ కాదు. మనిషి యొక్క ప్రతి పనిలో తెలివి కనబడుతుంది. కాని నిశితంగా చూస్తే చీమల వ్యవహారాలలో కూడా అంతకంటే ఎక్కువ తెలివి కనబడుతుంది. అవి విధిగా పుట్టలు నిర్మించుకొని నివసిస్తాయి. వాస్తు కళలో చీమలు మనిషి కంటే కొంచెం వెనుకబడి ఉన్నాయి. నీళ్ళు తీసివేయడం మరియు వర్షాకాలంలో పుట్టలోపల సురక్షితంగా ఉండడానికి చక్కని పుట్టలను తయారుచేస్తాయి.

మనిషి పశుపాలనా నైపుణ్యంలో గర్వం ఉండవచ్చు. కాని చీమలలో మరియు మనుష్యులలో ఈ విషయంలో పెద్ద తేడా ఏమీ లేదు. పాలిచ్చే చీమలు (హనీ డ్యూ) గోవు లాగా తెల్లగా ఉంటాయి. వాటి రక్షణకు, అభివృద్ధికి చీమలు విశేష వ్యవస్థను ఏర్పాటు చేస్తాయి. వాటి వద్ద కాపలావారిని నియమిస్తాయి. అవి కావలి వాని పనినే చేస్తాయి. రైతు చీమలు పొలం పనులు చేస్తాయి. పాకీపని, సిపాయి రక్షణ మరియు కాపలాపని చేసేవి చేస్తే, శిల్పకళల చీమలు ఇంటిని నిర్మిస్తాయి. ఇంత జరుగుతున్నా అవి ఒక కుటుంబ సభ్యులలాగా ఉచ్చ, నీచాలు, అంటరాని తనం, భేదభావాలు లేకుండా జీవిస్తాయి. సోమరితనం, పనిలేని తనం వాటి పిల్లలకు కూడా నచ్చదు. కనుక చీమలలో కూడా సోమరిపోతులైన మగచీమలని చంపివేయడం జరుగుతుంది. మానవ సమాజంలో అలాంటివారు లేమి కారణంగా నశిస్తారు.

చీమలే కాదు ఏ పశు-పక్ష్యాదుల జీవనంతో మానవ జీవనాన్ని పోల్చినా ప్రతిప్రాణి శరీరంలో ఆకారాల తేడా ఉన్నప్పటికీ మానసిక మరియు బౌద్ధిక శక్తులు ఒకే తత్వ గుణాలుగా కనిపిస్తాయి.

శాస్త్రకారుల కథనం ఏమిటంటే జీవులు కేవలం విరాట్ ఆత్మ యొక్క ముక్కలు కాదు, ఒకే సూర్యుని అనేక కిరణాలు. మనుష్యేతర ప్రపంచాన్ని అధ్యయనం చేస్తే ఆత్మ చేతనేనని, అవి ఎక్కడో విరాట్ సూర్యుని రూపంలో తన సృష్టితో క్రీడిస్తుందని తెలుస్తుంది. అదే ఒకచోట మనిషిగా తయారవుతుంది. మరోచోట చీమలుగా మరియు చెదపురుగులుగా తయారవుతుంది.

ప్రాణి జగత్తులో ఉన్న నియమ పాలన, ప్రకృతి ప్రేరణల పట్ల శ్రద్ధ, నిష్ఠ చూస్తే ఈ సృష్టిలో జీవ జంతువులన్నీ ఒక ఖచ్చితమైన నియమాలకు అనుగుణంగా తమ జీవితాన్ని సాగిస్తాయని విశ్వసించక తప్పదు. ఈ కారణంగానే అవి సుఖంగా, శాంతంగా ఉండటం చూడవచ్చు. సుఖంగా, శాంతంగా ఎటువంటి ఉద్వేగాలు లేని జీవితాన్ని జీవించడానికి జీవన నియమాలు, నైతిక విలువలు మరియు ఆదర్శాలకు అనుగుణంగా నడుచుకోవడమే ఏకైక రాజమార్గం. ఈ నియమాలు - సూత్రాలనే ధార్మికత, ఆధ్యాత్మికత అన్నారు. ఈశ్వరీయ విధానం, నీతి నియమాల పేరే ఈశ్వరీయ నిర్దేశం. వాటిని విని, అర్థం చేసుకొని జీవితంలో మరియు ఆచరణలో ప్రవేశపెడితేనే ఈశ్వరుని అస్తిత్వం నుండి ఆయన సాన్నిధ్య లాభాన్ని పొందగలము. పొందాలి కూడా.

★★★

**అవమానాలు ఎదురైనప్పుడు నిగ్రహించుకోవడంలోనే విజ్ఞత ఇమిడి ఉంది.**

మనం - మన ఆరోగ్యం

# మన రోగాలకు మన ఆలోచనా సరళే కారణం

మనిషి ఆరోగ్య పోషణకు అనేక రకాలుగా కృషి జరుగుతోంది. భావ పరంపరను చెట్టు వేరుగాను, మనస్సును చెట్టు బోదెగాను; శరీర విభాగాల్ని చెట్ల ఆకులు, చిగుళ్ళుగాను పోల్చడం అతిశయోక్తి ఏమీ కాదు. వేరును ఉపేక్షించితే, చెట్టు మొదలకు పోషణ అందక దానికి ఆకులు రావడం, పూలు పూయడం జరగదు. ఈనాడు వేర్లను గమనించడం లేదు. భావ సంస్థానం, విశ్వాసకేంద్రం దీనిని ఏ పేరుతో పిలిచినా ఇదే రోగాలకు మూలకారణం. అక్కడ నుండి జీవ శక్తి నీరసిస్తుంది. పోషణకు రాజ మార్గం అక్కడే మొదలౌతుంది. ఈ విషయంపై విస్తార విమర్శ పరిశోధనా సహితంగా ఈ వ్యాసం అందిస్తోంది.

తనువు, మనస్సుల పరస్పర సంబంధం, భావ పరంపరలకు అనుగుణంగానే ఆరోగ్యంగా ఉండడమో, అనారోగ్యం తలెత్తడమో జరుగుతుంది. వైజ్ఞానికులు కూడ ఈ విషయాన్ని నేడు గుర్తిస్తున్నారు. ఇప్పుడు సవివరమైన పరిశోధనల ఆధారంగా ముందు చెప్పబడిన నిజానికి స్పష్టతను, బలాన్ని చేకూరుస్తున్నారు. సృజనాత్మకత, ధ్వంసం చేసే స్థితి – ఈ రెండు భావపరంపరల ప్రభావాలను పరిశోధనల ద్వారా పరిశీలిస్తున్నారు. కోపం, విషాదం, ఉదాసీనత, నిరాశ, ఆవేశం, చిరాకు, భావోద్వేగం వంటి మనో భావాలతోపాటు శాంతం, ప్రసన్నత, ఆశావాదం, ఆత్మవిశ్వాసం, ప్రేమ, కరుణామయ మనఃస్థితుల ప్రభావంపై పరిశోధనల వలన తెలిసిదేమనగా మనస్సు, శరీరాల రక్షణ (ఇమ్యూన్ సిస్టమ్) వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. వ్యక్తి ఆలోచనలు, మనోభావాలు అతని ఆరోగ్యం, గుండె నిబ్బరం, దీర్ఘాయుష్షు విషయాలలో తమ పాత్రను నిర్వహిస్తాయి.

వినాశకర భావాలలో కోపం, అన్నింటి కంటే ప్రమాదకరమైనదిగా గుర్తించబడింది. ఉత్తర కెరోలినా విశ్వ విద్యాలయానికి చెందిన బెయాఫుట్ తీవ్ర గుండె జబ్బుతో బాధపడుతున్న వ్యక్తులను పరీక్షించారు. దాని ఆధారంగా, కోపంలో తీవ్రతను బట్టి వారి ధమనులలో అవరోధం తక్కువగాని, ఎక్కువగాని ఉందని తెలిసింది. ఈ రకంగానే డ్యూక్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టరు రెడ్‌ఫోర్డ్ విలియమ్ 2000 మంది కార్మికులను పరీక్షించారు. ఆరోగ్య పరీక్ష తర్వాత వారిలో కోపం గూర్చి పరిశీలించారు. వీరిలో ఎవరి కోపం తక్కువ స్థాయిలో ఉందో, వారిలో పది శాతమే చనిపోయారు. ఎవరి కోపం ఎక్కువ స్థాయిలో ఉందో వారిలో ముప్పది శాతంమంది గుండె జబ్బు, కేన్సరు (పుట్టకురుపు) ఇతర జబ్బుల కారణంగా మరణించారు.

మరొక పరిశోధనలో డాక్టరు విలియం వ్యక్తి మరణానికి కోపం కూడ బలమైన కారణమని ధృవీకరించారు. డాక్టరు విలియం విద్యార్థి సమూహంలో ఎవరెవరు ఎంత కోపం కలిగుంటారో అని పరీక్షించారు. 20 సంవత్సరాల తర్వాత చేసిన పరీక్షలో, తక్కువ స్థాయి కోపం కలిగిన వారిలో ముగ్గురు, ఎక్కువ స్థాయి కోపం గల వారిలో 16 మంది మరణించినట్లు తెలిసింది. ఇందులో చాలా వ్యక్తులు 50 సంవత్సరాల వయస్సు ముందే మరణించారు. శీఘ్ర మృత్యుకారకమైన కోపాన్ని డాక్టరు విలియం సూక్ష్మ స్థితిలో పరిశీలించి ఈ క్రింది విధంగా స్పష్టం చేశారు. 1) దోష పూరితమైన దృష్టి కోణం వలన ఇతరుల ఎడల అయిష్టం, సంశయాత్మక ఆలోచనలు చిగురుస్తాయి. వ్యక్తి ఇతరులు ఏదో చేస్తారని అనవసరంగా భయపడుతుంటాడు. 2) ఈ వ్యక్తి మెదడు ద్వేష పూరిత ఆలోచనలతో నిండి ఉంటుంది. అంతేకాక క్రోధ భావనలతో ఎల్లప్పుడు మునిగి ఉంటాడు. 3) కోపం క్రియా రూపంలో మారేసరికి, ఇతరులపై అరవడం, వ్యాకులతతో వ్యవహరించడం, కొట్టడం వంటి రూపాలలో కనబడుతుంది.

హార్వర్డు మెడికల్ స్కూలు పరిశోధకులు తీవ్ర గుండెపోటుకు 72 గంటల ముందు ముఖ్యమైన మనో భావాలను గమనించితే కోపమే ప్రధానమైనదిగా గుర్తించారు. ఒకసారి తీవ్ర గుండెపోటుకు గురైన రోగికి కోపం మృత్యుకారకం ఔతుంది. ఒకసారి గుండెపోటు వచ్చిన వ్యక్తికి మరోసారి కోపం వస్తే, అతని గుండె నుండి రక్తం పంపించే శక్తి ఏడు శాతం కంటె ఎక్కువ తగ్గిపోతుంది. ఈ తగ్గుదలను, గుండె నుండి వెళ్ళే రక్త ప్రవాహంలో ప్రమాదకర స్థితిగా, వైద్యులు భావిస్తారు. యేల్ మెడికల్ స్కూలు, స్టాన్‌ఫోర్డ్ పరిశోధన ప్రకారం, మొదటిసారి గుండెపోటు వచ్చిన వ్యక్తికి తొందరగా కోపం వస్తే, అతనికి మృత్యువు వచ్చే అవకాశం మూడు రెట్లు పెరుగుతుంది.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే రెండో మానసిక స్థితి–విషాదం. ఇట్టి వ్యక్తికి మానసికంగా ఉదాసీనత, ఉత్సాహ హీనత వంటి భావాలు వస్తుంటాయి. విషాదం తీవ్ర రోగాలు నయం చేయడంలో అడ్డుగా చూడబడింది. ఉదాహరణకు స్థన కేన్సరు పీడిత మహిళలలో, విషాదగ్రస్థులలో ప్రకృతి సహజమైన రోగనిరోధక కణాలు తక్కువగా ఉన్నాయి. పుట్టకురుపుతో

**గులాబీలకు ముళ్ళున్నాయని బాధపడకు-ముళ్లకు కూడా గులాబీలు ఉన్నాయని సంతోషించు.**

పోరాడడమే ఈ కణాల పని. వీటి కొరత ఫలితంగా శరీరంలో వేర్వేరు భాగాలలో (ట్యూమర్లు) కురుపులు వేగంగా విస్తరిస్తాయి.

న్యూయార్కుకు చెందిన మౌంట్ సినాయి మెడికల్ స్కూలు మనో వైద్య చికిత్సకులు, తుంటి ఎముక విరిగి ఉన్న వృద్ధుల విషాద స్థితిని కొలిచారు (పరిశీలించారు). వీరికి ఈ తీవ్రమైన గాయం వలన మరల లేచి తిరిగే ఆశ కొంచెం సన్నగిల్లింది. ఇలా అయినప్పటికి వీరిలో విషాదంలేని వృద్ధులు, ఇతర గాయపడిన వృద్ధులతో పోలిస్తే 9 రెట్లు అధికంగా పూర్వస్థితిని రాగలిగారు.

మినీసోటా విశ్వవిద్యాలయంలో వందమంది వ్యక్తులకు ఎముకలలోని మజ్జ మార్చే శస్త్ర చికిత్స జరిగింది. వీరిలో విషాదంలో ఉన్న 33 మంది వ్యక్తులలో 12 మంది మొదటి సంవత్సరంలోనే చనిపోయారు. మిగిలిన 67 మందిలో 34 మంది రెండు సంవత్సరాల తర్వాత కూడా జీవించి ఉన్నారు. గుండె పోటు నుండి బయటపబడ్డ రోగుల చికిత్సలోను విచారం (విషాదం) బాధగా పరిణమించింది. మోంట్రియల్ విశ్వ విద్యాలయంలో మొదటిసారి గుండె పోటు వచ్చిన రోగులలో విషాదగ్రస్తమైన రోగుల మరణాలు ఐదు రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

వ్యాకులత, టెన్షన్ కూడ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నట్లు కనిపించింది. ఈ సందర్భంలో కోతుల సమూహంపై ప్రయోగం చేయబడింది. ఈ ప్రయోగంలో ఐదు కోతులను ఒక పంజరంలో బంధించడం జరిగింది. స్వభావ రీత్యా కోతులు ఒక నాయకుని అధీనంలో ఉండటానికి ఇష్టపడతాయి. అవి కొట్టుకుంటు, పోట్లాడుకుంటూ గెలిచిన కోతిని నాయకుని ఎన్నుకుంటాయి. ఒకసారి నాయకుని ఎన్నిక జరిగితే అవి శాంతంగా జీవిస్తాయి. పరిశోధకుడు ప్రతినెల రెండు కోతులను బయటకు తీసి పంజరంలో రెండు కొత్త కోతులను పెట్టేవాడు. అందువలన ప్రతినెల తమ నాయకుని ఎన్నికకు కోతులు పోట్లాడుకోవలసి వచ్చేది. ఇలా సంవత్సరం పాటు ప్రయోగం జరుగుతూ వచ్చింది. మరో పంజరంలో ఐదు కోతులను మార్చకుండా ఉంచడం జరిగింది. పోట్లాడుకున్న కోతులు, ధమనులలో అవరోధాల (blocks) సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించబడింది. ఇందులో నాయక కోతి స్థితి మరీ విషమంగా ఉండేది ఎందుకంటే అది సంవత్సరంలో చాలా సార్లు పోట్లాడవలసి వచ్చింది. రెండో గుంపులోని కోతుల స్థితి స్థిరంగా ఉంది.

ఈ విధంగానే ఐస్‌లాండ్ పరమాణు యంత్రాల సమీపంలో ఉన్న సమూహాన్ని శ్రీ మాయిల్ పరిశోధించాడు. దగ్గరలో టెన్షన్‌గా ఉండేవారి రక్తంలో ఉండే టి-సెల్సు, బి-సెల్సు, ఇరుగు పొరుగువారి నమూనాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. భయం, చింత, రక్షణ వ్యవస్థను దుర్బలం చేస్తాయి. పరీక్షల విషయంలో ఎక్కువగా వ్యాకులత చెందే ఓహియో విశ్వ విద్యాలయ విద్యార్థులను పరీక్షిస్తే, వారు టెన్షన్‌గా ఉన్నట్లు కనుగొనబడింది. వారిలో టి కణాల, బి కణాల సంఖ్యలో తరుగు కనిపించింది. జలుబు, ఫ్లూ లక్షణాలు సంక్రమించే స్థితి హెచ్చుగా కనబడింది.

ఆరోగ్యంపై టెన్షన్ ప్రభావం చూపే విషయాలపై పరిశోధనలు జరిగాయి. గేరీ స్వార్టుజు అనే హార్వర్డు పరిశోధకుని ప్రకారం, ఈ దశలో ఆస్మా, పడిశం, రక్తపోటు వచ్చే స్థితి హెచ్చుగా కనబడింది. స్తన కేన్సరు వ్యాధిగల మహిళలలో ఈ దశలో పుట్టకురుపు మరింత విస్తరించే అవకాశం హెచ్చుగా ఉంది. వీటివలన కనుగొనబడిందేమంటే భావాల ఒత్తిడి ఆరోగ్యానికి హానికరమని తేలింది. దీనికి బదులు శాంతం, ప్రసన్నత, ధ్యానం, ఆరోగ్యం, గుండె నిబ్బరాలను మెరుగు పరుస్తుంది. టి కణాలు, బి కణాలలో తరుగుదల కనబడిన ఓహియో విశ్వ విద్యాలయ పరిశోధనలో గుర్తించబడిన విద్యార్థులు ధ్యానం చేసిన తర్వాత వాటిలో పెరుగుదల కనబడింది. ధ్యానం ఎంత బాగా చేస్తే, దాని ప్రభావం అంత శక్తివంతంగా ఉన్నట్లు గుర్తించబడింది.

మరొక హార్వర్డు విశ్వ విద్యాలయ పరిశోధనలో వ్యక్తుల జీవన వృత్తాంతాన్ని పరీక్షించి, వారిని ఆశావాదులుగాను, నిరాశావాదులుగాను విభజించారు. స్కూలు విడిచిన 30 సంవత్సరాల తర్వాత వీరి ఆరోగ్య పట్టిక తిరిగి పరీక్షించబడింది. ఆశావాదుల కంటే నిరాశావాదులే ఆరోగ్య సమస్యలు, రోగాల ఆక్రమణకు గురైనారు. ఇలాగే మిచిగన్ విశ్వ విద్యాలయంలో బైపాస్ సర్జరీ చేయించుకున్న గుండె రోగులపై మనో వైజ్ఞానికుల అధ్యయనంలో తేలిందేమంటే, ఆపరేషను తర్వాత శ్రమ, సమస్యలు వచ్చినా, ఆశావాదులైన రోగులు ఆరోగ్యాన్ని తొందరగానే పొందారు.

ఆత్మ విశ్వాసంగల పూర్ణ మనోస్థితి కూడ ఆరోగ్యంపై అనుకూల ప్రభావాన్ని చూపించింది. సామాన్యంగా ఆత్మ విశ్వాసంతో వ్యక్తికి పరిస్థితులు తన అదుపులో ఉన్నట్లు అనిపిస్తుంది. కొందరు వ్యక్తులలో ఆత్మ విశ్వాసం తక్కువగా ఉంటుంది. ఇట్టి స్థితిలో అధిక రక్తపోటుతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు మూడు రెట్లు అధికంగా ఉంటాయి.

అలాగే వృద్ధులు వైద్యశాలలో కటువైన నియమ నిబంధనలున్న చోట్ల వారి జీవనాలను నిర్ధారణపై అదుపు తక్కువగా ఉన్నట్లు అనుభవాన్ని పొందారు. యేల్ మెడికల్ స్కూలు మనో వైజ్ఞానికులు కొందరు, ఇట్టి నాలుగు (నర్సింగ్ హోమ్స్) వైద్యశాలల సంచాలకులను ఒప్పించి వృద్ధుల సమూహాలకు నిర్ణయాలు తీసుకోవడానికి ఎక్కువ స్వతంత్రనిచ్చారు. పానీయాలు

**భౌతిక జ్ఞానం పెరిగిన కొద్దీ అహంకారం, ఆత్మ జ్ఞానం పెరిగిన కొద్దీ వినయం పెరుగుతూ ఉంటాయి.**

తీసుకోవడంలోను, సందర్శకులను కలవడంలోను స్వేచ్ఛ ఈయబడింది. ఒక్కొక్కరికి ఒక మొక్కను పెంచుకొనే వీలు కల్పించారు. ఒక సంవత్సరం తర్వాత ఈ వృద్ధుల సమూహంలో మరణ శాతం ముందు పరిస్థితితో పోలిస్తే సగానికి పడిపోయింది.

ఆరోగ్యంపై మిత్రత, సామాజికతల లాభకారక ప్రయోజనాలను దృష్టిలో పెట్టి అధ్యయనం చేయబడింది. పరీక్షల సందర్భంగా విద్యార్థులపై పడే ఒత్తిడి ప్రభావాన్ని కొందరు పరిశోధకులు పరీక్షించారు. అలా పరీక్షించబడిన విద్యార్థులలో ఒంటరిగా ఉన్నవారిలో రోగనిరోధక కణాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. స్థనాల పుట్ట కురుపు (కేన్సరు) వ్యాధితో బాధపడే మహిళలకు సామాజిక సహకారం, సంరక్షణ లభ్యమైన వారికి, ఇతరులతో పోలిస్తే 30 శాతం రోగనిరోధక కణాలు హెచ్చుగా ఉన్నాయి.

కేలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని 5000 మంది వ్యక్తులను వారిపై అభిమానం కనబరిచే మిత్రులు, ఇతర సమూహం, నాగరిక సంస్థలు, క్రైస్తవ ప్రార్థనా మందిరాలు, సామాజిక సంస్థలలో భాగస్వామ్యం, పిల్లల పాఠశాలలో వారి సంబంధాలు చర్చించబడ్డాయి. 9 సంవత్సరాల తర్వాత పై వ్యక్తులలో తక్కువ మిత్రులున్నవారు, ఇతరుల కంటే రెండు రెట్లు ఎక్కువగా మరణించారు. ఇతర అధ్యయనాలలో కూడా సామాజికత, భావ సంరక్షణల ప్రభావం మృత్యువుపై ఉన్నట్లు గుర్తించబడింది.

పరిశోధనలలో, భావనా పూర్వకమైన ఇచ్చి పుచ్చుకోవడాలు (లావాదేవీలు) ఒత్తిడిని తగ్గించడంలో ప్రభావం చూపుతున్నట్లు స్పష్టమైంది. స్థనాలపుట్ట కురుపు (కేన్సరు) వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్న మహిళలపై 10 సంవత్సరాల క్రితం స్టాన్ ఫోర్డు విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టరు డేవిడ్ స్టిగల్ ప్రయోగం చేసారు. ఒక సమూహానికి సామాన్య చికిత్స చేయబడగా, రెండో బృందానికి అదనపు వైద్యం వారానికొకసారి సామూహికంగా క్రమం తప్పకుండా సంవత్సరం పాటు కొనసాగింది. వారు పరస్పరం ఈ వ్యాధి గూర్చి తమ, తమ భావాలు వ్యక్తపరచుకొనేవారు. దీనివలన కుటుంబంపై పడిన ప్రభావం, తమ సుఖదుఃఖాలను గూర్చి చర్చించుకునేవారు. ఈవిధంగా త్వరలోనే ఈ మహిళలు భావనాత్మక బంధాన్ని పెంచుకున్నారు. బాధా నివారణకు ఆటో సజెషన్ నేర్చుకున్నారు. పరిశోధకులు తర్వాత పది సంవత్సరాలలో రెండు సమూహాలపై మృత్యువు ప్రభావాన్ని అధ్యయనం చేయగా, రెండు మూడేళ్ళ తేడా కనబడడం ఆరంభమైంది. సామూహిక చికిత్స అదనంగా పొందిన మహిళలలో మృత్యువాతపడిన వారి సంఖ్య తగ్గడమేగాక, వేరే సమూహం మహిళలతో పోలిస్తే పది సంవత్సరాలలో రెండు రెట్లు తగ్గింది.

ఇలాంటి పరిశోధనే కోతులపై కూడ జరపబడింది. ఒక కోతిని పంజరంలో బంధించి తీవ్రమైన వెలుతురు, పెద్ద ధ్వనికి గురి చేసారు. దానిలో భయం, ఒత్తిడిని కలిగించే హార్మోను కార్టిసాల్ పరీక్షించారు. ఎప్పుడైతే, వేరే కోతిని కూడ పంజరంలో ఉంచారో అప్పుడు హార్మోను సగం తగ్గింది. అయితే ఐదు కోతులనొకేసారి పంజరంలో బంధిస్తే వాటిపై వెలుతురు, శబ్ద ప్రభావమేమి కనుపించలేదు. ఈ విధంగానే కుందేళ్ళ హృదయరోగంలో ధమనుల అవరోధంపై కూడ పరిశోధన చేసారు. పంజరంలో బంధించబడిన కుందేళ్ళ కంటే, ప్రేమ పూర్వకంగా పెంచిన కుందేళ్ళలో ఈ అవరోధం చాలా తక్కువగా ఉంది.

ఆరోగ్యంపై సంతోష, ఆనంద క్షణాల ప్రభావాన్ని హార్వర్డు పరిశోధకులు పరీక్షించారు. హాస్యభరిత చిత్రాలను చూచే వ్యక్తులలో కార్టిసోల్ హార్మోన్ల ఉత్పత్తి తగ్గినట్లు గుర్తించారు. అదే సమయంలో ప్రాకృతిక రోగ నిరోధక కణాలు పెరిగినట్లు గమనించారు. స్థన కేన్సరు పీడిత మహిళలలో 36 మందిలో సంతోష భావనల తేడాయే మరణమో, జీవించడమో కారణమని తేలింది.

దయ, ప్రేమ, సద్భావాలతో నిండిన మనోస్థితి ఆరోగ్యానికి ఎల్లప్పుడూ ఉపకరించినట్లు తెలిసింది. హార్వర్డుకు చెందిన డాక్టరు మెల్లోనెడ్ కొందరు వ్యక్తులకు మదర్ థెరిసా రోగులు, పీడిత జనులకు సేవలు చేస్తున్న సినిమా చూపించే ప్రయోగం చేసారు. అట్టి వ్యక్తులలో కొద్ది సమయంలో 'టి' సెల్సు (కణాలు) వృద్ధిని గుర్తించారు. ఇతరుల ద్వారా తమకు చేయబడిన ఉపకారాలకు కృతజ్ఞతాపూర్వక భావనలు ఎవరైతే చేసారో వారిలో 'టి' సెల్సు వృద్ధి ఎక్కువ కాలం కనబడింది. దీనికి విరుద్ధంగా నాజీ జర్మనీలో జరిగిన అత్యాచారాలు క్రూరత్వంతో నిండిన సినిమాలు చూసినప్పుడు కలిగిన ప్రభావం వ్యతిరేకంగానే కనపడింది.

ఈవిధంగా వ్యక్తి భావనాత్మక పరిస్థితి, వాని ఆరోగ్యంపైన, రోగ రహిత స్థితిపైన, దీర్ఘాయుష్షుపైన బలమైన సంబంధం ఉందని నేటి వైజ్ఞానిక ప్రయోగాల ద్వారా నిర్ధారించారు. మంచి చికిత్స, పెరుగుతున్న సౌకర్యాలున్నప్పటికి, రోగాల వృద్ధి, అనారోగ్య సమస్యలు తలెత్తడంలో ఆశ్చర్యపడనక్కరలేదు. ఎందుకంటే శారీరకంగా కనబడే రోగ లక్షణాలకే చికిత్స చేయబడుతోంది గాని రోగానికి కారణాలు మనసు లోతులలో దాగి ఉన్నాయి గనుక వాటికి చికిత్స అవసరం. వికృత జీవన శైలి ద్వారా కలుషితమైన, కూడని ఆలోచనా విధానానికి బదులు మంచి ఆలోచనలు, ఉదాత్త (ఉత్తమ) భావనలు, ఆశావహ దృష్టి కోణం అలవరచుకొని మనం సరియైన ఆరోగ్య లాభాన్ని పొందగలం.

*హిందీ మూలం : అఖండ జ్యోతి, డిశంబరు 1999*

*తెలుగు అనువాదం : బాసంగి శ్రీరాములు*

**లౌకిక జ్ఞానమే ఆధ్యాత్మిక జ్ఞానానికి తొలిమెట్టు.**



## ధారావాహిక: హనుమత్ కథామృతం-28

# సాటిలేని భాగ్యశాలి

వరప్రసాది అయిన హనుమంతుని చూసి పార్వతీదేవి పులకించిపోయింది. ఆనంద పారవశ్యంతో భర్తవైపు చూచింది. అంతరాంతరాలలో చెలరేగిన ఆమె కోపాగ్ని చల్లబడిపోయింది. ప్రశాంతత చిక్కగానే మహేశ్వరుని లీల అర్థం అయింది. ఆయన ఏది చేసినా వారిమేలును కాంక్షించే చేస్తారని తృప్తిపడింది. సదాశివుడు కష్టాన్నే కలిగిస్తాడు, కాని చివరకు అది సుఖాంతం అవుతుంది. ఈ సంఘటన ద్వారా హనుమాన్‌కు అంతులేని దేవశక్తులు ప్రాప్తించాయి. అవి రాబోయే కాలంలో లోకకళ్యాణానికి ఉపకరిస్తాయి.

బ్రహ్మదేవుడు ఇంద్రునివైపు చూశాడు. ఆ చూపుల సంకేతాన్ని ఇంద్రుడు అర్థం చేసుకున్నాడు. పార్వతిని గూర్చిన భయం తీరిపోయింది. మెల్లగా రెండు అడుగుల ముందుకువేసి బాలహనుమాన్ నుదిటిపై చేయిపెట్టాడు. ప్రేమతో "కుమారా! నేను నీ పట్ల ఘోర అపరాధం చేశాను. ప్రాయశ్చిత్తంగా ఏమి చేసినా తక్కువే అవుతుంది. మొట్టమొదట బ్రహ్మర్షి వసిష్ఠునికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. తరువాత త్రిమూర్తులకు, జగదంబ దుర్గామాతకు నాకృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారందరికీ నాపైన చాలా చాలా కోపం వచ్చింది. అయినప్పటికీ నన్ను ఒక్క మాటకూడా అనలేదు. పైగా క్షమించి విడిచిపెట్టారు. నాయనా! నా వజ్రాయుధం కారణంగా నీగడ్డానికి గాయం అయింది. ఈ గాయపడిన గడ్డం ద్వారా నీకీర్తి పెరిగిపోతుంది." అంటూ దధీచిమహర్షి వైపు చూశాడు. "ఋషివర్యా! నేను మీ పట్ల అపరాధం చేశాను. దండన ఇస్తారో, క్షమను పంచుతారో, మీ ఇష్టం" అంటూ చేతులు జోడించాడు. దధీచి మౌనంగా మహాదేవునివైపు చూశాడు. మహేశ్వరుడు తనకు ప్రియాతి ప్రియమైన భక్తునివైపు చిరునవ్వును చిందించాడు. వెంటనే దధీచి ఇంద్రునివైపు చూస్తూ కన్నులతో ఊరట కల్పించాడు.

ఇంద్రుడు ఆనందంగా హనుమాన్ వైపు తిరిగి "కుమారా! ఈ నాటినుండి వజ్రాయుధమే కాదు, అన్నిరకాల ఆయుధాలనుండి సురక్షితంగా బయటపడతావు. ఇకనుండి నీ శరీరం వజ్రసమానంగా పుష్టి చెందుతుంది. ఎలాంటి ఆయుధమూ నీ శరీరాన్ని బాధించలేదు" అంటూ తనవంతు వరాన్ని ప్రసాదించాడు. సూర్యభగవానుడు "కుమారా! నీవు నీ సాధనా పరాక్రమంతో నన్ను సంతోషపెట్టావు. నన్ను ఉపాసించి పవిత్రుడవు అయ్యావు. నిన్ను బోలిన పరమపవిత్రుడు మూడు లోకాలలో ఎవ్వరూ ఉండరు. నీ జీవితమంతా నీ ఆరాధ్యుడు శ్రీరామచంద్రునివలె పవిత్రతను ప్రసాదిస్తూ ఉంటావు. రాబోయే యుగాలలో ఆధ్యాత్మిక విద్యకై ఆరాటపడేవారూ, శ్రీరామభక్తులూ నిన్ను స్మరించినంత మాత్రాననే పవిత్రతను పొందుతారు." అంటూ వరాన్ని ప్రసాదించాడు.

ఇంత గొప్ప వరాన్ని ఇచ్చినప్పటికీ సూర్యునికి తృప్తి కలగడం లేదు. కొద్దిసేపు ఆగి మరలా "నేను నా తేజస్సులో నీకు నూరవ వంతును ప్రసాదిస్తున్నాను. అంతే కాక వీలు చూసుకుని వేదశాస్త్రాలలో ఉన్న రహస్యాలను అన్నింటినీ బోధిస్తాను. భవిష్యత్తులో నీవు గొప్ప విద్వాంసుడవు అవుతావు. నీ విద్వత్తుతో గొప్ప వక్తవు అవుతావు" అంటూ తన వరాల చిట్టాను పెంచివేశాడు. సూర్యుని తరువాత అగ్ని దేవుడు ముందుకు వచ్చాడు "పుత్రా! నాయొక్క తాపం, దాహం, శక్తి నుండి నీకు అన్నివేళలా రక్షణ లభిస్తుంది" అంటూ అభయాన్ని అందించాడు. తరువాత వరుణదేవుడు "శ్రీరామ భక్తగ్రేసరా! నీకు నా పాశం నుండి, నీటి నుండి సర్వవేళలా రక్షణ లభిస్తుంది" అంటూ వరం ప్రసాదించాడు. యమ ధర్మరాజు ముందుకు వచ్చి "కుమారా! నీకు సంపూర్ణ ఆరోగ్యంతో నా దండానికి ఎల్లప్పుడూ దూరంగా ఉంటావు" అంటూ వరదానం చేశాడు. యముని వరదానం తర్వాత కొద్ది క్షణాలు అక్కడ మౌనం రాజ్యం చేసింది. ఇంతలో ధనరాజు కుబేరుని స్వరం వినిపించింది "వత్సా! హనుమా! నీవు యుద్ధంలో ఎప్పటికీ

**అపరిచితుల పట్ల కూడా గౌరవ మర్యాదలు చూపగలవాడే ప్రపంచ పౌరుడు.**

అజేయుడుగా ఉండడానికి విశిష్టమైన నా గదను ఇచ్చివేస్తున్నాను'' అన్నాడు. అందరూ ఆనందంతో ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు.

యక్షరాజు కుబేరుని తర్వాత దేవశిల్పి విశ్వకర్మ ముందుకు వచ్చాడు. "శ్రీరామభక్త సుమమా! హనుమా! ఇకనుండి నేను తయారుచేసే ఏ అస్త్రంగానీ, ఏ శాస్త్రంగానీ నిన్ను బాధించలేవు. నీవు చిరంజీవివి'' అంటూ అమోఘమైన వరాన్ని ప్రసాదించాడు. ఈ విధంగా భిన్న భిన్న దేవగణాలు వరాల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. హనుమంతుడు మధురమైన చిరుదరహాస వదనుడై వారిని తిలకిస్తూ ఉన్నాడు. దేవగణాల తర్వాత బ్రహ్మదేవుడు "కుమారా! నీకు బ్రహ్మశాపం తగులదు. జరామరణముల నుండి ముక్తుడవై పరమభక్తుడుగా ప్రసిద్ధి చెందుతావు" అంటూ పవనదేవుని వైపు చూస్తూ "నీ గారాల పుత్రుడు శత్రువులకు మహాకాలుడు, మిత్రులకు అభయదాత. ఇతనిని యుద్ధంలో ఎవ్వరూ ఓడించలేరు. కోరుకున్న రూపాన్ని ధరిస్తాడు. కోరుకున్నచోటికి పయనిస్తాడు. అతని వేగానికి హద్దులు ఉండవు. ఎన్నెన్నో అద్భుత కార్యాలు చేసి, అసంభవాన్ని సంభవింపచేసి, ఆశ్చర్యాన్ని కలుగచేస్తూ గొప్పకీర్తిని సంపాదిస్తాడు" అంటూ ప్రసంగరూపంలోనే తన వరాలను వినిపించాడు.

బ్రహ్మదేవుని మాటలు వింటూ సదాశివుడు చిరునవ్వులు చిందిస్తున్నాడు. కేసరి, అంజనీదేవి మౌనంగానే తమ కృతజ్ఞతను తెలియచేస్తున్నారు. హఠాత్తుగా మహదేవుడు "ఈ బాలుడు నాలాగానే మృత్యుంజయుడు. నావల్ల గాని, నా ఆయుధాలతోగాని ఇతనికి మృత్యువు రాదు" అనగానే పార్వతీ దేవి "గణపతి, కుమారస్వామిలవలె ఈ బాలుడు నాకు అత్యంత ప్రియుడు. నా ఆశీర్వాదంవల్ల ఎప్పటికప్పుడు ఇతనిలో నూతన శక్తులు ప్రవేశిస్తూ ఉంటాయి" అంది.

నారద మహర్షి అన్నీ మౌనంగా వింటూ ఉన్నాడు. పార్వతి కోరిక మేరకు నోరు విప్పాడు. "అమ్మా! భగవతీ! ఈ వరదానాలలో నాకేదో లోటు కనిపిస్తూ ఉంది. దేవగణాలందరు కలిసి ఏకగ్రీవంగా ఒక్క వరం ఇస్తే బాగుంటుంది అనిపిస్తుంది" అన్నాడు. వెంటనే బ్రహ్మ దేవుడు "దేవగణాలందరి తరపున ఒక వరం చెపుతున్నాను వినండి. ఒక్క హనుమంతుని పూజించినట్లైతే సకల దేవతలను పూజించినట్లే" అన్నాడు.

– *అఖండ జ్యోతి నవంబర్ – 2009*

## కదిలించే కళ్లు

29.సీ॥ ఘనమైన దీక్షతో దిన చర్య వ్రాయుచు
జాతిపితకు చూపి ఖ్యాతిగాంచి
చెప్పిన పనిలోన చేవను చూపించి
సాటివారి యెదుట మేటియయ్యె
తాంత్రిక సాధనల్ సాధించి జగతిలో
మహిమలు చూపించు మనసుమారె
మూడు నెలలలోన ముఖ్యమౌ విషయాలు
నేర్చుకొనుచు వేగ నియతి చూపె

తే॥ సబరమతి యాశ్రమంబున సరళరీతి
మసలినట్టి వితము దాని మహిమ నంత
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

30.సీ॥ ఇరువదేండ్లును కూడ గురుదేవుమాటపై
స్వాతంత్ర్య సమరాన సాగు విధము
స్వాతంత్ర్య ఫలమును చవి చూచినంతనే
పార్టీకి దూరంగ వరలు విధము
ఖద్దరు వస్త్రాలు శ్రద్ధతో ధరియించి
జీవితాంతము దాక చెలగు విధము
గాంధిగారిని చేరి కఠినమౌ నియమాలు
దీక్షతో పాటించి తిరుగు విధము

తే॥ విజయ మర్మంబు నెంతయున్ వేడ్కమీర
గాంధి గారును దెలిపిన ఘనత నంత
మానవాళికి దెలుపంగ మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

ఎంత కాలం జీవించావన్నది లెక్కకాదు-ఎలా జీవించావన్నది లెక్క.

# ఈ శతాబ్దికి అధిష్ఠాత - సూర్యుడు

ఈ బ్రహ్మాండములో భూమండల స్థాయికి చెందిన గ్రహము ఎంత వెతికినా కనిపించదు. ఇంత సుందరమైన, సువ్యవస్థితమైన, సునియోజితమైన, అగణితవిశేషతల స్థాయికి చెందిన గ్రహము ఎంత వెదికినా కనిపించదు. స్వర్గలోకము గురించి ఊహించవచ్చు, కానీ భూలోకములో ఉన్నన్ని విశేషతలు, విచిత్రములను స్వర్గలోకములో కూడా ఊహించలేము. ఇందుమూలంగానే 'స్వర్గాదపీ గరీయసి' అనే నానుడి వచ్చింది. మన సౌరమండలంలో ఎన్నో గ్రహములు, ఉపగ్రహములు కనుక్కోబడినవి. వాటిలో చాలా గ్రహాలు ఆకారము దృష్టితో చూస్తే పృథ్వికంటే ఎన్నో రెట్లు పెద్దవి, కానీ ప్రాకృతికశోభ, ప్రాణిసముదాయము, వృక్షములు, వనస్పతులు మొదలైనవాటితో ఉండే పృథ్వికి ధీటైన గ్రహము మరొకటి లేదు. ఋతువులయొక్క ఇటువంటి పరివర్తన అన్యత్రా ఎక్కడా సంభవము కాదు. లెక్కలేనన్ని శక్తుల విశేషతలు, విభూతుల భాండాగారముగా చెప్పబడుతున్న మనిషివంటి ప్రాణి ఇతరత్రా లభించుట కూడా సర్వదా దుర్లభమే. వీరిలో చాలామంది నిద్రాణస్థితిలోనే ఉంచవచ్చుగాక.

అన్యగ్రహములతో పోలిస్తే చిన్నదైన పృథ్విలో ఇంతటి సౌందర్యము, సౌష్ఠవము ఏ విధంగా సంభవమయినాయి? ఇందుకు గల భౌతిక కారణాలను పరిశీలిస్తే ప్రముఖంగా ఒకే తథ్యము మనముందుకొస్తుంది. అదేమిటంటే సూర్యుడు పృథ్వినుండి ఎంత దూరములో వుండాలో సరిగ్గా అంతే దూరములో వుండటము వలన ఇటువంటి పరిస్థితులు సంభవమయ్యాయి. ఒకవేళ దూరము తక్కువగా వున్నట్లయితే పృథ్వి అగ్నిగుండముగా మారిపోయేది. ఒకవేళ కొంచెం దూరంగా వున్నట్లయితే చలి అధికముగా వుండి ఎటువంటి కదలికలు దృష్టికి గోచరమయ్యేవికావు. సునిశ్చిత దూరము అనే సుయోగము వలన భూమి ఇన్ని విశేషతలను సంతరించు కోగలిగింది. ఈ విశేషతలు బ్రహ్మాండములో ఎంత వెతికినా ఎక్కడా కనిపించవు.

తత్త్వదర్శుల నుండి విజ్ఞానవేత్తల వరకు **'సూర్య ఆత్మ జగతః స్థుషస్చ'** అనగా 'సూర్యుడు సమస్త జగత్తుకు ఆత్మ' అని ఒకే స్వరముతో ఒప్పుకుంటారు. పృథ్విపై ఆధిపత్యము సూర్యునికే ఇవ్వబడింది. ఈ తథ్యమును పతి-పత్నీ, ప్రియురాలు-ప్రేమికుడు లాంటి అనేక అలంకారములతో వేదాలతో అభివ్యక్తము చేయబడినది.

సూర్యుని కిరణములు భూమిపై పడినప్పుడు ఆ క్షేత్రములో ఉత్సాహము, పరాక్రమము ఉరకలు వేస్తాయి. వనస్పతులలో, ప్రాణులలో, పదార్థములలో కదలిక మొదలవుతుంది. సూర్యుడు అస్తమించగానే అందరిని సోమరితనము, అలసట, నిద్ర, అకర్మణ్యత ఆవరిస్తాయి. కదలికలు ఆగి విశ్రాంతి స్థితికి వెళ్ళిపోతాయి. సూర్య కిరణములు ప్రసరించని ప్రదేశాలలో తేమ, కుళ్ళుట, నీరసము, నిస్తబ్దత ఆవరించి వుంటాయి. ఇటువంటి ప్రదేశాలలో విషాణువులు పెరుగుతాయి. ఎక్కడ సౌరఊర్జ ఎంత ప్రసరిస్తుందో అక్కడ అంత బలిష్ఠ, సుదృఢ వాతావరణము దృష్టిగోచరమవుతుంది.

శబ్దము, ప్రకాశము, వేడి అనేవి మూడు ప్రముఖ తత్త్వములుగా ఈ ప్రపంచములో చెప్పబడినాయి. అణువులు -పరమాణువులు మరియు వాటి ఘటకములతోపాటు తమతమ క్షేత్రములలో పరిభ్రమణము చేస్తూ నిరంతరం విభిన్న పదార్థముల స్వరూపములను ఈ తరంగములే నిర్మిస్తూవుంటాయి. వస్తువులు అనేక రంగులతో కనిపిస్తాయి. ఈ రంగులు ఎక్కడనుండి వస్తున్నాయి? సమాధానము సుస్పష్టము. వస్తువులు లేదా చెట్లు తమ అనురూపమైన కిరణములయందు ఉన్న రంగులను పీల్చుకుని అదే రంగు గలవిగా అవుతాయి. రంగులను తయారు చేయగలిగేది సూర్యుడొక్కడే. ఆయనయే ఈ భూమిని విభిన్న ఘటకాలతో తన ప్రణాళిక ప్రకారము చిత్రకారుడు లాగా రంగులతో నింపి తనలోని అద్భుత కళాకారుడిని మనకు పరిచయము చేశాడు.

పృథ్విపై అనేక రసాయనాలు లభ్యమవుతాయి. వాటి ఆధారంగానే వనస్పతులు, ప్రాణులయొక్క శరీరాలు నిర్మించబడతాయి. ఈ రసాయనాలు కూడా సూర్యుడు మరియు పృథ్వి యొక్క సంయోగము వలన తయారవుతాయి. వాటినే మనము తినే పదార్థములనుండి పదార్థజగత్తు వరకు అనేక ఇతర క్షేత్రములలో అంకురించి, పెరిగి తమదైనశైలిలో పనిచేస్తూ చూడవచ్చు. వైజ్ఞానికుల ప్రకారము పృథ్విపై జీవనతత్త్వము ఎంత వికసించిందో, ఎన్ని కదలికలు వున్నాయో వాటన్నింటికి కేంద్రము సూర్యశక్తితోనే సన్నిహితమైవుంటుంది. యాంగ్‌స్ట్రామ్ మరియు హ్యూగనిన్స్ వంటి వైజ్ఞానికులు తేల్చిన విషయము

**ఇతరుల దౌర్బల్యాన్ని సొమ్ము చేసుకోవాలనుకోవడం చాలా తప్పు.**

యేమిటంటే సూర్యప్రభయందు సోడియం, కాల్సియమ్, బేరియమ్, జింక్, కాపర్, ఐరన్, మేంగనీస్, కోబాల్ట్, కాడ్మియమ్ వంటి ధాతువులను నిర్మించగలిగే సామర్థ్యము వున్నది. మానవీయ జీవనీశక్తి కూడా సూర్యునినుండి ప్రాప్తించిన అనుదానమే. దీని లేమి వలననే మనిషి రోగగ్రస్తుడౌతాడు.

మానవుని శరీరములో అనేకానేక ప్రవృత్తులకు చెందిన జీవకోశికలు, ఊతకములు (ప్లెక్సెక్), క్షారములు, ప్రోటీన్స్, హార్మోన్స్, విటమిన్స్ మొదలైనవి లభిస్తాయి. ఇవన్నీ ప్రకృతియొక్క అనుదానాలుగా భావిస్తాము. సూక్ష్మదృష్టితో చూస్తే ఈ భిన్నతలు ఆ ఆ స్థలాలలో సూర్యప్రభావము ఎంత స్థాయిలో, ఎంత పరిమాణములో, ఎంత వేగముగా పడుతోంది? అక్కడ ఏ ఘటకాలతో కలసి ఏ ప్రభావముతో మిశ్రితమై ఏ ప్రతిక్రియ ఉత్పన్నం చేస్తోంది అనేదాని మీద ఆధారపడతాయి. రసాయనాలతో పదార్థముల నిర్మాణము జరగడము చూస్తున్నాము. కానీ నిజానికి రసాయనాలు కూడా సూర్యకిరణముల ద్వారానే ఉత్పన్నమౌతాయి.

సృష్ట్యాది మొదలు ఇప్పటివరకు పృథ్విపై వున్న వాతావరణంలో, ప్రాణులలో, పదార్థములలో, ఋతువులలో చిత్రవిచిత్రమైన పరివర్తనలు జరుగుతూనే ఉన్నాయి. ఇందుకు మూలము పృథ్వి మరియు సూర్యుని మధ్య జరిగే ఇచ్చి పుచ్చుకోవటాలు, వాటివల్ల ఉత్పన్నమయ్యే ప్రతిక్రియలో మార్పు రావడమే ప్రముఖ కారణము. ప్రకృతి యొక్క పరిస్థితి ఏవిధముగా మారుతోంది, దానికి కారణమేమిటి అనేది శోధిస్తే బహిర్గతమైన సత్యమేమిటంటే రెండు గ్రహముల మధ్య వచ్చే మార్పులే ఈ ఎగుడుదిగుడులకు అసలు కారణం.

భవిష్యత్తును గురించి ఆలోచిస్తే సూర్యశక్తిని రాబోయే రోజులలో ఎంతవరకు, ఏ విధంగా ఉపయోగించడము సంభవమవుతుంది అనేదానిపై దృష్టి సారించాల్సివస్తుంది. మానవుని అన్ని ఆవశ్యకతలు 'శక్తి' (ఊర్జ)పై ఆధారపడినవే. భోజనము తయారీ, ధాతువులు తయారీ, జలయానము, భూయానము, వాయుయానము, కర్మాగారములను నడిపించుట, భూమినుండి నీరు వెతికితీయుట మొదలైన అనేక పనులకు ఇస్టానుసారము వాడే ఊర్జకు ప్రత్యామ్నాయము ఎక్కడినుండి లభిస్తుంది? దీనికి ఏకైక ఆధారము సూర్యుడే అని ప్రత్యుత్తరమివ్వాలి.

సూర్యుడు మెరుపుతో, వేడితో కూడిన ఒక రూపము అని అందరికీ పరిచితమే. రెండవది ఆధ్యాత్మిక స్వరూపము అది అంతః కరణములో ప్రేరణ, ప్రకాశము, సాహసము, ఉత్సాహము, పరాక్రమము ప్రసాదించుటతో సమర్థత కలిగివుంటుంది. దానిని ఆధ్యాత్మిక భాషలో 'సవిత' అని పిలుస్తాము. సూర్యుడు జడ అగ్నిపిండముకాదు. మీదుమిక్కిలి సచేతన ప్రాణశక్తి, ఆవాహనంతో ఆకర్షించినట్లయితే అది సాధకునికి ఓజస్సు, తేజస్సు, వర్చస్సులను ప్రసాదించుటలో సమర్థత కల్గివుంటుంది. కుంతీదేవి ఈ శక్తిని ఆవాహన చేసి సూర్య పుత్రుడు అయిన కర్ణుడికి జన్మనిచ్చింది. కర్ణుని శరీరానికి, మనస్సుకి కవచ-కుండలముల రూపములో ఈ సూర్య-సవితా శక్తియే రక్షణ కల్పించింది. అనేక ఇతర సందర్భాలలో మన పురాణేతి హాసాలలో సూర్యుని అనుగ్రహం ప్రాప్తించుకున్న సామర్థ్యములు వర్ణించబడి ఉన్నవి. రఘువంశీయుల ఉపాస్యదైవము సూర్యుడే.

నవయుగములో జనమానసములను సంస్కరించుటకు ప్రఖర ప్రతిభాసంవర్ధన ఎంతో ఆవశ్యకము. మహామానవులను తయారుచేసి, వారిని వికసింపచేయుటకు సవిత యొక్క చేతనశక్తి ప్రయోగము మాత్రమే కోరదగినది. ఇందుకొరకు ఈ రోజులలో ఉచ్చస్తరీయ ఆత్మలు తమ సూక్ష్మశరీరములతో విశేష ప్రయోగములతో ప్రయత్నము చేస్తున్నారు.

సార్వజనీయ ప్రయోగరూపములో శాంతికుంజ్‌లో యుగసంధి సమయంలో ఇటువంటి మహాపురశ్చరణ జరిగింది. ఇది 1988 శరన్నవరాత్రుల నుండి డిశంబరు 2000 వరకు జరిగింది. దీని పూర్ణాహుతి అద్భుతముగా, వ్యాపకస్థాయిలో జరిగింది. సాధనా విజ్ఞానమందు శ్రద్ధ కలిగినవారు శాంతికుంజ్‌లో జరిగే నెలరోజులు, తొమ్మిదిరోజుల సాధనకు వచ్చి యుగసంధి పురశ్చరణ యందు భాగస్వాములు అయ్యారు.

ఈ రోజులలో అణ్వాయధాలనుండి ఉత్పన్నమయ్యే రేడియో ధార్మికతను ఎలా ఎదుర్కొనాలి, అనే విషయముపై ప్రసిద్ధ దార్శనికుడు ఆర్థర్ కోస్లర్ కూడ ఆధ్యాత్మిక ఉపచారములనే ఆశ్రయించాలని చెప్పాడు. బ్లిట్జ్ పత్రిక సంపాదకులు శ్రీ కరంజియాకి ఆయన చెప్పిన విషయములను పత్రిక "నవనీత" (మార్చి 1983)లో ప్రచురించింది. తన అభిప్రాయము తెలుపుతూ ఆయన, 'అణ్వాయుధాలకంటే ఎక్కువ సామర్థ్యము సావిత్రి-సవితా మంత్రమైన గాయత్రీమంత్రములో వున్నది' అన్నారు. ఆయన విశ్వములోని కోట్లాది భారతీయులు గాయత్రీ మంత్రమును ఒకేసారి పురశ్చరణరూపముగా చేసినట్లయితే, ఆ అనుష్ఠానము నుండి ఉత్పన్నమైన ఊర్జ, బ్రహ్మాండములోని సూర్యుని కూడా ఛేదించగలిగే మిసైల్ అంత పనిచేస్తుంది. ఇంకా 'భర్గ'తో కలసి

**జీవితంలో ఎదురుదెబ్బలు తిన్నవారికే ఎదుగుదల సాధ్యం అవుతుంది.**

అణుశక్తిని కూడా నాశనము చేయగలదు.

ప్రాచీన కాలంలోని ఋషుల వలె రాబోయే రోజులలో ఈ కాలానికి చెందిన తత్త్వజ్ఞానులు అనుభవపూర్వకంగా మానవమానసము ప్రకృతిలోకూడ ఈ మహాశక్తి ఉపయోగించి అవసరమైన పరిష్కారాలు, పరిమార్జనలు, పరివర్తనలు చేయుట సంభవమని తెలుసుకుంటారు. సూర్యపురాణము, అక్షుణ్యోపనిషత్తు, ఆదిత్యహృదయము మొదలైనవాటిలో సూర్యునియొక్క విశిష్ఠ క్షమతలు, సామర్థ్యము గురించి చెప్పబడినది. మరియు వాటిద్వారా జరిగే అనేక చికిత్సలకు సంకేతాలు ఇవ్వబడ్డాయి. శరీరము, మనస్సు మరియు భావ సంవేదనలకు ఈ శక్తిద్వారా ఉచ్చస్తరీయ లాభములను అందజేయవచ్చును. ఈ ప్రతిపాదనలకు సంబంధించి జరిగే పరిశోధనలు కాదనజాలనివిగా నిరూపించబడతాయి. రాబోయే రోజులలో సూర్యవిజ్ఞానవే ప్రముఖపాత్ర వహిస్తుంది. మీదుమిక్కిలి మానసోపచారముగా కూడా పనికొస్తుంది. సూర్యనమస్కారములు, సూర్యభేదన ప్రాణాయామములు, సూర్యోవస్థానముల విధి ఉపచారముల అనుమానరహిత పరిణామములు అందరి ముందు ఉన్నాయి. దీనివల్ల సూర్యశక్తిపై విశ్వాసము పెరుగుతుంది.

ఎవరికి ఈ ప్రతిపాదనలపై దృఢవిశ్వాసము వున్నదో వారికొరకు సార్వజనీన ఉపాసనా విధానము తయారు చేయబడినది. అది ఈ ప్రకారంగా వుంటుంది. **బ్రహ్మ ముహూర్తములో నిద్రలేచి యథాశక్తి శరీరమును మనస్సును శుద్ధిపరచుకొని కనులు మూసుకుని ప్రాతఃకాలంలో ఉదయిస్తున్న స్వర్ణిమ సవితను ధ్యానము చేయాలి. ఆ స్వర్ణిమ సూర్య కిరణములు తమ శరీరము లోపలికి ప్రవేశించడము వల్ల శరీర స్థితి చంద్రునివలె అవుతున్నదని భావన చెయ్యాలి. సూర్యునినుండి ప్రకాశమును గ్రహించిన చంద్రుడు మెరుస్తూ, తన శీతల ప్రకాశముతో రాత్రిని ప్రకాశింపజేసి అమృతమును కురిపిస్తాడు. ధ్యానస్థితిలో భావన ఎలా ఉండాలి అంటే సూర్యకిరణములు సాధకుని శరీరములో ప్రవేశించినాయి. శరీరములోని అంగ ప్రత్యంగములలో చంద్రుని అమృతజ్యోతి నిండిపోయింది. ఈ జ్యోతి ప్రపంచమంతా వ్యాపించి అమృతజ్యోతితో నిండిన వాతావరణమును నిర్మిస్తోంది. దానితో పదార్థములు, ప్రాణులు అనుప్రాణితమవుతున్నాయి. ఉపయోగకర వాతావరణములు నిర్మించబడుతున్నాయి. అవాంఛనీయతలు తొలగిపోతున్నాయి.**

గాయత్రీ మంత్రము, సూర్యమంత్రము. ఎవరికి గాయత్రీ మంత్రముపై శ్రద్ధ వుంటుందో వారు పైన చెప్పిన ధ్యానముతోపాటు గాయత్రీమంత్రమును మానసికంగా జపించవచ్చు. ఎవరికి మంత్రజప విధానము నచ్చదో వారు కేవలము సూర్యకిరణములను తమ శరీరములోకి ఆవాహనచేసి దానిమూలముగా తయారయ్యే చంద్రోపమశరీరముతో అమృతజ్యోతి వితరణ ధ్యానమును మాత్రమే చేసుకుంటూ ఉండవచ్చు.

దీనికొరకు 15 నిమిషాల సమయమే నిర్ధారించబడినది. కారణము అందరూ దీనిని ఆచరించుటకు వీలుగా వుండాలి. ఒకే భావన ఒకే సమయములో లక్షల, కోట్లమంది కలసి చేస్తే ఆ సంయుక్తశక్తి నుండి ఉద్భవమయ్యే సూర్యచేతన మానవసమాజముపై అధిక అనుగ్రహమును కురిపించగలదు, ఇటువంటి నమ్మకము మనకు వుండాలి.

*– క్రాంతి ధర్మి సాహిత్యం – 2 నుండి*

## శ్రీ గాయత్రీ శతకం

31. *విశ్వమాత మంత్రమ్మును విశ్వసించి*
*ఆలపింపగ ముప్పదివేల మార్లు*
*తనిసి బాలరిష్టములను తరిమివేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– విశ్వమాతయగు గాయత్రీ మాత మంత్రమును సంపూర్ణముగా విశ్వసించి ముప్పదివేల మార్లు ఆలపిస్తే ఆ తల్లి సంతృప్తినొంది బాల్యం నందు కలిగిన అరిష్టములను తరిమికొట్టి కాపాడుతుంది.*

*32. ఎవరు యత్నించి గాయత్రి నెఱగ గలరొ*
*వారు గాయత్రి మాదిరె మారగలరు*
*అట్టి శక్తిని భక్తిని అందజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– ఎవరు హృదయ పూర్వకమైన ప్రయత్నంతో గాయత్రీ దేవిని తెలుసుకుంటారో వారు గాయత్రి లాగే మారగలుగుతారు. అటువంటి గొప్పశక్తిని, అమితమైన భక్తిని విశ్వ జనయిత్రి వారికి అందిస్తుంది.*

*రచన*
*సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

జన్మభూమిపై ఆత్మీయత పెంచుకోవడం మన కర్తవ్యం.



ధారావాహిక : భక్తిగాథ-33

# అనుభవిస్తేనే భక్తి రుచి తెలుస్తుంది

మహాతపస్వి విద్రుముడు నిరంతరమూ ఆత్మమగ్నులై ఉంటారు. ఈ సమారోహంలో పెద్ద ఆకర్షణ కూడా ఏమీ లేదు. ఐనప్పటికి అంతటి తపస్వి ఎందుకు వచ్చినట్లు? అంబరీషుని స్వాగత సత్కారాలలో కూడా వారు స్థిత ప్రజ్ఞులుగానే ఉన్నారు. వశిష్ఠమహర్షితో మాత్రం వారు చాలా ఆత్మీయతతో కలిశారు. అలా కలసినపుడు వారు పెదవులపై చిరునవ్వూ, కళ్ళలో విశేషమైన కాంతి గోచరించింది. ఇలా కొద్దిక్షణాలు మాత్రమే. తర్వాత వారు ఆత్మనిమగ్నులయ్యారు. విద్రుమమహర్షి వెంట ఇద్దరు నవయువకులు కూడా వచ్చారు. వారి ముఖంపై సాధన యొక్క తేజస్సూ, తపస్సు యొక్క కాంతి ఉన్నాయి. కళ్ళల్లో పవిత్రమైన దైవీ భావన తాండవిస్తుంది. వారు విద్రుమ మహర్షి శిష్యులు.

వారిరువురి పేర్లు శీలుడు, సుభూతి. మహర్షి సూచన మేరకు వారిరువురూ వశిష్ఠమహర్షికి ప్రణమిల్లారు. నమస్కరిస్తున్నపుడు వారు ప్రదర్శించిన వినయము మెచ్చుకోతగ్గది. వారిరువురూ భాగవతోత్తముడైన అంబరీషుని కులగురువు వశిష్ఠుల వద్ద భక్తి సూత్రము యొక్క సత్యాన్ని తెలుసుకోవాలన్న కోరికతో వచ్చినట్లు తెలిపారు. వశిష్ఠమహర్షి వారి వినయశీలతకు ముగ్ధులై "మీరు యోగ్యులు, పాత్రత కలవారు. కనుకనే మహాతపస్వి విద్రుమునకు శిష్యులయ్యారు. వారి సాన్నిధ్యం దేవతలకు కూడా దుర్లభమైంది. వారి ప్రభావం వల్ల మీరు అన్నీ నేర్చుకోగలరు, తెలుసుకోగలరు" అన్నారు.

వారిరువురూ వశిష్ఠుల వారి ఆశీర్వాదం తీసుకుని వీతరాగుడైన విద్రుమ మహర్షి వద్దకు వెళ్ళారు. వశిష్ఠుల వారి సంకేతం గ్రహించిన అంబరీష మహారాజు విద్రుమ మహర్షి వద్దకు వెళ్ళి "దేవా! ఏకాదశీ పారాయణానికి ముహూర్తం సమీపించింది. పరమాత్ముడైన నారాయణుని అర్చన చేసి వ్రతపారాయణము చేద్దాము" అన్నారు. నారాయణ నామం వినగానే చిన్నపిల్లవాడిలాగా మహర్షి ఎంతో ఆతురతతో లేచాడు. అంబరీషునితో "పుత్రా! మీలాంటి పరమ భక్తులతో కలసి నారాయణుని అర్చించి భక్తి యొక్క సూత్రసత్యాన్ని తెలుసుకుంటాము" అన్నారు.

విద్రుమ మహర్షి పుత్రా అని సంబోధించే సరికి అంబరీషునికి ఇంతకాలము తనుచేసిన ఏకాదశీ పారాయణ ఫలితమంతా ఇప్పుడు తనకు లభ్యమైనట్లుగా అనిపించింది. పులకించిపోయాడు. కంఠం గద్గదమైంది. భావవిహ్వాలుడై అశ్రుపూరిత నయనాలతో విద్రుమ మహర్షి పాదాలపై వ్రాలారు. అంబరీషుని లేపి హృదయానికి హత్తుకుని మహర్షి ఇలా అన్నారు. "పుత్రా! నీవు అన్ని విధాలా చాలా యోగ్యుడివి. ఇంత కాలము నిన్ను నేను కలువలేదంటే దీని వెనుక భగవన్నారాయణుని విధానమేదో ఉంటుంది." మహర్షి ఇలా మాట్లాడే సరికి ఇదంతా తాను చేసికున్న పుణ్యాల ఫలితమేనని అంబరీషుడు ఏమీ మాట్లాడలేకపోయాడు.

అంబరీషుడు సంతోషంతో తన వద్దకు రావడం చూసి వశిష్ఠుడు అంబరీషుని కోరిక నెరవేరిందని భావించాడు. ఋషులందరితో కలసి భగవన్నారాయణుని అర్చనా ఏకాదశీ పారాయణ మహోత్సవమునకు సరయూనదీ తీరాన చేశారు. ఆకాశంలోని సూర్యభగవానుని ప్రతిబింబము నీటిలో ప్రకాశిస్తూ సాక్షాత్తూ సూర్యభగవానుడే అయోధ్యా వాసులయందు కృపకలిగి దిగివచ్చినట్లుంది. భగవన్నారాయణుని మధుర సంకీర్తనముతో జరుపుకుంటున్న ఈ ఉత్సవం ఎంతో సౌభాగ్యదాయకం. అయోధ్యా వాసులందరూ తమరాజు ఎంతో న్యాయ ప్రియుడని సంతోషించసాగారు.

మహారాజు అందరితో కలసి భోజన వ్యవస్థ జరుగుతున్న ప్రదేశానికి వెళ్ళారు. వశిష్ఠ, విద్రుమ మహర్షులను ఒక

**విజ్ఞుడు అవకాశాల కోసం ఎదురుచూడడు-సృష్టించుకుంటాడు.**

విశేషమైన అసనంపై కూర్చుండ బెట్టారు. వారికి సమీపంలోనే శీలుడూ, సుభూతులకు కూడా ఆసనం ఏర్పాటు చేశారు. వచ్చిన వారందరినీ ఆహ్వానించి సత్కార్యాలు చేసే పనిని రాజసేవకులు చేస్తుండగా ఋషుల, తాపసుల సేవను స్వయంగా అంబరీషుడే చేశారు. అలా చేస్తున్నందుకు రాజు సంతోషానికి అవధులే లేవు. ఈ సంఘటనను ఎన్నడూ మరువలేనంతగా అందరూ తమ నయనాల్లో బంధించుకున్నారు.

సుఖప్రదమూ, తృప్తికరము అయిన భోజనము అందరి ఆకలినీ శమింపచేసింది, మొదటి ముద్దను నోట్లో పెట్టుకుంటూ విద్రుమ ఋషి శిష్యులు ఒకరి వంక ఒకరు చూస్తూ మెల్లగా నవ్వుకున్నారు. వారు దేన్నో గుర్తు చేసుకున్నారు. విద్రుమ మహర్షికూడా నవ్వుకున్నారు. వీరెందుకు ఇలా మందహాసం చేశారు కారణమేమిటని వశిష్ఠ మహర్షి విద్రుమమర్షిని అడిగారు. విద్రుమ మహర్షి ఇలా నవ్వుకోవడంలోనే మేమిక్కడకి వచ్చిన కారణం దాగి ఉందని చెప్పి, చాలాకాలం క్రిందట జరిగిన ఒక సంఘటనను గురించి తెలిపాడు.

"చాలాకాలం క్రితం నేను నా శిష్యులకు భక్తిని గురించీ, భక్తుడూ, భగవంతుని స్వరూపసత్యాన్ని గురించి తెలుపుతూ భక్తియొక్క రుచిని తెలుసుకోవాలంటే మాటలతోకాదు, అనుభవించి తెలుసుకోవాలని చెప్పాను. లౌకిక విషయంగా చూస్తే రాజభోజనం ఆకలిని శమింపచేసేదని స్వయంగా అనుభవ పూర్వకంగా తెలుసుకుంటాము. మా శిష్యులు ఇక్కడ భక్తియొక్క రుచినీ, భక్త వరేణ్యుడైన అంబరీషుని భక్తిని రుచి చూశారు. వారి నవ్వులో ఆ ప్రసన్నత గోచరించింది. భక్తి మరియు భక్తునిలో వారు భగవంతుని దర్శించుకున్నారు. మరియొక వేపు రాజు తృప్తినీ, ఆకలిని శమింపచేసే ఆహారంలో కూడా భక్తి రుచిని అనుభవించారు. భక్తి రుచిని అనుభవింపచేయడానికే వారిని నేనిక్కడికి తీసుకొనివచ్చాను. వారి మాటలు నారదమహర్షిని క్రొత్త సూత్రాన్ని ఉచ్చరింపచేయడానికి ప్రేరేపించాయి.

**నతేన రాజపరితోషితః క్షుధాశాంతిర్వా (32)**

తెలుసుకున్నంత మాత్రాన రాజుకు ప్రసన్నత కలుగదు. ఆకలితీరదు.

*– అనువాదం : కె. అరవిందమ్మ*

*అఖండ జ్యోతి అక్టోబర్ 2008*

## స్త్రీలు - వేదాధ్యయనం

*స్త్రీలకు వేదాధ్యయనం చేసే అధికారం ఉన్నదా లేదా అనే విషయంపై పండిత మదన మోహన మాలవ్యా ఒక పెద్ద విద్వాంసుల సభ ఏర్పాటు చేశారు. అనేకమంది వారి వారి అభిప్రాయాలు వ్యక్తపరచారు. పండిత ప్రథమనాథ్ ఖపాల, ఘోషా, విశ్వవారా మొదలైన బ్రహ్మ వాదనుల గూర్చి వివరణ ఇస్తూ మనువు యొక్క కుమార్తె ఇలాదేవి ద్వారా బ్రహ్మ యొక్క యజ్ఞ కర్మ నిర్వహించడం జరిగిందని, అలాగే గార్గి ద్వారా యాజ్ఞవల్క్యునికి శాస్త్రార్థాలు చెప్పబడ్డాయని, జనక మహారాజు కుమార్తెలు నలుగురికి శాస్త్రోక్తంగా యజ్ఞోపవీత సంస్కారం జరిగిందని, రావణుడు సీతను అపహరించినపుడు ఆమె యజ్ఞోపవీతం త్రుంచబడిందని ఇటువంటి విషయాలు తర్కబద్ధంగా, శాస్త్రీయంగా తెలియచెప్పడంతో విద్వాంసులు ఎవరు ఆయనకు ఎదురు నిలచి కాదనలేని పరిస్థితి ఏర్పడింది.*

*ఆనాడే బెనారెస్ విశ్వ విద్యాలయపు తలుపులు స్త్రీలకు వేదాధ్యయనం చేసేందుకు సాదరంగా తెరువబడ్డాయి. దురదృష్టమేమంటే ఇటువంటివి అనేకం జరిగినప్పటికి స్త్రీల ప్రగతికి అడ్డంకులు కల్గించేవారు తయారవుతూనే ఉన్నారు. అవహేళన చేసే వారున్నారు. కాని మాలవ్యా వంటి సాహసోపేతులు ముందుకు రావాలి.*

*(ప్రజ్ఞాపురాణ కథల నుండి)*

**పుస్తక పఠనంతో తలపండిపోయినా-హృదయం ఎండిపోతే అంతా వ్యర్థమే.**

ప్రత్యేక వ్యాసం : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

# స్వతంత్ర భారతం-జీవన మూల్యాలు-ప్రస్తుత పరిస్థితి

మానవీయ అంతఃకరణానికి స్వాతంత్ర్యం అత్యంతావశ్యకం. అందుకోసం వారు చేసే ప్రయత్నాలను సమర్థించాల్సి ఉంటుంది. వారి ధైర్య సహసాలను పొగిడి తీరాలి. కాని ఇది కూడా గుర్తుంచుకోవాలి. సమాజంలో అనేకమైన దుష్ప్రవృత్తులవారు ఉంటూనే ఉంటారు. దేశంతోపాటు వారుకూడా స్వతంత్రులు అవుతారు. వారి వల్ల ప్రజల జీవనమూల్యాలకు ఆఘాతం కలగక తప్పదు. అప్పుడు వేలాదిమంది బలిదానాలతో వచ్చిన స్వాతంత్ర్యం కూడా వెక్కివెక్కి ఏడుస్తూ కాలం గడపాల్సి ఉంటుంది. ఇప్పుడు మనముందున్న సమస్యలన్నింటికీ మూలం అదే.

సద్గుణాలు, సత్ప్రవృత్తులు వికసించాలంటే స్వాతంత్ర్యం ఉండితీరాలి. కాని దానితోపాటే దుష్ప్రవృత్తుల్ని, దుర్గుణాలను నియంత్రించడం కూడా అంతే అవసరం. నిజం చెప్పాలంటే స్వాతంత్ర్యం సంపాదించడానికి పడే కష్టం కన్నా, వీటిని నిలబెట్టుకోవడానికి పడే కష్టమే ఎక్కువ. వాటి కారణంగానే నేడు దేశం అల్లకల్లోలం అవుతూ ఉంది.

స్వాతంత్ర్య ఫలం ప్రతిఒక్కరికీ వర్తిస్తుంది. దానివల్ల అందరూ సుఖసంతోషాలతో మునిగిపోతారు. అందరూ గర్విస్తారు. అలాగే స్వయం పరిపాలనలో అనంతమైన అభివృద్ధిని సాధించాం. అంతవరకు అందరికీ ఆనందమే. కానీ స్వాతంత్ర్యం వచ్చి అర్థ శతాబ్ది గడిచిందో లేదో దేశంలో రాజనీతి భ్రష్టుపట్టి పోయింది. దానికి కారణాలు అనేకం. ఎక్కువమంది నేతలు అవినీతికి దాసులయ్యారు. భోగవాదానికి తలలు వంచారు. నీతి న్యాయాలు మరుగున పడిపోయాయి. అందరికి చల్లని నీడను ఇచ్చే జీవన మూల్యాలు అనే వటవృక్షం నిలువునా ఎండిపోతున్నది.

దేశకాలపాత్రతను బట్టి జీవన మూల్యాలు వికసిస్తాయి. జీవన మూల్యాలపై సమాజశ్రేయస్సు ఆధారపడి ఉంటుంది. వీటన్నింటికీ మూలాధారం సాత్వికత, పరోపకారమే. వీటికి మానవత్వం ద్వారా సమాజం నుండి సహకారం లభిస్తుంది. కానీ సమాజంలో అవినీతి అరాచకాన్ని వృద్ధిచేస్తుంది. అందువల్ల సమాజంలో ప్రతీవ్యక్తి అనైతికతకు భయపడుతూ జీవించాల్సి ఉంటోంది.

ఆలోచనలను తెలియజేయటానికి ప్రధమసాధనం లేఖనం. స్వాతంత్ర్యం అంటే అవినీతి కాదు. అనైతిక కాదు. జీవన మూల్యాలను విస్మరించడం కాదు. మానవీయతకు పట్టంకట్టాలి. దేశాన్ని అభివృద్ధి పరచుకుంటూ స్వర్ణోత్సవాలు, వజ్రోత్సవాలు ఆనందంగా జరుపుకోవాలి. ఆలోచనలను ధైర్యంగా వ్యక్తీకరించాలంటే దేశకాలపరిస్థితులను, అవసరాలను నిర్భయంగా వ్రాయగలగాలి. వ్రాయడానికి స్వతంత్ర్యం అంటే ప్రజలకు మేలును కలిగించే విషయాలనే వ్రాయాలి. అంతేగానీ ప్రజలను అధోగతికి తీసుకుపోవడం కాదు. ఈనాడు వ్రాసి అచ్చువేస్తున్న సాహిత్యం అధికాంశం అసభ్యంగా ఉంటున్నది. మానవునిలో పశుత్వాన్ని ప్రేరేపించేదిగా ఉంటున్నది. దుర్గుణాలను రెచ్చగొట్టేదిగా ఉంటున్నది. దుష్టత్వాన్ని నేర్పించేదిగా ఉంటున్నది. ధర్మసంకటంలో పడేసేదిగా ఉంటున్నది. దాని ఫలితాన్ని మనయువత అనుభవిస్తూనే ఉంది. సమాజాన్ని గురించిన ఆలోచన దిగజారిపోతుంది. ఆలోచన విధానం వికృతరూపం దాలుస్తున్నది. జరుగకూడని సంఘటనలు జరిగిపోతున్నాయి. చారిత్రక స్థాయి పడిపోతుంది. పాపపుణ్యాలు, ఉచితానుచితాలు ఆలోచించలేకపోతున్నారు. స్వాతంత్ర్యం అంటే ఎవరి మనస్సుకు వచ్చింది వారు వ్రాయడం కాదు. కేవలం ధనార్జనకు మాత్రమే వ్రాయకూడదు. ఈనాటి లేఖకుల మనస్సు డబ్బు చుట్టూ తిరుగుతూ ఉంది. చెప్పే అంశంపైన వారిరుచులే వేరుగా ఉంటున్నాయి. వాటికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ ఉన్నారు. ధన సంపాదన కోసం ఎంతటి నీచానికి అయినా దిగజారుతూ ఉన్నారు. కొంతమంది పెద్ద మనుషులు ధనాశచూపించి కవులను, రచయితలను కొనుక్కుంటూ ఉన్నారు.

ఈనాడు బజార్లో దొరుకుతున్న సాహిత్యాన్ని అంతా ఒక్కచోటకు చేర్చి వర్గాలుగా విభజించి చూస్తే సమాజానికి ఉపయోగపడే సాహిత్యం ఎంత? నష్టం కలిగించే సాహిత్యం ఎంత? అనేది బయట పడుతుంది. వ్రాయడానికి ఇచ్చిన స్వాతంత్ర్యం ఎంతగా ఉపయోగపడుతున్నదీ అర్థం అవుతుంది. ఇప్పటికైనా ఎలాంటి సాహిత్యంకావాలో ఆలోచించగలగాలి.

ఈనాడు వెలువడుతున్న పత్రికలు, పుస్తకాలు ప్రజలకు సరిఅయిన మార్గదర్శనం చేయడం లేదు అన్న విషయం అందరికీ తెలిసిందే. వికృత సాహిత్యము అధికంగా బయటకు వస్తున్నది.

**సమాజంలో నీవు ఖ్యాతి పొందడం కన్నా-సమాజ ఖ్యాతి పొందడమే మిన్న.**

ప్రాచీన సంస్కృతిని మట్టుపెట్టే సాహిత్యానికే పెద్దలు అవార్డులు ప్రదానం చేయడం విచిత్రంగా అనిపిస్తుంది. ఆలోచనా పరులు ఖండించినా లెక్కకు తీసుకోవడం లేదు.

ఆలోచనలను వ్యక్తీకరించడానికి రెండవ మార్గం భాషణం. ధర్మపీఠాలపైన జరిగే కథా ప్రవచనాలు వృధా ప్రలాపాలుగా అవుతున్నాయి. వాటిల్లో వివేకంకానీ, సౌందర్యంకానీ, వాస్తవంగానీ ఉండడం లేదు. రాజకీయవేదికలపైన చెప్పబడే విషయాలు కేవలం తమ తమ పార్టీలకు ఉపయోగపడేలా ఉంటాయి. దేశ ప్రజలకు జాతీయతను నేర్పించేదిశగా ఒక్కరూ మాట్లాటంలేదు. దౌర్జన్యాన్ని, అరాచకాన్ని రెచ్చగొడుతున్నారు. ఫలితంగా కొట్లాటలు, విరోధాలు పెరిగిపోతున్నాయి. సామాన్య ప్రజలకు ఒక్కమాట కూడా ఉపకరించడం లేదు. దేశహితాన్ని కోరుకునే వారు ఈ విషయంపై బాగా ఆలోచించాలి.

ఇక మూడవ మార్గం కళావేదిక. రంగస్థలం మీద సంగీత, నాట్యం, నాటికలు మొదలైనవి ప్రదర్శించబడతాయి. సినిమా రంగం గురించి వేరుగా చెప్పాల్సిన అవసరమేలేదు. సరిఅయిన మార్గంలో కృషి చేస్తే ప్రజల మనోభావాలను తీర్చిదిద్దడానికి కళారంగానికి మించింది మరొక్కటి లేదు. కాని ఈనాటి కళారంగాన్ని పరికిస్తే సంస్కృతీ సభ్యతలను కాలరాచి వేయడంలో తానే ప్రథమస్థానంలో నిలిచిఉంది. ఈనాడు సకలకళలకు కేంద్రం సినిమాయే అని గట్టిగా చెప్పవచ్చు. సినిమాల్లో ఏమి చూపిస్తున్నారో? ఏమి నేర్పిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈనాటి అరాచకాలకు మూలకారణం సినిమాలే అని ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. ఈనాటి సినిమాలు అవినీతికి, అక్రమాలకు మూలకేంద్రంగా స్థిరపడి పోతున్నాయి. కొద్దో గొప్పో మిగిలి ఉన్న జీవన మూల్యాలు సినిమాల ద్వారా పూర్తిగా అడుగంటిపోతున్నాయి.

ప్రజల మస్తిష్కాలలో యుక్తాయుక్త విచక్షణాజ్ఞానాన్ని ప్రవేశపెట్టగలిగితే ధర్మ శాస్త్రాల అవసరమే ఉండదు. రాజకీయనాయకుల్లో జాతీయ భావాన్ని నింపగలిగితే రాజనీతి శాస్త్రాలే అక్కరలేదు. ప్రజల హృదయాలను స్వచ్ఛమైన వాతావరణంలో స్వేచ్ఛాయుత వాయువుల్లో తీర్చిదిద్దగలగడం ఎంతైనా అవసరం. మానవుడు మౌలిక అధికారాల పేరిట ఏమేమి చేస్తున్నాడో తెలుసుకోవడం కష్టంగా ఉంది. ముందు ముందు ఏం చేస్తాడో కూడా ఊహించలేకపోతున్నాం. ప్రస్తుతం మనకు కనిపిస్తున్న హిప్పి సంస్కృతి, వేషభాషలు మనలను వెక్కిరిస్తున్నాయి. పిన్నలు, పెద్దలు రకరకాల మత్తుల్లో జోగుతున్నారు. ఎవరికీ గమ్యం అంటూ లేకుండా పోతుంది. ఇదే ఒక ప్రత్యేక సంస్కృతిగా మారిపోతున్నది. వీరి స్వతంత్ర్య భావాలు స్వాతంత్ర్యాన్నే సవాలు చేస్తున్నాయి. ఫలితంగా దాంపత్య జీవితం పరిహాసాలపాలు అయిపోతున్నది. ఏరంగంలోకి తొంగిచూచినా స్వతంత్ర్యమే స్వతంత్ర్యమే కనిపిస్తుంది. సమాజ కట్టుబాట్లు కట్లుతెంచుకుని పారిపోతున్నాయి.

స్వాతంత్ర్యానికి స్వర్ణోత్సవం జరుపుకున్నాం. వజ్రోత్సవమూ జరుపుకుంటాం. కానీ మనకు అడుగడుగునా ఎదురౌతున్న విపరీత పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతున్నాం. ఈనాటి సమస్యలకు సరియైన పరిష్కారాలు కనుక్కో గలిగిననాడే మనకు స్వాతంత్ర్యం అన్న పదానికి సరియైన అర్థం తెలిసినట్లుగా భావించాలి. కుటుంబరంగం, సామాజికరంగం, రాజకీయరంగం, ఒకటేమిటి ఏ రంగం చూచినా పూర్తిగా భ్రష్టుపట్టిపోతున్నాయి. ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథంలో అడుగుపెట్టిన వైజ్ఞానిక రంగాన్ని ఆధారంగా చేసుకుని ముందుకు సాగాలి. ఇది భారతీయులందరి కర్తవ్యం.

★★★

## ఏది గొప్ప?

*శరీరం, బుద్ధి, భావనలు – వీటిలో ఏది గొప్ప అనే విషయమై వాదులాట మొదలైంది.*

***శరీరం :*** *"నేను మనిషి యొక్క అస్తిత్వానికే ప్రతీకను. నేనే లేకపోతే మనిషి తన బుద్ధినీ, భావనలనీ దేని ద్వారా వ్యక్తపరచగలడు?" అంది.*

***బుద్ధి :*** *"నేనే లేకపోతే మానవ జీవితానికీ జంతువులకీ పెద్ద తేడా ఉండేది కాదు; అంతేకాక ఇప్పటివరకు సాధించిన ప్రగతి, వికాసాల భాండాగారం విలువ లేకుండా పోయేది" అంది.*

***భావన :*** *"భావనల వల్ల మానవ జీవితం సమృద్ధిగా, అందంగా ఉంటుంది. అదే లేకపోతే మానవ జీవితానికి జడ పదార్థానికీ తేడా ఏముంది?" అంది. వీరి సంభాషణ విన్న భగవంతుడు మందహాసంతో ఇలా బోధించాడు.*

*"మానవ జీవితం మీ మూడింటివల్ల అమూల్యమైనది. నేను జీవనానికి అమూల్యమైన శరీరాన్నీ, అపారమైన బుద్ధినీ, అనంత భావనలనీ ప్రసాదించాను. ఈ మూడింటి సముచితమైన, సమగ్రమైన ఉపయోగంతో జీవితమే ఒక వరదానంగా సిద్ధిస్తుంది."*

**ఆశయంలేని జీవితం దీపంలేని ఇల్లు వంటిది.**



### పూజ్య గురుదేవుల అమృతవాణి

# దేవత్వమును వికసింపచేసుకోండి-కాలనేములు కాకండి - 2

ఇక్కడ నేను నలందా విశ్వవిద్యాలయము లాగా నేతలను తయారుచేసే విద్యాలయమును ఏర్పరచాను. చాణక్యుడు చదువు చెప్పే నలందా విశ్వవిద్యాలయములో, ఒకేసారి పదివేల మంది విద్యార్థులు చదువుకునేవారు. నాకు కూడా అలాగే పదివేల మంది విద్యార్థులకు ఒకేసారి విద్య నేర్పించాలని ఉంది. కానీ ఇక్కడ అంతమంది పట్టరే! నిన్నమొన్నటి వరకు ఇక్కడ రెండువేల ఎనిమిది వందలమంది ఉండేవారు. ఇప్పుడు నాలుగువేలమంది అయ్యారు. ఉన్న జాగాలో ఎంత కుక్కినా నాలుగువేలమంది కంటే ఎక్కువ పట్టరు. కానీ నా మనస్సులోని కోరిక ఏమిటంటే చాణక్యుడు ఏ విధంగా పదివేలమందికి పాఠాలు చెప్పి వారిని హిందుస్థాన్‌లోనూ, ప్రపంచమంతటా పంపించేవాడో అలాగే ఇక్కడ కూడా జరగాలి. ఆయనే చంద్రగుప్తుడ్ని చక్రవర్తిగా చేశాడు. నా కోరిక కూడా ఇటువంటి అనేకమంది నేతలను తయారుచేయాలని. కానీ చేయలేను. ఎందువల్లనంటే స్థల అభావమున్నది కనుక. అలాంటప్పుడు చదువు చెప్పలేను కదా! మరి నా ప్రణాళికేమిటి? ఒక క్రొత్త స్కీమ్ ఉంది. ఈ గురుపూర్ణిమ నాడు దాని గురించి మీకు చెప్పాలి. అదేమిటంటే ప్రజ్ఞావిద్యాలయము ఇక్కడే నడుస్తుంది. ఎందుకంటే కేంద్రము ఇదే కదా. శక్తి యొక్క ఉద్భవము ఇక్కడనుంచే జరుగుతుంది. జెనరేటర్ ఇక్కడే పెట్టబడుతుంది. కానీ అనేకచోట్ల ప్రజ్ఞాపాఠశాలలను మనం స్థాపించాలి. ఇందుకొరకు ఇక్కడున్న మీ అందరికీ ఒక పని అప్పగిస్తున్నాను. ఒక నెలరోజులు పాఠ్యక్రమము గల ప్రజ్ఞాపాఠశాలలు ఇక్కడే జరుగుతాయి. కాని 15 రోజుల కార్యక్రమం గల పాఠశాలలు కార్యక్షేత్రాలలో, శక్తి పీఠాలలో జరుగుతాయి. ఇక్కడ ఉత్తీర్ణులైన వారికి పెద్ద సైజు ప్రమాణపత్రము ఇవ్వబడుతుంది. కానీ అక్కడ ఉత్తీర్ణులైన వారికి చిన్నసైజు ప్రమాణపత్రము ఇవ్వబడుతుంది. పరీక్షలు అక్కడా నిర్వహింపబడతాయి. అక్కడ కూడా నేను నేతలను తయారుచేస్తాను. **మిమ్మల్ని నేను హిందుస్థాన్ యొక్కే కాదు సంపూర్ణ విశ్వము యొక్క నేతలుగా తయారు చేయదలచుకున్నాను. హిందుస్థాన్‌లో నేను పది-పది గ్రామాల సమూహాలను ఏర్పరచి వీటికి ఒక వ్యక్తిని బాధ్యత వహించమని కోరాను. అక్కడ ప్రజ్ఞాపాఠశాలలు నడుపమని అడుగుతున్నాను.** క్రిందటి సంవత్సరం నా మాటమీద మీలో కొంతమంది యజ్ఞాలు చేశారు, కొంతమంది శక్తిపీఠాలు స్థాపించారు. ఈ సంవత్సరం మీరు ఈ నిర్ణయాన్ని తీసుకుని వెళ్ళండి. నేను ప్రజ్ఞాపాఠశాల స్థాపిస్తాను లేక ఇతరులకు ప్రజ్ఞాపాఠశాల నడపమని ప్రేరణ ఇస్తాను. ఈ పనిలో మీకు ఏవిధమైన అవరోధాలు రావు.

ఈ గురుపూర్ణిమ నుంచి మీరు ఒక పని చెయ్యండి. **నిరంతరము మీరు దేవతలని అనుభూతి చెందండి.** ఎలుగుబంట్లు, కోతుల డ్రెస్సు వేసుకున్నామనుకోండి. ఒకడు లాల్చీ వేసుకుని కూర్చున్నాడు. ఒకడు పంచ కట్టుకుని కూర్చున్నాడు. ఇంకొకడు కళ్ళజోడు పెట్టుకుని కూర్చున్నాడు. అందరూ ఏదో ఒకటి ధరించే ఉన్నారు. కానీ వాస్తవానికి దేవతలు. మీరు వాస్తవానికి ఒక విశేషమైన పని కొరకు, విశేషమైన ఉద్దేశ్యముతో, ఒక విశేష ఆహ్వానం మీద పని చెయ్యటానికి వచ్చారు. ఇది మొదటి విషయం. రెండవది ఏమిటంటే, ప్రపంచంలోని దుష్ప్రవృత్తులను తొలగించి, సత్ప్రవృత్తులను అభివర్ధన చేయుట అత్యంత కష్టముతో కూడుకున్న పని అని మీకు అనిపిస్తోంది. దీనికి సంబంధించిన నోస్ట్రడామస్ యొక్క రాజనైతిక భవిష్యవాణి మీకు చెప్పాను కదా. ఇప్పుడు నా భవిష్యవాణి చెప్తున్నాను. నేను మీ శత్రువులందరినీ చంపేశాను. అడ్డంకులన్నీ తొలగించేశాను. వారందరూ జీవచ్ఛవాలే. మీ కొరకు శ్రేయసౌభాగ్యాలే మిగిల్చివుంచాను. మీ కొరకు కిరీటము సిద్ధంగా వున్నది. గొప్పతనము సిద్ధంగా వున్నది. మీరు దానిని తీసుకోండి.

**నేడు నేను చెప్పదలుచుకున్న మూడవ విషయం ఏమిటంటే, ఈ సమాజానికీ, దేశానికీ, ప్రపంచానికీ ఒక లక్షమంది కార్యకర్తలను అందజేస్తాననే సంకల్పము నెరవేర్చటానికి నలందా విశ్వవిద్యాలయము స్థాయిలో ఒక విశ్వవిద్యాలయమును స్థాపిస్తాను అని నిర్ణయించుకున్నాను.** ఈ పనిలో మీరు నాకు సహాయపడండి. అది ఎలాగంటే పదిహేను-పదిహేను రోజుల పాఠ్యక్రమము గల ప్రజ్ఞాపాఠశాలలు మీ మీ క్షేత్రాలలో నిర్వహించటానికి ప్రయత్నించండి. నేనక్కడికి పాఠాలు చెప్పటానికి రాలేను. కానీ నాశక్తినిస్తాను, నా బుద్ధినిస్తాను, నాభావనలిస్తాను, నా ప్రాణశక్తినిస్తాను, నా జీవనీశక్తినిస్తాను. అందువల్ల ఈ పాఠశాల నుండి బయటకి వచ్చినవాడు చాలా మారిపోతాడు.

**సమర్థుడు ఓరిమిని, అసమర్థుడు కోపాన్ని ప్రదర్శిస్తారు.**

ఎన్ని పనులు చెప్పాను? మూడు. ఇంకొక పని చెప్పబోతున్నాను జాగ్రత్తగా వినండి. నేను ఒక యుద్ధాన్ని మొదలుపెట్టాను. దుష్ప్రవృత్తుల నిర్మూలన కొరకు యుద్ధము మొదలుపెట్టాను. సత్ప్రవృత్తుల సంవర్ధన కొరకు యుద్ధము మొదలుపెట్టాను. రామరాజ్య స్థాపన కొరకు యుద్ధము మొదలుపెట్టాను. లంకాదమనము కొరకు యుద్ధము మొదలుపెట్టాను. ఇది చాలా పెద్ద పని. ఇందులో కష్టాలు కూడా వస్తాయి. కానీ ఆ కష్టాలను మీ వరకు రానివ్వను. వాటినన్నింటినీ నా మీదే వేసేసుకుంటాను. రాణాసాంగా అనే అతను తన సైనికుల మీద ఎక్కడ కత్తివేటు పడబోతుందో గమనించి, అక్కడికి పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ దెబ్బను తనమీదకు తీసుకునేవాడు. వారందరిబదులు బల్లెములు, కత్తుల దెబ్బలు తను స్వీకరించేవాడు. ఈ విధంగా ఆయన అనేకులను రక్షించాడు. ఆయన శరీరం మీద ఎనభై దెబ్బలు తగిలాక మూర్ఛతో పడిపోయాడు, అప్పుడే తన పనిని ఆపాడు. నాకు ఎనభై దెబ్బలు తగిలేంతవరకు, ఏ బాధా మీ వరకు రానివ్వను. కష్టాలు వస్తే నా మీదకే వస్తాయి. పూర్వము కూడా అలాగే జరిగింది. శ్రీ కృష్ణుడికి కష్టాలు వచ్చాయి, శ్రీరాముడికీ కష్టాలు వచ్చాయి. సీతాపహరణ జరిగింది. కానీ ఎవరికి ఏమైంది?

కానీ నా మీదకు ఇంకొక రకమైనటువంటి కష్టాలు రాబోతున్నాయి. దాని గురించి మీకు వివరంగా తెలియజేయదలచుకున్నాను. కాలనేమి ఉత్పన్నము చేసినటువంటి కష్టములు ఇవి. కాలనేమి రావణుడి కుటుంబీకుడు. అతడు అందరి బుద్ధిని భ్రష్టుపట్టిస్తాడని స్కంధ పురాణములో కథ వస్తుంది. అతని అన్న కుంభకర్ణుడు. అతడు యోగమునభ్యసించాడు. తపస్సు చేశాడు. అతను ఆరు నెలలు మెలుకువగా ఉండి ఒకరోజు మాత్రమే నిద్రపోవటానికి వరము అడగాలనుకున్నాడు. కానీ కాలనేమి అతని బుద్ధిని ఎలా భ్రష్టుపట్టించాడంటే, కుంభకర్ణుడు ఆరు నెలలు పడుకుని, ఒకరోజు మెలుకువగా ఉండేటట్టు వరమడిగేశాడు. అతనే కనుక ఆరునెలలు మెలుకువగా ఉండే వరము అడిగివుంటే, రావణాసురుడు మూలకి కూర్చుని ఉండవలసి వచ్చేది. ఇదేవిధంగా మారీచుడు కూడా తపస్సు చేశాడు. అతను స్వర్గము పొందాలనుకున్నాడు. కానీ, కాలనేమి అతని బుద్ధిని ఎలా భ్రష్టుపట్టించాడంటే, నేను స్వర్గం వెళ్ళాలి అని కోరుకోను, నేను బంగారులేడి అయిపోవాలని కోరుకుంటాను అని అనుకున్నాడు. ఎందుకంటే, మామూలు చర్మం ఉన్న లేడిని ఒక వేటగాడే వేటాడుతాడు, కానీ బంగారులేడిని వందమంది వేటగాళ్ళు వేటాడతారు. అందువల్ల అతను, పాపం మారువేషంలో ఎక్కడో మారుమూల దాక్కుని కూర్చునేవాడు. కానీ ఒక్కసారి అతను బంగారులేడిగా బైటికి వచ్చాడు. సీత కోరిక మేరకు, శ్రీరాముడు అతన్ని చంపేశాడు.

స్కంధపురాణంలోని కాలనేమి కథను నేను మీకు వినిపిస్తున్నాను. పూతనకు సంతానము లేదు. కాలనేమి ఆమెతో అన్నాడు, నీకు పిల్లలు లేరుకదా, నువ్వు మ్యాజిక్ మంత్రాన్ని తీసుకుని, శ్రీకృష్ణుడికి పాలివ్వు. నీ పాలు త్రాగగానే అతను తన తల్లిని మర్చిపోతాడు. నీ దగ్గరకే వచ్చేస్తాడు. కాలనేమి మాటలకి లొంగిపోయి, పూతన నాకు కొడుకు లేదు కదా, యశోద కొడుకుని తెచ్చుకుందాము అనుకుని వెళ్ళింది. కొడుకు దొరకలేదు కదా, చివరికి తన ప్రాణాల్నే ఇచ్చుకోవలసి వచ్చింది. శూర్పణఖతో కాలనేమి ఇలా అన్నాడు – నీవు పెళ్ళి చేసుకుంటావా? ఆమె, సరే అంది. కాలనేమి అన్నాడు – రాక్షసులు నల్లగా, మాంసం తింటూ, సారా త్రాగుతూ ఉంటారు, నిన్ను కొడతారు, తిడతారు కూడా, అందువల్ల నీకు ప్రపంచంలోనే అందరికంటే అందంగా ఉన్న పెళ్ళికొడుకుని చూపిస్తాను. నువ్వు వెళ్ళటమే ఆలశ్యం పెళ్ళైపోతుంది. పెళ్ళికొడుకు పేరు రాముడు. అతని తండ్రికి మూడు పెళ్ళిళ్ళు అయ్యాయి. రాముడికి రెండు పెళ్ళిళ్ళు చేయిద్దాం. సీత ఒక పక్కన పడివుంటుంది. నువ్వూ ఉంటావు. కానీ, రాజసింహాసనం మీద నువ్వే కూర్చుంటావు. నువ్వు తెల్లబడతావు, నీ పిల్లలు కూడా తెల్లగా ఉంటారు. శూర్పణఖ, కాలనేమి మాటలలో పడి, రామచంద్రుడి దగ్గరకు వెళ్ళి, దుర్గతి పాలైంది. ఆమె బుద్ధిని కాలనేమి భ్రష్టుపరచాడు. అతను మంధర బుద్ధిని కూడా భ్రష్టుపట్టిచ్చాడు. అతను అన్నాడు – నేను భరతుడితో నీ పెళ్ళి చేయించేస్తాను. ఈ కైకేయి ఉన్నదే, అది చనిపోతుంది, ఆ తరువాత నువ్వే రాణివి అవుతావు, రాజ్యం ఏలుతావు. కానీ అందుకు నువ్వు ఒక పని చేయాలి. భరతుడికి రాజ్యం వచ్చేటట్టుగా చూసుకోవాలి. మంధర బుద్ధిని అతను ఎంత భ్రష్టుపరచగలిగాడంటే, ఆమె కైకేయిని ఏదోవిధంగా, తన పని జరిగేటట్టు ఉపయోగించుకుంది. ఈ విధంగా అనేక విచిత్రవేషాలు వేసి అతను మంధరని సర్వనాశనం చేశాడు.

కాలనేమి యొక్క ఈ సంఘటనలు మీ అందరికీ వర్తిస్తాయి. నేను ప్రాణం కంటే ఎక్కువగా భావించే నా పిల్లలను, నా హృదయము యొక్క భాగాలను, వేరుచేయటానికి, వారి బుద్ధిని భ్రమింపచేయటానికి, ఒక కాలనేమి ప్రయత్నిస్తున్నాడు. గురువుగారు, అయితే మీకు చాలా నష్టం వస్తుంది కదా? రాదు నాయన, నాకేం నష్టం వస్తుంది! ఇప్పుడే ఈ పిల్లలు, పాడుతున్నారు కదా "కోయీ సాథ్ న దే , తో అకేలా చల్"

**ధర్మానికీ మోక్షానికీ చాలా దగ్గర సంబంధం ఉంటుంది.**

(ఎవరూ కూడా రాకపోతే, ఒంటరిగా వెళ్ళు). ఒంటరిగానే నేను వెళ్ళిపోతాను. ఒంటరిగానే వామనుడు పృథ్విని కొలిచాడు. ఒంటరిగానే పరశురాముడు 21 సార్లు పృథ్వి భారాన్ని తగ్గించాడు. ఒంటరిగా నేనేమి తక్కువవాడిని కాదు. కానీ నాకు నా పిల్లలంటే చాలా ప్రేమ. ఎవరైనా నా పిల్లల్ని, నా నుంచి లాక్కునిపోతే, దొంగిలించుకుని పోతే – ఇంటిలోని పిల్లల్ని ఎవరైనా తీసుకుపోతే, తల్లిదండ్రులకి దుఃఖం వస్తుంది కదా. అలాగే, ఒక కాలనేమి, నా నుండి నా పిల్లలను దూరం చేసేస్తే, టెర్రరిస్టుగా మార్చేస్తే నాకు చాలా దుఃఖం వస్తుంది. ఏ కాలనేమి వారి బుద్ధిని భ్రష్టు పట్టించడుకదా అని, నా 24,000 మంది పిల్లల గురించి నేను ఎప్పుడూ భయపడుతూంటాను. కాలనేమి వల్ల నాకు చాలా నష్టాలు వస్తాయి. నాకు అదే ఆందోళన తప్ప ఇంక ఏ ఆందోళనా లేదు. మిషన్ గురించి బెంగలేదు. చావు గురించి భయపడను. పని గురించి చింతించను. మిషన్ వృద్ధి చెందుతుంది. దాని గురించి ఆలోచించవలసిన అవసరం నాకు లేదు. పని ఎలాగో విస్తరిస్తుంది. గంగలో వరదలు వస్తూనే ఉంటాయి. ఆగవు కదా. వాటిని ఆపలేము కూడా. మిషన్ గురించి సహాయపడమని నేనేమీ అడగటం లేదు. కాని ఎందుకు అంటున్నాను అంటే, మీరు లాభంలో ఉంటారు. మీరు నేతలౌతారు. సర్దార్ పటేల్, నెహ్రూ, జార్జ్ వాషింగ్టన్, అబ్రహం లింకన్ అయిపోతారు. నేతలు అవడం ఎవరికి ఇష్టమో, వారు ముందుకు రండి. నాతో అడుగులో అడుగు కలపండి, భుజముతో భుజము కలపండి. కలిసి నడవకపోతే, యోగ్యులైన వ్యక్తులుగా ఎలా అవుతారు?

ఈ రోజు ఇంక ఏమీ చెప్పదలుచుకోలేదు. నా పిల్లలు, ఎవరినైతే నేను గుండెకి హత్తుకుని పెంచి పోషించానో, వారు నా ఛాతి నుండి వేరు కాకూడదు. మీరు నా ఛాతి నుండి వేరైతే, నాకు చాలా దుఃఖమొస్తుంది, చాలా కష్టం అనిపిస్తుంది. ఇంక దేనివల్లనూ నాకు కష్టం అనిపించదు, బాధ అనిపించదు. కానీ, నా ఈ చిన్న చిన్న పిల్లలు, ఎవరిమీద నాకు చాలా పెద్ద పెద్ద ఆశలున్నాయో, వారే నానుంచి విడిపోతే, వారే నాకు విరోధులైతే, నాకు చాలా బాధనిపిస్తుంది. కాలనేమిని నేను ఏమి అనగలను, అతడు కూడా భగవంతుని సృష్టే కదా! అతనే లేకపోతే, లంక యొక్క సర్వనాశనం ఎలా జరిదేది? రావణాసురుడు, సీతను అపహరించకపోతే – అది కూడా కాలనేమి యొక్క మాయే– రావణ సహితంగా లంకను సర్వనాశనము చేయగలిగే ధైర్యం ఎవరికి ఉంటుంది? ఎక్కడెక్కడ కాలనేమి అడుగు పడినదో, అక్కడక్కడ హాహాకారాలు ఉద్భవించాయి.

అందువల్ల నేను చెప్పదల్చుకున్న, నాలుగో విషయం ఏమిటంటే, నా యొక్క ఏ పిల్లవాడూ, నాఛాతి నుండి వేరవకూడదు. ఏ దొంగైనా, ఏ బాబాజీయైనా, వీరిని తన సంచిలో వేసుకుని వెళ్ళిపోతే, నాకు చాలా బాధవేస్తుంది. నా ప్రియమైన పిల్లవాడు, నా నుంచి దూరమైతే అది ఎంత కష్టకరమైనదో మీరు ఊహించలేరు. మీరు నేతాగిరి చూశారు. జనతాపార్టీ ఎలా ముక్కలైందో చూశారు. ఎలా విభేధాలు సృష్టించబడతాయో చూశారు. మీకు ఇటువంటి సంఘటనలు తెలుసు. కానీ అందరూ కలిసి ఎలా ఉంటారో తెలియదు. ఒకటిగా ఎలా ఉండగలరో తెలియదు.

నాయనలారా! ఈ నాలుగు విషయాలు గుర్తుంచుకోండి.

నేను మొదటి మీకు ఏం చెప్పాలంటే, **మీరు ఎలుగుబంట్లు, కోతుల రూపంలో ఉన్న దేవతలు.**

రెండవది ఏం చెప్పానంటే, **మీకు పేరు ప్రతిష్టలు ఇప్పించడానికి మీ విరోధులందరినీ చంపేశాను. మీ కొరకు రాజ్య సింహాసనము తయారుగా ఉంచాను. మీరు దానిని స్వీకరించండి.**

మూడవ విషయం ఏమిటంటే, నీ **వ్యక్తిగతమైన సమస్యలు, కష్టాల గురించి చింతించవద్దు. నీ వ్యక్తిగత సమస్యలను, కష్టాలను ఎవరు నివారిస్తారు? నా పుణ్యము, నా తపస్సు ఆ పని చేస్తుంది.** చాలాకాలం క్రిందటినుంచి, నేను కూడబెట్టిన పుణ్యము ప్రతివొక్కరికీ ఉపయోగపడుతుంది. కానీ కొంతమందికి ఉపయోగపడదు. నా పని ఆగేది కాదు, విస్తరిస్తూ ఉంటుంది.

**కాలనేమి నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోండి.** దారి తప్పితే, నాకు బాధ వేస్తుంది. నేను ఎంతగానో ప్రేమించిన పిల్లవాడు ఎలా మారిపోయాడు!! ఎంత ప్రేమతో, నేను ఇతన్ని పెంచాను, చూడు, ఇప్పుడు అతను ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో! దొంగల మధ్య తిరుగుతున్నాడు. అడుక్కునేవాళ్ళ మధ్య తిరుగుతున్నాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ పడరాని పాట్లు పడుతున్నాడు. మీరు ఇలా చేయవద్దు.

ఈ నాలుగు విషయాలే మీకు చెప్పటానికి, వసంతపంచమి తరువాత మీ మధ్యకి వచ్చాను. ఈనాటికి ఇది చాలు. ఈ విషయాల గురించి మళ్ళీ మళ్ళీ ఆలోచించండి. మీ పనిని నేను చూసుకుంటాను. మీరు దేవతలని గుర్తుంచుకోండి. పేరు ప్రతిష్టలు, సింహాసనము పొందాలి. మీరు నేతలు అవ్వాలి. అంతేకాక, సంచి ఉన్న బాబాజీలతో జాగ్రత్తగా ఉండాలి. వారు సంచిలో మిమ్మల్ని వేసుకుని పారిపోవచ్చు. ఇక మీ నుంచి సెలవు తీసుకుంటాను.

ఓం శాంతి ఓం శాంతి ఓం శాంతి.

**మానవుడు చేసే లోక సేవే ఆతనికి నిజమైన సంపద.**



వైజ్ఞానిక ఆధ్యాత్మికత

# బుద్ధ భగవానుని వైజ్ఞానిక ప్రయోగములు

బుద్ధ భగవానుని ధర్మచక్ర ప్రచారములో వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క అంతర్ధార సహజంగానే ప్రవహిస్తూ ఉండేది. గత కొలది కాలమునుండి వారు జేతవనములోనే ఉంటున్నారు. రేవతుడు, భిక్షువు మహాకాశ్యపుడు, భదంతుడు, మౌద్గల్యాయనుడు ఆ రోజులలో బుద్ధభగవానునితోనే ఉన్నారు. ఆనందుడైతే బుద్ధ భగవానుని సేవయే తన సర్వస్వముగా భావించేవాడు, కాబట్టి ఆయన ఎల్లప్పుడూ భగవానుని సహచరులుగా ఉండేవారు. తథాగతుని యొక్క ఉనికి జిజ్ఞాసువులకు ఆయస్కాంతములవలె ప్రకాశపూర్ణమై ఉండేది. ఇది ఎంత అద్భుతమైన సముజ్వల ప్రకాశమంటే అందులో ఆకర్షణ, సమ్మోహనము ఏకకాలములో కలగలసి ఉండేవి. దానికి వశీభూతులైన జిజ్ఞాసువులెందరో ప్రతి దినమూ బుద్ధుని వాక్కులనే అమృతమును పానము చేయుటకు వస్తూ ఉండేవారు. తథాగతుడు కూడా వారి పట్ల ఎంతో ఆదరణనూ, అభిమానాన్ని ప్రదర్శించేవారు. తమ సందేహాలను తీర్చుకోనటానికి వచ్చేవారికి ఆయన ఎంతో ఔదార్యంగా, వారి సందేహాలకు సమాధానమిస్తూ జ్ఞాన ప్రకాశాన్ని వెదజల్లేవారు. ఈ విధంగా జిజ్ఞాసువులకు ఏదో తెలియని సంతృప్తి, శాంతి లభిస్తూ ఉండేవి.

ఐతే నిరంతరం వచ్చే ఆగంతుకులలో అందరూ జిజ్ఞాసువులే ఉండరు. తథాగతుని తత్వజ్ఞానాన్ని పరీక్షించాలనే కోరికతో కూడా కొంతమంది వచ్చేవారు. శాస్త్రచర్చ అనే పేరుతో ఆయనతో వాదోపవాదములు సలుపవలెననేది మరి కొందరి ఉద్దేశ్యము. ఇంకా మరి కొందరి అభిరుచి ధార్మిక పద్ధతులు, సాంప్రదాయాలు, అభిప్రాయాలు, వాటికి సంబంధించిన కర్మకాండలు మొదలగు విషయముల పట్ల ఉండేది. భగవానుడు ఇలాంటి వారిని కూడా కలిసేవారు. తన వాక్ప్రకాశముతో వారిలోని మొండితనమును, భ్రమలను, మూర్ఖత్వమనే చీకటిని తొలగించేవారు. నిజంగా బుద్ధుని వాక్కులను విని అర్థం చేసుకుని ఆయన సన్నిధిలో ఉంటూ ఉండే వ్యక్తులు, "తథాగతుని ఆలోచనలలో వైజ్ఞానిక దృష్టి యొక్క ప్రకాశము, ప్రవర్తనలో ఆధ్యాత్మిక జీవన విలువలు మిళితమై ఉన్నాయి, ఆయన వ్యక్తిత్వం ఈ రెండింటి యొక్క మేలైన కలయికతో కూడిన సముజ్వలమైన పరిభాషగా" అనుభూతి చెందుతుండేవారు. తథాగతుడు కూడా ప్రతిక్షణము, ప్రతి నిముషము వారందరి హృదయాలలోనూ, తన బోధనలనే కరుణాపూర్ణ ధారలను వర్షిస్తూ ఉండేవారు.

ఈ సమయంలో కూడా ప్రస్తుతం వారు అదే పనిలో నిమగ్నమైయున్నారు. ఇప్పుడు వారు జేతవనంలోని తూర్పు భాగంలో ఉన్న అశ్వత్థ వృక్షపు నీడలో సుఖాసీనులై ఉన్నారు. వారి ముందు మొదటి వరుసలో అర్యులైన రేవతుడు, మహాకాశ్యపుడు, మౌద్గల్యాయనుడు కూర్చుని ఉన్నారు. ఇతర భిక్షువులు, భిక్షుణిలు కూడా అచ్చట ఆసీనులై ఉన్నారు. ఆనందుడు వారికి కుడివైపు, కొద్దిగా వెనుకవైపుగా తిరిగి నిలబడి ఉన్నాడు. తథాగతుల వారు ఈ క్రింది విధముగా ప్రవచిస్తున్నారు. "ఆధ్యాత్మ విజ్ఞానము యొక్క ప్రయోగము జీవితమనే ప్రయోగశాలలో చేయాలి. దీర్ఘకాలము వరకూ నిరంతరము ప్రయోగము చేస్తూ, మధ్య మధ్య నియమిత అవధిలో దీనిని పరీక్షిస్తూ ఉండటం వలన సమస్తమైన బాధలను శాశ్వతముగా తొలగించుకొనగలము" భగవానుడు ఇంకా ఏదో చెప్పబోతూఉండగా, వెలుపలి నుండి వచ్చిన తరుణ వయస్కుడైన భిక్షువు ఒకరు, ఆనందునితో నెమ్మదిగా ఏదో చెప్పాడు. భిక్షువు మాటలు వింటూనే ఆనందుని ముఖంలో కొంత ఆందోళన కానవచ్చినది, కానీ అతడు నిగ్రహించుకొని, భగవానునితో ఈ విధంగా విన్నవించారు. "స్వామీ! పండితులైన బ్రాహ్మణ ఆచార్యోత్తములు కొందరు తమరిని కలవటానికి అనుమతి కోరుతున్నారు". బుద్ధభగవానుడు చిరునవ్వుతో వారిని సగౌరవముగా తోడ్కొని రమ్మని సెలవిచ్చారు.

కొద్ది సమయంలోనే పండితులందరూ తథాగతుని సముఖమున ఆశీనులైనారు. తథాగతుడు మధుర వాక్కులతో వారిని సాదరంగా ఆహ్వానించారు, కుశలప్రశ్నలు వేసి వారి క్షేమమును కనుగొని, "ఆజ్ఞాపించండి గురుదేవా" అన్నారు.

**కుండకు ఒక్క చిల్లి ఉన్నా నీరంతా కారిపోతుంది. అలాగే మానవునికి ఒక్క బలహీనత ఉన్నా పతనానికి దారి తీస్తుంది - మనువు.**

వారందరిలోను శ్రేష్టుడైన ఒక వృద్ధ ఆచార్యులవారు, “భగవాన్ మేమందరమూ ఆజ్ఞాపించుటకు రాలేదు, మిమ్మల్ని ప్రశ్నించటానికి వచ్చాము” అన్నారు. తథాగతుడు చిరునవ్వు నవ్వుతూ “మీ విద్వాంసులందరి యొక్క ప్రతి ఒక్క ఆదేశమూ నాకు శిరోధార్యమే” అన్నారు. ఈవిధంగా ఎంతో వినయంగా బుద్ధుడు ఇచ్చిన ప్రత్యుత్తరము విన్న బ్రాహ్మణ విద్వాంసులు కొంచెము వినమ్రులయ్యారు, కానీ అహంకారము యొక్క కఠోరత్వము వారిలో ఇంకా మిగిలి ఉన్నది.

“ఆత్మ భగవంతుడు” ఈ అంశంపై మీ అభిప్రాయము ఏమిటి? తమరు వేదములను, శాస్త్రములను, ఋషుల యొక్క జ్ఞానమును వ్యతిరేకిస్తున్నారని కూడా మేము విన్నాము” అని ఒక వృద్ధ బ్రాహ్మణుడు తీవ్ర స్వరంతో ప్రశ్నించాడు. ఈ ప్రశ్నకు బుద్ధుడు అత్యంత శాంత స్వరంతో ఈ విధంగా బదులు పలికాడు. “స్వామీ! మేము ఆలోచనలను గురించిన వాద, వివాదములు చేయము. ఐతే ఈ విషయముపై మా అనుభవములను మాత్రమే వ్యక్తం చేస్తాము. వేదములు, శాస్త్రములు, ఋషులు, వేనినైతే చెప్తున్నారో వాటి యొక్క ప్రయోగాత్మక ధర్మమును అంగీకరిస్తున్నాను. నేను స్వయంగా నా జీవితంలో ఆధ్యాత్మికతకు చెందిన అనేక వైజ్ఞానిక ప్రయోగములను చేశాను. ఇప్పుడు కూడా ఈ యుగమునకు అనుకూలమైన ప్రయోగములను సంపన్నము చేసే క్రమము కూడా ప్రారంభమైనది”. ఈ విధంగా చెప్తూ వారు కొంచెం సేపు ఆగి మరలా కొనసాగించారు.

యోగవిద్యలో అనుభవజ్ఞుడైన ఆచార్యులు, యోగీశ్వరులు ఐన శ్రీ కృష్ణుల వారు భగవద్గీతలో ఇలా అన్నారు.

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।
తావన్ సర్వేషు వేదేషు, బ్రాహ్మణస్య విజానతః॥ (2/46)

అనగా “అన్నివైపుల సంపూర్ణమైన జలాశయములున్నప్పుడు, ఒక చిన్న జలాశయము వల్ల ఎలాంటి ప్రయోజనము సమకూరుతుందో, ఆధ్యాత్మిక తత్వాన్ని అనుభవము చేసుకున్న బ్రాహ్మణునికి సమస్త వేదములలో కూడా అంతే ప్రయోజనము ఉంటుంది అని అర్థము.

అనగా పెద్ద పెద్ద గ్రంథములలో కూర్చబడిన జ్ఞానము కన్నా అనుభవము ఎప్పుడూ శ్రేష్ఠమైనదే! మరి ఆ గ్రంథములు వేదములైనా అంతే కదా! అందుచేత తర్కవితర్కములలో చిక్కుకుని సమయాన్ని వ్యర్థముగా గడిపే కన్నా మనమందరము వ్యక్తిగతంగా ఒక్కొక్కరి ఆధ్యాత్మిక ప్రయోగములను, వాటి పరిణామములను, తత్ఫలితంగా వెలువడిన ఫలితముల తాలుకు అనుభవములను ఒకరితోనొకరం చెప్పుకుని లాభాన్వితులమగుట మంచిది కదా.” బుద్ధుని యొక్క ఈ వాక్యములను విన్న తర్వాత వేదములలోని, శాస్త్రములలోని మంత్రములను ధారాప్రవాహంగా గంటల తరబడి పఠించటంలో నిష్ణాతులైన వారు, సంస్కృత భాషలో వాదోపవాదములను చెయ్యటంలో సమర్థులు అయినటువంటి ఆ ఆచార్యోత్తములందరు మౌనం వహించారు.

చాలాసేపటి వరకు అచ్చట నిశ్శబ్దము వ్యాపించినది. అప్పుడు బుద్ధభగవానుడు నమ్రతా పూర్వకముగా ఇలా అన్నారు. “పండితులైన ఆచార్యోత్తములారా! వాస్తవానికి ఆధ్యాత్మికత అనేది, బహుకోణములతో నిండిన ఈ మానవ జీవితము యొక్క కణకణములోను నిండి ఉన్న అంతులేని శక్తుల యొక్క సంపూర్ణమైన అనుభూతి, మరియు వ్యక్తీకరణ మాత్రమే. ఈ అనుభూతి, వ్యక్తీకరణ మీద ఆధారపడి సరళమైన, సహజమైన, సరసమైన మరియు సంవేదనా పూర్వకమైన ఆచరణ, వ్యవహారముల యొక్క పద్ధతులతో కూడిన సమాజములో ప్రవర్తిల్లునదే ధర్మము. ప్రతి యుగములోను మహానుభావులైన ఆధ్యాత్మికవేత్తలు ఈ విధముగానే ఆచరించియున్నారు. ప్రస్తుతయుగములో నేను కూడా అదే చేస్తున్నాను.” విద్వాంసులైన ఆచార్య శ్రేష్ఠులకు బుద్ధుని యొక్క ఈ వాక్కులు, వేదమూర్తులైన ఋషుల మంత్రముల వలె విన్పించినవి. బుద్ధుని యొక్క వినమ్రతతో కూడిన వేగవంతమైన ఆ వాక్ ప్రవాహములో, వారి అహంకారము ఎప్పుడు కొట్టుకుపోయినదో తెలియదు. వారందరూ కలిసి ముక్త కంఠముతో ఇలా ప్రార్థించారు. “భగవాన్ తమరు మాకు జీవితమును గురించి తెలియజేయండి!”

చిరునవ్వుతో భగవానుడు ఈ క్రింది విధముగా ప్రత్యుత్తరమిచ్చినాడు, “ఆచార్యోత్తములారా! మీరందరూ విద్వాంసులు, మీ అందరికీ సత్యము తెలుసు. అన్నింటికన్న ముందు, సంపూర్ణమైన వైజ్ఞానిక దృష్టితో జీవితము యొక్క అసలు సమస్యను వెదకవలసియున్నది. మీరు గనుక ఈ మూలసమస్యను వెదకి పట్టుకుని విశ్లేషించినట్లైతే, జీవితము యొక్క అసలు సమస్య ‘దుఃఖము’ అని మీకు అర్థమవుతుంది. ఐతే ఈ దుఃఖమునకు

**చేతలను బట్టి శీలాన్ని నిర్ణయిస్తారు - వేష భాషలను బట్టి కాదు - స్వామి వివేకానంద.**

కారణములె ఎన్నెన్నో ఉండవచ్చు, అవి ఏ విధమైనవైనా కావచ్చు. దుఃఖం అంటే ఏమిటో తెలిస్తే, ఆ దుఃఖమునకు మూలకారణం కోరిక అని కూడా అర్థమౌతుంది. ఈ రెండు అనుభవములనూ పొందిన తరువాత, దుఃఖమును నిరోధించటమూ లేదా నివారించగలిగే ఉపాయము ఈ రెండింటినీ పరిశోధించుటకు అవసరమైన అన్వేషణ అనే అతి ముఖ్యమైన అంశము మన ముందుకు వస్తుంది. ఆధ్యాత్మిక విజ్ఞానమునకు చెందిన అన్ని రకాలైన ప్రయోగములను చేయుటలోని ఉద్దేశ్యమిదే! అన్ని రకాలైన దుఃఖములు నుండి ఒక్కసారే విముక్తిని పొంది శాశ్వతంగా శాంతిని పొందగలగటానికి ఒకటే ఉపాయమని నా అనుభవం చెప్తున్నది.

దీని తర్వాత ఆధ్యాత్మిక విజ్ఞానము యొక్క తరువాతది, ఆఖరుది అయిన అన్వేషణకు చెందిన అంశము, దుఃఖాన్ని నివారించగలిగే మార్గం. నా అనుభవంలో ఇది ఎనిమిది అంశములతో కూడుకుని ఉంటుంది. 1. సమ్యక్‌దృష్టి అనగా జీవితాన్ని వివేకపూర్ణమైన దృష్టితో చూడగలగటం, 2. సమ్యక్‌సంకల్పము అనగా మంచి ఆలోచనలను ఉంచుకొనుట, 3. సమ్యక్‌వాక్ అనగా వాక్కును దోషరహితముగా ఉంచుకొనుటయే గాక, శుభమైన, హితకరమైన మాటలనే మాట్లాడటం, 4. సమ్యక్ కర్మాత్ అనగా సత్కర్మలు, మరియు నిష్కామ కర్మలలోని అర్థాన్ని తెలుసుకొని ప్రవర్తించుటం, 5. సమ్యక్ ఆజీవయానీ అనగా జీవనాన్ని సాగించటం కోసం స్వచ్ఛమైన పనులను మాత్రమే చేయటం, ఇతరులకు నష్టం కలిగే పనులలో, స్వలాభం చూసుకొనకుండా ఉండటం, 6. సమ్యక్ పురుషార్థం అనగా మనం చేసే అన్ని పనులు లేదా ప్రయత్నములు, సర్వదా సంవేదనా పూర్వకముగా ఉంచుకొనుట, 7. సమ్యక్ స్మృతి అనగా దీని ద్వారా, జ్ఞానమును కలిగి, నిన్ను నీవు పరిశోధించుకునే ప్రయత్నం చేయటం, 8. సమ్యక్ సమాధి ఈ స్థితిలోనే నిర్వాణం ప్రాప్తిస్తుంది, ఆధ్యాత్మిక విజ్ఞానము యొక్క అసలైన లక్ష్యము కూడా ఇదే. అని చెప్పి, తథాగతుడు శాంతం వహించి చిరునవ్వు నవ్వసాగారు. వింటూ ఉన్న వారందరూ ఒక అనిర్వచనీయమైన ఆనందంలో మునిగిపోయారు. కొద్ది క్షణాల పిదప, బుద్ధ భగవానుడు మధురమైన స్వరంతో ఒక వాక్యం చెప్పారు. "తీర్థంకర మహావీరులు కూడా ఈ సమయంలో సత్యాన్వేషణ విషయమై, ఇలాంటివే కొన్ని మహత్వపూర్ణమైన (అత్యంత ప్రాముఖ్యత కల్గిన ప్రయోగములు చేస్తూ ఉన్నారు"

*అఖండ జ్యోతి – జులై 2009*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

## తల్లిదండ్రుల మానసిక స్థితే సంతతిగా దిగివస్తుంది

*స్పెయిన్ దేశంలోని ఒక ఆంగ్లేయ కుటుంబంలో ఒక గర్భిణి స్త్రీ నివసించే గదిలో ఇతర చిత్రాలతో పాటు ఇథియోపియన్ జాతికి చెందిన బహద్దూర్ యొక్క చిత్రం కూడా ఉండేది. ఇది ఆమెకు చాలా ప్రియంగా తోచేది. ఆ చిత్రాన్ని పదే పదే చూస్తుండేది. ఇతర పనులలో ఉండగా కూడా ఆమెకు ఈ చిత్రమే గుర్తుకు వస్తుండేది. తరువాత కొంత కాలానికి ఒక బాలునికి జన్మ ఇచ్చింది. తల్లిదండ్రులు ఆంగ్లేయులై యుండి బిడ్డ మాత్రం పూర్తిగా ఇథియోపియన్ మాదిరి చిత్రపటంలోని బహద్దూర్ వలె జన్మించడం పట్ల అందరూ అపరిమితమైన ఆశ్చర్యం పొందారు. ఇది ఆశ్చర్య పడవలసినది ఏమీ కాదు. సహజమైన విషయమే.*

*ఇళ్ళలో భగవంతుని విగ్రహాలు, మహాపురుషుల చిత్రపటాలు పెట్టుకోవటానికి కారణం యాదృచ్ఛికం కాదు. వారి ఆకృతి నుండి ఉత్పన్నమయ్యే సూక్ష్మ భవనా ప్రభావం యొక్క లాభాన్ని పొందటానికి అవకాశం లభిస్తుంది.*

*ఒక బ్రిటిష్ వ్యక్తి ఒక బ్రెజిల్ వనితను వివాహం చేసుకున్నాడు. ఆమె రంగు తక్కువైనా ఆకర్షణీయంగా ఉండేది. పతీ పత్నీల మధ్య గాఢమైన ప్రేమానుబంధం ఉండేది. కాని వారికి సంతానం లేదు. కొంత కాలానికి ఆమె మరణించింది. భర్త అమితంగా దుఃఖించి కొంతకాలం తరువాత ఒక బ్రిటిష్ వనితను మరల వివాహం చేసుకున్నాడు. ఆమె తెల్లగా ఉండేది. భర్త మొదటి భార్య జ్ఞాపకాలను వదలలేక రెండవ భార్యను మొదటి భార్యగానే భావించేవాడు. ఈమెలో ఆమె రూపాన్నే చూసేవాడు. కొంత కాలానికి ఆమెకు ఒక పాప జన్మించింది. ఈ బ్రిటన్ వనితకు జన్మించిన పాపరంగు రూపం బ్రెజిల్ వనితను పోలి ఉన్నది. ఇది గర్భావస్థలో తండ్రి మస్తిష్కంలో నిండి ఉన్న పత్నీ ప్రేమ యొక్క సంస్కారం*

– ప్రజ్ఞా పురాణం నుండి

**అపకారం చేయకుండా ఉండడం కూడా గొప్ప ఉపకారమే అవుతుంది.**

జీవించే కళ

# త్యాగమే జీవామృతం

ఆషాఢం, శ్రావణం, భాద్రపదం కూడా ముగిసిపోతుంది. కానీ ఒక్క నీటిచుక్క కూడా పడలేదు. జ్యేష్ఠమాసం పూర్తయి ఎన్నో రోజులైనా, ఆ తాపం ఇంకా మిగిలి ఉంది. ధాన్యాగారాలు ఖాళీ అవుతున్నాయి. ఎండిన గొంతు తడుపుకోవడానికి నీళ్ళు లేవు. ప్రచండ వేడిని తట్టుకోవడానికి కాసిన చల్లటి నీళ్ళూ లేవు. బావులు, సరస్సులు, నదులన్నీ ఎండిపోయాయి. దాంతో బియ్యం నిండుకోవడమంటే కుష్ఠురోగికి గజ్జి వచ్చిన పరిస్థితైంది. ఇంతటి సంకట స్థితి! అంతటా హాహాకారాలు వినిపిస్తున్నాయి. దీనికి సమాధానమేంటి? ఎలా ఈ పరిస్థితిని తట్టుకోవాలి? బుద్ధి పనిచేయటం లేదు. ఉన్న అస్త్రాలేవీ దీనికి సమాధానం ఇవ్వలేకపోతున్నాయి. బ్రహ్మాస్త్రం వంటి అజేయమైన అస్త్రం కూడా అమ్ములపొదిలో లేదు. అయ్యో! భూమాత జనశూన్యమైపోతుందా! మానవబీజం ఏ మనువు దగ్గరా మిగిలిఉండదు. సంవత్సరాల తరబడి చేసిన కఠోర సాధనాఫలితమైన ఈ సభ్యత చూస్తుండగానే సమసిపోతుందా! ప్రజ్ఞ కలతచెందసాగింది.

ఆకలితో అలమటిస్తున్న పసిప్రాణాలు, విలవిలలాడుతున్న పిల్లలు, నిరాహార తపమనే కఠోర వ్రతాన్ని చేబూనిన యువకులు, కొట్టుకుంటున్న ప్రాణాన్ని త్యజించే వృద్ధులతో వాతావరణం మరింత మరింత వేదనకు లోనైంది. అందరి ముఖాల్లో చావుకళ నిండిపోయింది. స్మశాన వైరాగ్యం ఇంటిల్లిపాదిని అలుముకుంది. ఉండీ ఉండీ వినిపించే చిన్నారుల ఆక్రందన స్మశానంలో వినిపించే హాహాకారాలు లాగా అనిపించసాగింది. ఎక్కడ చూసినా బాధతో నిండిన కారుమబ్బులు అలుముకున్నాయి.

ఈ పరిస్థితి అంగిరా మహర్షికి తెలియందేమీ కాదు. తమ కుటీరంలో ఏకాంతంగా కూర్చుని ఈ విషయం మీద దీర్ఘంగా ఆలోచించసాగారు. జన సామాన్యుల లాగానే వారు చింతిస్తున్నారని వారి ముఖంలో మారే భావాలే చెపుతున్నాయి. 'మనకెందుకీ అనవసరమైన బాధ' అని కూడా అప్పుడప్పుడూ మనసుకి అనిపిస్తూండేది. కానీ తక్షణమే అందుకు విపరీతమైన ఆలోచనాధార హుంకరిస్తూ ప్రశ్నించేది. అయితే నువ్వూ మౌనదర్శకుడిగా మిగిలిపోతావా? నీ అంతరాత్మ నిన్ను ధిక్కరించదా? సమాజంలో ఇంతటి జటిల సమస్య తలెత్తినప్పుడు నీవు మాత్రం నీ ధ్యానం, సాధన, అంటూ నీ స్వార్థం, నీ ఉన్నతి గురించి మాత్రమే ఆలోచిస్తావా? నీ సొంత ఉన్నతి కోసమా! లేదు! ఈ నీతుచ్ఛ ప్రయోజనం కోసం సమాజం నుండి విముఖుడవు కాలేవు. నీవు సమాజంలో ఒక అంగానివి, దాని పట్ల నీ కర్తవ్యాన్ని ఉపేక్షించలేవు. నీ బాధ్యతకి నీవు తిలోదకాలు వదలలేవు. ఈ సంకట ఘడియలకు సమాధానం వెదకటమే నీ అతి పెద్ద సాధన, జీవితానికి సర్వోపరీ లక్ష్యం.

ఈ విధమైన ఆలోచనలతో మహర్షి సతమతమయ్యారు. ముఖంలో బాధ స్పష్టంగా కనిపించింది. నిర్ణయాత్మక బుద్ధి క్షీణించసాగింది. ఈ సందిగ్ధావస్థలో ఉండగానే అంతరాత్మ పలికింది, "నీవింకా సంశయిస్తున్నావా, లే, లేచి సమాధానం వెతుకు.

ఈ మహర్షి ముఖంలో దృఢత్వం కనిపించింది, కర్తవ్య బోధ జరిగింది. మళ్ళీ ఒకసారి తీవ్రంగా వారి ముఖకవళికలు మారాయి. కానీ ఈ సారి నిరాకరణకు చింతన వల్ల లేదా మరే అపోహవల్లనో కాదు. కళ్ళు తళుక్కుమని మెరిసాయి. వరుణదేవుని పూజ, ఆరాధనలు జరిగితేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వారికి అనిపించింది. ఇంకే! అడవి వదిలి జనారణ్యంలోకి కదిలివెళ్ళారు. వారిని తమ మధ్యలో చూసి అంతా పొంగిపోయారు. తప్పకుండా ఏదో పరిష్కారంతోనే మహర్షి తమ వద్దకొచ్చారనుకున్నారు.

మరుసటిరోజే మహర్షి అంగిరా ఒక విశాలమైన సభను ప్రకటించారు. మర్నాడు ప్రజలంతా చెప్పిన స్థలంలో, సమయానికి హాజరైనారు. ఉద్బోధ మొదలైంది.

"ఆత్మీయులారా! మనకొచ్చిన ఈ విపత్తు ఖచ్చితంగా అత్యంత జటిలమైనది. కానీ ఏ పరిష్కారము లేనటువంటిదేమీ కాదు. ఈ విషమ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఒక సమాధానం ఉంది, కాని దానికొక అడ్డంకి ఉంది" అని మహర్షుల వారు కాస్త ఆగారు. సభ నుండి ప్రజలిలా అన్నారు "మహానుభావా! ఆ అడ్డంకి ఏమిటి? అది తప్పించడానికి మేము సాయశక్తులా ప్రయత్నిస్తాం.

**భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడడమే జ్ఞానం.**

మీరు ఆజ్ఞాపించండి. అప్పుడు ఋషి పలుకులు ఇలా వినిపించాయి. ''సమాధానం జటిలమైనది. బలిదానం కోరుకుంటోంది. నరమేధ యజ్ఞంలో బలివేదిక మీద నిలబడడానికి మీలో ఎవరు సిద్ధంగా ఉన్నారో చెప్పండి?

సభలో నిశ్శబ్దం నెలకొంది. మహర్షికి ఎటువంటి సమాధానం రాలేదు. కాస్తాగాక మళ్ళీ మహర్షి వాక్కులు వినిపించాయి. "సరే ఈ పరిస్థితికి సమాధానంగా నన్ను నేనే ఆహుతి చేసుకుంటాను. మీలో ఎవరైనా వచ్చి నన్ను రాజమండప స్తంభానికి కట్టి, బలిచ్చి ఈ ఆహుతి ప్రక్రియను పూర్తి చేయండి"

సభామండపం నుండి ఒక యువకుడు ఆగమని అరిచాడు "నన్ను నేను బలిచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాను" అంగిరా మహర్షి ఆశ్చర్యపోయారు. ఆ మాటలు వినిపించిన వైపుకి దృష్టి అనాయాసంగా మర్లింది. పధ్నాలుగేళ్ళ ఒక పిల్లవాడు గర్వంగా తనవైపుకి వస్తున్నాడు. అంగిరా మహర్షికి రెండు చేతులతో నమస్కరించి బలిస్తంభానికి తనను కట్టివేయాలని పట్టుబట్టాడు. ప్రేమ పూర్వక దృష్టి సారించి మహర్షి మందహాసంతో "వత్సా! వద్దు, నీవు బాలకుడవు, ఈ కార్యానికి నేనే సరైనవాడను. నువ్వు చెప్పింది చేస్తే, రాబోయే తరాలు నన్ను నేను రక్షించుకోవడం కోసం ఒక బాలుని వధించామని ఆడిపోస్తారు" అన్నారు.

ఆ యువకుడు బిగ్గరగా నవ్వి ''మీరు నన్ను బాలకుడనుకుంటున్నారు. ఆర్యా! అది మీ ఇష్టం. వయస్సుని బట్టి, దేహపు ఒడ్డుపొడవులను బట్టి అలా అనుకోవచ్చు. కాని పిన్న వయసు కారణంగా దయలేనివాడిగా, గౌరవరహితుడిగా మిగిలిపోవడానికి నేను ఒప్పుకోను. అష్టావక్రుడు మరియు అభిమన్యుల ప్రసంగం మీరు మరిచిపోలేదని నేను నమ్ముతున్నాను. వారి శరీరము యువకుల వలె ఉన్నది కాని చైతన్యం శూరవీరులది, శూరవీరులు ఆయువు పరిగణించరు."

అదే అభిమానంతో పలుకుతూ పోయాడు "ఆ అష్టావక్రుడి, అభిమన్యుని అంశను నేను, ఉత్తరాధికారిని, మహానుభావా! నా నరనరాల్లో వారి రక్తమే ప్రవహిస్తుంది. ఆర్యుల వంటి సాహసం, గుండెల్లో దేవపుత్రులకున్న ఉల్లాసం ఉన్నాయి. నేను సమాజానికి ఏ మాత్రం పనికొచ్చినా, నాకది గర్వంగానే ఉంటుంది. మీరు జీవించి ఉంటే సమాజంలో రాబోయే విపత్తులకి మార్గదర్శనం దొరుకుతుంది. నాదేముంది, ఒక ఉత్తంకుడు లేకపోతే మరొకడు పుట్టుకొస్తాడు, కానీ మీరులేకపోతే ఈ సమాజం ఎలా భరించగలదు? కాస్త ఆలోచించండి. మహర్షులైన మీరు నన్ను స్వీకరించెదరు గాక ముహూర్తం మించిపోతుంది. ఇక ఆలస్యం చేయకండి."

చేసేదిలేక అంగిరా మహర్షి బాలకుడైన ఉత్తంకుడిని తీసుకుని యజ్ఞమండపంలోని బలిస్థానానికి కట్టివేసారు. ఒక నడివయస్కుడు ఖడ్గాన్ని ఎత్తాడో లేదో, ఆకాశం తీవ్రంగా ఉరుముతూ కళ్ళుచెదిరే మెరుపులు కురిపించింది. అక్కడున్నవారు తలెత్తి చూసి సంతోషంతో నాట్యం చేయసాగారు. చూస్తుండగానే కుంభవృష్టిగా వర్షం కురిసింది. బాలకుడైన ఉత్తంకుని పరీక్ష పూర్తయ్యింది. అతని ఆత్మత్యాగానికి ప్రసన్నుడైన వరుణుడు, ఎన్నో ఏళ్ళగా కురవనంతటి వర్షాన్ని కురిపించాడు. నలువైపులనుండి ఉత్తంకుడికి జయజయధ్వనులు చేశారు. జ్యేష్ఠమాసపు తాపం తరువాత తుంపర్లగా పడే వర్షం మనుషులనే కాదు, పశుపక్ష్యాదులను కూడా ఉత్తేజపరుస్తుంది. ఇప్పుడు కూడా ఇలాంటి వాతావరణమే ఏర్పడింది. పరోపకారం కోసం స్వార్థత్యాగం చేసిన ఉత్తంకుని గొప్పతనం అయస్కాంతంలాగా భగవత్కృపను ఆకర్షించి కుంభవృష్టిగా అవతరించింది.

స్వయంగా ఉత్తంకుడు కూడా తన పరోపకార మహత్యం వల్ల కలిగిన ఫలితాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఎంతో కృతజ్ఞతా భావంతో మహర్షి ఎదుట వినమ్రంగా, "దేవ! త్యాగఫలం ఇంత గొప్పగా ఉంటుందని తెలిసి చకితుడనైనాను. నా శేషజీవితాన్ని మీలాగే తపస్సు, త్యాగంతో గడుపుకుంటాను. ఇంద్రియ భోగాలు, జీవితంలోని మరే కోరికలు నాకొద్దు" అని నివేదించుకున్నాడు. త్యాగము జీవితానికి అమృతం. ఈ విషయం తెలుసుకుని నిజంగానే బాలకుడైన ఉత్తంకుడు మహాత్ముడైన ఉత్తంకుడిగా మారి త్యాగానికి ప్రతీకగా నిలిచాడు.

*అఖండ జ్యోతి జులై 1999*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

**నిరంతర త్యాగ నిరతిలోనే జీవితపు సార్థకత ఉంది.**

## గాయత్రీమాత-24 శక్తిధారలు - 15

# లక్ష్మి

గాయత్రీ యొక్క ఒక ధార "శ్రీ". శ్రీ అంటే లక్ష్మీ. లక్ష్మి అంటే సమృద్ధి. గాయత్రి యొక్క కృపతో లభించే వరదానాలలో లక్ష్మీ కూడా ఒకటి. ఎవరిపై ఈ అనుగ్రహం వర్షిస్తుందో అతను దరిద్రుడు, దుర్బలుడు, అసంతృప్తి, వెనుకబడి ఉండటం జరుగదు. స్వచ్ఛత, సువ్యవస్థ అనే గుణాలను కూడా 'శ్రీ' అనవచ్చు. ఈ సద్గుణాలు ఎక్కడ ఉంటే అక్కడ దరిద్రత, కురూపత అనే సమస్యలు ఉండవు.

పదార్థములను మనుష్యుల కొరకు ఉపయోగకరంగా చేయడం వాటిని కావలసినంతగా అందచేసే సామర్థ్యాన్ని లక్ష్మి అంటారు. వాడుకలో లక్ష్మి అంటే సంపత్తిగా భావిస్తారు కానీ వస్తుతః అది చేతనత్వపు ఒక గుణం. దీనిలో నిరుపయోగ వస్తువులను ఉపయోగకరంగా చేయడం, కొంచెం లభ్యం అయినప్పటికి దానిని పూర్తిగా ఉపయోగించి సత్ప్రయోజనాలు సాధించడం ఒక గొప్ప కళ. ఇది తెలిసిన వారిని లక్ష్మీపుత్రులని, శ్రీమాన్ అని అనవచ్చు. డబ్బుగల వారిని ధనవంతులనవచ్చు, గాయత్రీ యొక్క ఒక కిరణం లక్ష్మీ. దానిని ప్రాప్తించుకునేవారు స్వల్పసాధనములతో కూడా, దానిని ఉపయోగించుకునే కళవల్ల సంపన్నుల వలె ప్రసన్నంగా ఉంటారు.

ధనమును ఎక్కువగా సంపాదించేవారిని సౌభాగ్యశాలి అని అనలేము. సద్బుద్ధి లోపం వల్ల, చేయకూడని పనులు చేయడం వల్ల మనిషి విలాసిగా, అహంకారిగా, చెడు అలవాట్ల పాలవుతాడు. మామూలుగా ధనమువల్ల ప్రజలు విలాసవంతులుగా, అపవ్యయం చేసేవారుగా అవుతుంటారు. లక్ష్మీయొక్క వాహనం గుడ్లగూబగా భావించబడింది. గుడ్లగూబ అంటే మూర్ఖత్వం. చెడు సంస్కారాలున్న వ్యక్తులకు అవసరంలేని సంపత్తి మూర్ఖుడిని చేస్తుంది. వారు ఆ ధనాన్ని దురుపయోగం చేస్తాడు. దాని ఫలస్వరూపంగా బాధే కలుగుతుంది.

లక్ష్మిని రెండు ఏనుగులు అభిషేకం చేస్తుంటాయి. ఆమె కమలాసనంలో విరాజమానమై ఉంటుంది. కమలం కోమలత్వానికి ప్రతీక. కోమలత, అందం సువ్యవస్థతో పాటే ఉంటాయి. లక్ష్మీ యొక్క ఒక పేరు కమల. దీనిని కళా అని కూడా అంటారు. వస్తువులను, సంపదలను సదుద్దేశ్యం కొరకు చక్కగా ఉపయోగించడం, దానిని పరిశ్రమతో మనోయోగంతో, నీతి న్యాయములతో సంపాయించడం అర్థకళలో ఒక భాగమే. డబ్బు సంపాయించే నేర్పు శ్రీతత్వ అనుగ్రహం యొక్క పూర్వార్థం. ప్రతి పైసా దురపయోగం చేయకపోవడం దీని ఉత్తరార్థం. ప్రతిపైసా మంచి పనికి ఖర్చుచేయాలి.

లక్ష్మీదేవిని అభిషేకం చేసే రెండు గజరాజులనే పరిశ్రమ, మనోయోగమంటారు. (మనోయోగం అంటే మనస్సు పెట్టి పని చేయడం.) వీటికి లక్ష్మీకి అవిచ్ఛిన్న సంబంధమున్నది. ఈ జంట ఎక్కడ ఉన్నాయో అక్కడ వైభవం, శ్రేయస్సు, సహకారానికి లోటు ఉండదు. ప్రతిభ అనే ధనంపై సంపన్నత, సఫలతలు వర్షిస్తాయి. వారికి అడుగడుగునా మంచి అవకాశాలు లభిస్తూనే ఉంటాయి.

గాయత్రీ తత్వదర్శనంలో, సాధనా క్రమంలో లక్ష్మి ఒక ధార. తమ కుశలతను, సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే ఎక్కడున్నప్పటికి లక్ష్మీదేవి అనుగ్రహం, అనుదానం తక్కువ ఎప్పుడు కాదు. అంతేగాక గాయత్రీ ఉపాసనలో ఒక ధార "శ్రీ సాధన" ఆ విధానం అవలంభించినట్లయితే చేతనా కేంద్రంలో నిద్రిస్తున్న క్షమతలు జాగృతమవుతాయి. దాని ఆకర్షణతో ధనవైభవములు కావలసినంతగా సహజంగానే ఏకత్రితమవుతాయి. ఏకత్రితమయితే బుద్ధి ఇచ్చే సరస్వతి, దానిని కూడబెట్టి ఉంచకుండా పరమార్థ ప్రయోజనాలకు సదుపయోగం చేసే ప్రేరణ ఇస్తుంది.

లక్ష్మీ ప్రసన్నత, ఉల్లాసం మరియు వినోదం యొక్క దేవత. ఆమె ఎక్కడుంటే అక్కడ నవ్వడం, నవ్వించే వాతావరణం తయారవుతుంది. స్వచ్ఛత లేకపోవడం దరిద్రమే. సౌందర్యం, స్వచ్ఛత, కళాత్మక అలంకరణ లక్ష్మీకి మారుపేర్లే. లక్ష్మీ సౌందర్యం యొక్క దేవత. ఆమె ఎక్కడుంటుంటో అక్కడ స్వచ్ఛత, ప్రసన్నత, సువ్యవస్థ, శ్రమశీలత మితవ్యయుతల వాతావరణం తయారుచేస్తుంది.

గాయత్రీ యొక్క లక్ష్మీధార అవగాహన చేసుకుంటే శ్రీమంతులవుతారు. అటువంటి వారి ఆనందం అతనికి మాత్రమే పరిమితంగాక అసంఖ్యాలకులను లాభాన్వితులను చేస్తుంది.

★★★

**మంచిమందు, మంచి సలహా ఎప్పుడూ వగరుగానే ఉంటాయి - వ్యాస మహర్షి.**



మహిళా జాగరణ

# విద్యావ్యాప్తియే స్త్రీలకు గౌరవాన్ని ఇవ్వగలదు

స్త్రీ యొక్క గౌరవం, ఆత్మాభిమానం అనే అంశాలను గురించి ఆలోచించవలసినప్పుడు, అందులో విద్య యొక్క ప్రాముఖ్యతను తప్పనిసరిగా జోడించవలసి ఉంటుంది. వేదకాలంనాటి భారతదేశం స్వర్ణయుగంగా పేర్కొనబడినదంటే ఆనాటి విదుషీమణులైన స్త్రీలే అందుకు ముఖ్యకారణం. వారు రాజనైతిక, సాంఘిక, శాసనాపరమైన బాధ్యతలను ఎంతో నైపుణ్యంతో నిర్వహించడమేకాక, ఋషిపరమైన వర్చస్సును కూడా కలిగిఉండేవారు. వేదాలలో పలు సందర్భాలలో దీనికి ఆధారాలు లభించగలవు. ఋగ్వేదంలో ఇరవైనాలుగుమంది, అధర్వణవేదంలో ఐదుగురు వేదవిజ్ఞానమూర్తులైన మహిళలనుగూర్చిన వివరణ ఉంది. ఏమైనాగానీ, స్త్రీ సర్వతోముఖంగా అభివృద్ధి చెందవలెనంటే, అందుకు విద్య తప్పనిసరిగా అవసరం. వేదకాలం నాటి భారతదేశపు స్వర్ణయుగాన్నీ, ప్రస్తుతకాలంలో మనం దర్శించవలెనంటే ముందుగా స్త్రీ విద్యకు సంబంధించి చేయగలిగిన సకల ప్రయత్నాలను చేసితీరాలి.

ఋగ్వేదం (2/11/17) ఖండాలలో స్త్రీపైననే మానవజీవితం ఆధారపడి ఉన్నదనియూ, ఆమెయే విద్యను ప్రసాదించగలదని వర్ణించబడినది. యజుర్వేదం (39/2)లో స్త్రీలకు వేదాధ్యనం చేయుటకు సంపూర్ణాధికారం ఉన్నట్లుగా వ్రాయబడినది. అధర్వణవేదం (11/16/13/18) ఖండాలలో బాలికలు బాలురవలెనే బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ విద్య నభ్యసించవలెనని కూడా చెప్పబడియున్నది. ఈ సందర్భంగా యుగద్రష్టయైన స్వామి వివేకానందులవారు, 'ఏ దేశంలోనైతే స్త్రీకి తగిన గౌరవాన్నిచ్చి, ఆమె చదువుకోవటానికి మంచి వసతి, ఏర్పాట్లు చేయబడతాయో, ఆ దేశం ఉన్నతిని పొందగలదు.' ఏ దేశంలోనైనాసరే సమాజికపరమైన, శాసనపరమైన, అఖరుకు ఏదో ఒక కుటుంబానికి సంబంధించిన కార్యకలాపాలనుకూడా సరియైనరీతిలో చేయజాలం' అని పదునైన మాటలతో తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూగారి అభిప్రాయంలోనైతే 'మగపిల్లలకి చదువు కేవలం ఒక వ్యక్తి చదువుమాత్రమే, కానీ ఆడపిల్ల చదువు మొత్తం కుటుంబానికి సంబంధించిన చదువు'.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ దేశానికి స్వాతంత్ర్యం లభించిన పిదప, స్త్రీవిద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ 'స్త్రీ విద్యావంతురాలుకానిదే ప్రజలు విద్యావంతులు కాలేరు. చదువు అనేదానిని కేవలం పురుషులకో లేదా స్త్రీలకో పరిమితం చేయవలసివస్తే ఆ అవకాశాన్ని స్త్రీలకే ఇవ్వాలి. ఎందుకంటే భావితరాలవారిని అనగా సంతానాన్ని విద్యావంతులను చేయగలిగినది ఒక్క తల్లులు మాత్రమే కాబట్టి' అని ఉల్లేఖించింది. స్థిరమైన పునాదులమీద క్రొత్త సమాజాన్ని నిర్మించవలెనంటే, పురుషులతో సమానంగా ప్రభావపూర్ణమైన, అసలైన అవకాశాలను స్త్రీలకు సమకూర్చటం ఎంతో అవసరం అని శ్రీమతి హంసామోహతా సమితి (1962) అభిప్రాయపడింది. 1964-1966లో ఏర్పడిన ఎడ్యుకేషన్ కమీషన్‌కూడా 'మగపిల్లలు చదువుకున్నా ఆడపిల్లల చదువుకే అధిక ప్రాముఖ్యత' అని స్పష్టం చేసింది. స్త్రీలను విద్యాపరంగానే కాక, సాంఘికంగా కూడా పురుషులతో సమానస్థాయికి తీసుకురావలెనంటే, అందుకు కొన్ని ప్రత్యేకమైన పనులను చేయవల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని 1986లో ఏర్పరచబడిన విద్యాచట్టంలో, ఈ అంశంపై విశేషమైన శ్రద్ధ కనపరచబడింది. 1996, డిసెంబర్ 23న తొమ్మిది దేశాల ప్రజలు కలసి 'అందరికీ విద్య' అనే నినాదంతో ఏర్పాటుచేసిన పెద్ద సమ్మేళనంలో స్త్రీలకు మరియు ఆడపిల్లలకు చదువు, ఇంకా వారికి అందించవల్సిన మరికొన్ని అధికారాలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించవలెనని నిర్ణయం తీసుకొనబడినది.

భారత ఇతిహాసచరిత్రలో అంధకారం వంటి మధ్యయుగం తర్వాత బ్రిటిష్‌వారి పరిపాలనా సమయంలో, స్త్రీ విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించడం ప్రారంభమైనది. 1922 నుండి 1947 వరకు జరిగిన సంఘ సంస్కరణల వల్ల గాని, గాంధీ గారు నిర్వహించిన పలు కార్యక్రమాల వల్ల ఆడపిల్ల పట్ల సమానతాభావం సమాజంలో ఉదయించింది.

స్వాతంత్ర్యం లభించిన పిదప స్త్రీ విద్యావ్యాప్తి, దానికి సంబంధించిన మార్పులు మరింతగా మెరుగైనాయి. ఏమైనా ఈ అభివృద్ధి అనుకున్నంత సంతోషదాయకమైనది కాదు అనే అనిపిస్తుంది. ఈ క్రమంలో 1990లో స్త్రీ విద్య మందంగా సాగటాన్ని గురించి 'భారతదేశంలో స్త్రీ విద్య గురించి ఎన్నో పరిశోధనలు జరిగాయి. వాటన్నింటిబట్టి తెలుస్తున్నదేమిటంటే,

బానిసకు బాధలెక్కువ - స్వతంత్రునకు బాధ్యతలెక్కువ.

'స్త్రీలు విద్యాప్రణాళికలో పాలుపంచుకోలేకపోవటానికి కొన్ని సాంఘిక, సాంస్కృతిక, ఆర్థికపరమైన కారణాలున్నాయి. వివరంగా చెప్పాలంటే మనది పురుష ప్రధాన సమాజం కావటం, స్త్రీకు అభిరుచి లేకపోవడం, అజ్ఞానం, బాల్యవివాహాలు, పేదరికం, తప్పులతో కూడిన పాఠ్యక్రమం, తగిన సౌకర్యాలు లేకపోవడం, అతివ్యయం, స్త్రీ విద్య పట్ల ఉదాసీనభావం, పరదాపద్ధతి, కొన్ని రంగాలలో సరియైన అధ్యాపకులు లేకపోవడం మొదలైనవన్నీకూడా పైన చెప్పిన కారణాలలోకి వస్తాయి' అని విస్తృతమైన వివరణ నిచ్చారు.

పైన చెప్పిన సమస్యలన్నింటిని దృష్టిలో ఉంచుకుని, స్త్రీ విద్యలో అభివృద్ధి, జాగృతి ఉండేవిధంగా అనేక ప్రణాళికలను మన దేశంలో ప్రారంభించడం జరిగింది. చక్కదిద్దబడిన జాతీయ విద్యాచట్టం (1986) దానిని అమలుపరచే ప్రణాళిక (1992)లలో స్త్రీ విద్యకు 'సమానస్థాయి ప్యాకేజీకి సంబంధించిన అంశం కావడంతో' అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. 1992వ సంవత్సరపు జనాభా లెక్కలలో పురుషులకన్నా స్త్రీ అక్షరాస్యతా వృద్ధి ప్రోత్సాహకరంగా ఉన్నట్లు తేలింది. ఈ లెక్కల ననుసరించి 1992లో పురుషుల అక్షరాస్యత 29.8% ఉండగా స్త్రీలు 39.4% విద్యావంతులైఉన్నారని నిర్ధారించబడింది. అలాగే 1992లో పురుషుల అక్షరాస్యతలో 7.5% వృద్ధికాగా, స్త్రీలలో 9.6% అభివృద్ధి కనుగొనబడింది. స్త్రీ విద్యకు సంబంధించిన అభివృద్ధి ఈ పది సంవత్సరాలలో పురుషుల అభివృద్ధికన్నా అధికంగా ఉండి. 1995-96లలో మొత్తం విద్యాభ్యాసం కోసం చేరినవారిలో బాలికలలో ప్రాథమికస్థాయిలో 43%, మధ్యమస్థాయి (మిడిల్‌క్లాస్)కి 39%, సెకండరీ హైయ్యర్ ఎడ్యుకేషనలో 34%, ఉన్నతస్థాయిలో 33% ఉన్నట్లుగా నమోదయ్యింది.

ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్ అధీనం క్రింద సంస్కరించబడిన చట్ట నిర్ధారణలో భవిష్యత్తులో నియోగించబడే ఉపాధ్యాయులలో తప్పనిసరిగా 40% మహిళలు ఉండితీరాలనే ఒక షరతు విధించబడినది. ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్ పథకం క్రింద 1987-88 లో ప్రాథమిక పాఠశాలలకు 1.49 లక్షల ఉపాధ్యాయ పదవులు భర్తీచేయగా అందులో 47.52% మహిళలే ఉన్నట్లు వెల్లడయ్యింది. బాలికల వసతిగృహాల నిర్మాణం చేపట్టవలననే ఉద్దేశ్యంలో అంతర్గతంగా ఇమిడిఉన్న లక్ష్యం కూడా వీలైనంత ఎక్కువమంది బాలికలు సెకండరీస్థాయి విద్యను పొందవలెనన్నదే! బాలికల కొరకు సుమారు 2.41 లక్షల కేంద్రాలను తెరవడం జరిగింది. నవోదయ విద్యాలయాలలోకూడా 30.91% వరకూ బాలికలు చేరటం కూడా ఖచ్చితంగా నమోదయ్యింది.

సంపూర్ణ అక్షరాస్యత ప్రచారకులు మహిళలకు పూర్తి అధికారాన్నిచ్చే ఆలోచనపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ చూపించారు. ప్రౌఢవిద్య, వయోజన విద్యాకేంద్రాలలో మహిళల పేర్లను నమోదు చేయుటలో కూడా విశేషమైన ప్రాముఖ్యత ఇవ్వబడినది. ఉన్నతస్థాయి విద్యారంగంలో, సాధారణమైన మరియు సాంకేతికపరంగాకూడా, మహిళలకు శిక్షణ ఇవ్వడానికి అవకాశాలు అద్భుతమైన రీతిలో భారీగా ఏర్పరచబడినాయి. విశ్వవిద్యాలయ, కళాశాలస్థాయిలో స్త్రీవిద్యలో ఎంతో వైవిధ్యం ఏర్పడింది. సాంఘిక, పారిశ్రామిక, వ్యాపారరంగాలలో ఏర్పడే అవసరాలకనుగుణంగా ఈ వైవిధ్యాలను సరిచేయటం జరిగింది. ఉన్నతస్థాయి విద్యాలయాలలో 1996-97 లో ప్రవేశం పొందిన మహిళలు సుమారు 22 లక్షలుకాగా, ఈ అభివృద్ధి గడచిన 46 సంవత్సరాల కాలంలో 55 రెట్లు అధికంగా పెరిగినది. ఆ సమయంలో ఉన్నతస్థాయి విద్యలో ప్రవేశించిన ప్రతి వందమంది పురుషులతో పోలిస్తే మహిళల సంఖ్య నాలుగురెట్లు అధికంగా ఉంది. అనగా 1950-51 లో 14% పెరగగా, 96-97లో 56% పెరిగింది. మొత్తం నమోదయినవారిలో స్త్రీ నమోదు శాతం 1981-82లో 27.7% ఉండగా, అది 1996-97లో 34.1కి చేరుకున్నది.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ కూడా విశ్వవిద్యాలయాలలో మహిళల అధ్యయనంలో పరిశోధన నిమిత్తం మంచి మంచి ప్రణాళికలను ఏర్పరచి, వాటిని ప్రారంభించటానికి కావల్సిన ధన సహాయం కూడా అందించింది. ఈ కమీషన్ ద్వారా సాంఘిక విజ్ఞానం, ఇంజనీరింగ్, పారిశ్రామిక సంబంధిత విజ్ఞానం, మానవ వనరులు మున్నగు వివిధ రంగాలలో మహిళా అభ్యర్థులకు టెంపరరీ అసోసియేట్‌షిప్ అనే పేరుతో 40 పదవులు సృజించబడినవి. 1996 సెప్టెంబర్ నాటికి స్త్రీవిద్య ధ్యేయంగా 33 అనుసంధాన ప్రణాళికలు ఆమోదించబడినవి. వివిధ రకాలైన ప్రస్తావనలను లేక సూచనలు పరిశీలించిన పిమ్మట 'శాశ్వత స్త్రీ విద్యాసమితి' విద్యాకేంద్రాలు తరగతులను స్థాపించడానికిగాను 21 విశ్వవిద్యాలయాలను, 11 కళాశాలలను, మరికొన్ని విశ్వవిద్యాలయ విభాగాలకు సహాయాన్ని అందించటానికి సిఫారసు చేసింది.

1992వ సంవత్సరంలో శ్రామికవిద్యాపీఠం యొక్క ప్రౌఢ విద్యాకార్యక్రమం ఆధీనంలో యూనిసెఫ్ స్వసామర్థ్యం మీద ఆధారపడి సాక్షరతాకార్యక్రమాలను నిర్వహించటానికగాను

**భావాల్లో బానిసత్వం ప్రవేశిస్తే జీవశక్తి కృశించిపోతోంది.**

ఎంపిక చేసిన 10 శ్రామికవిద్యాపీఠాలకు ప్రత్యేక సహాయాన్ని అందించింది. ఈ వరుసలో 1993 మధ్యకాలం వరకు 10,000 మంది మహిళలను అక్షరాస్యులను చేయడమేకాక, వారికి బాగా నచ్చిన ఒక పరిశ్రమలో మంచి నైపుణ్యం పొందగలిగేటంత సమర్థులను గావించింది. ఇది జాతీయవిద్యాచట్టాన్ని (1986) అనుసరించి 1989 లో మహిళా సమాఖ్యా కార్యక్రమం క్రింద ప్రారంభించబడినది. మహిళలు తమ యొక్క పరిస్థితిని సరియైనరీతిలో అర్థం చేసుకుని తమ పరిసరాలను ప్రభావితం చేయగలిగి, తమ కుటుంబానికి మంచి శిక్షణ నివ్వగలిగేటటువంటి అవకాశాలను కూడా ఉత్పన్నం చేయగలగటమే ఈ ప్రణాళిక యొక్క అసలైన లక్ష్యం.

యావత్ప్రపంచంలో అభివృద్ధి చెందిన, చెందుతూవున్న దేశాలలో స్త్రీవిద్యలో ఏర్పడుతున్న ప్రగతి చెప్పుకోదగిన స్థాయిలో ఉత్సాహపూర్వకంగానే ఉంది. శ్రీలంక, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, స్విట్జర్లాండ్, స్వీడన్ దేశాలలో సెకండరీ స్థాయిలో పురుషులకన్నా స్త్రీల ప్రవేశమే అధికంగా ఉంది. ఇంకా ప్రౌఢ, ప్రాథమిక స్థాయిలలో కూడా స్త్రీలు పురుషులతో సమంగా సాగిపోతున్నారు. మహిళల విద్యావృద్ధి కూడా గణనీయంగా పెరిగింది. ఈ దేశాలు స్త్రీ విద్యాభివృద్ధి పట్ల ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నాయి అనేది స్పష్టంగా తెలుస్తున్నది. ఏ దేశంలోనైతే ఒక్క వ్యక్తి తలసరి ఆదాయం తక్కువగా ఉంటుందో, అక్కడ స్త్రీ విద్య దయనీయమైనస్థితిలో ఉంటుంది. నేపాలు, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు స్త్రీ విద్యలో ఎంతో వెనుకబడిఉన్నాయి. అభివృద్ధి చెందిన ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం యొక్క పరిస్థితికూడా ఏమంత గొప్పగా లేదు.

ఒక సర్వే రిపోర్టుకూడా ఇదే ఫలితాలను వెల్లడించింది. స్త్రీల ప్రౌఢవిద్యారంగంలో సుమారు 130 దేశాలు మనకన్నా ముందున్నాయి. భారతదేశంలో స్త్రీ ప్రౌఢవిద్య యొక్క రేటు 38% ఉంటే, మిగిలిన ఆడపిల్లలు పాఠశాలలో చేరడం కూడా భారతదేశంలో చాలా తక్కువ. ఆసియా మహాఖండంలో, జపానుదేశంలో పాఠశాలకు వెళ్ళనివారు 39% ఉన్నారు. ఈ వరుసలో సొమాలియా అందరికన్నా వెనుకబడ్డ దేశంగా గుర్తించబడినది.

ప్రపంచంలో నూటికి నూరుపాళ్ళ స్త్రీ విద్య అమలు జరుగుతున్న దేశాలుకూడా ఉన్నాయి లేదా కనీసం 90% కన్నా అధికంగానే అక్కడ స్త్రీవిద్య నమోదవుతున్నది. అవి ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, చైనా, బల్గేరియా ఉక్రెయిన్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికాసంయుక్త రాష్ట్రాలు, ఉరుగ్వే, ఉజ్బెకిస్థాన్, వెనిజులా మొదలైనవి.

మన దేశానికి సంబంధించినంతవరకు ఈ విషయంలో మనం చేయల్సినది ఎంతో ఉంది, ఇంకా ముందుకు సాగవలసిఉంది. ఏది ఏమైనా స్వాతంత్ర్యం లభించినప్పటినుంచి ఇప్పటిదాకా స్త్రీ విద్యావిషయమై మనం తగినంత అభివృద్ధిని సాధించాం. ప్రభుత్వం ప్రణాళికలను ఏర్పాటుచేసింది, అమలుపరుస్తున్నదికూడా. కానీ ఇంత బృహత్కార్యం నిర్వహించే బాధ్యత ప్రభుత్వానికంటే సమాజానికే ఎక్కువ ఉంది. అందుచేత భావికాలపు పరిస్థితిని ఊహించి, గుర్తించగలిగిన జాగరూకులైన వ్యక్తులు, జాగృతాత్మలయొక్క అవసరం ఈనాడు ఎంతైనా ఉంది. అటువంటి బాధ్యతాయుతులైన వ్యక్తులు తమతమ రంగాలలో అక్కడున్న పరిస్థితికి అనుగుణంగా అన్ని వయస్సులలోని వనితలకు శిక్షణ ఇచ్చే ప్రణాళికలను క్రియాన్వితం చేయాలి. ఈ క్షణం, మనందరమే కాదు, మొత్తం దేశమేకాదు, యావత్ప్రపంచమంతాకూడా ఒక క్రొత్త యుగం యొక్క ముంగిట నిలబడి ఉంది. ఇలాంటి పరిస్థితులలో స్త్రీ విద్య అనే ఈ కార్యం క్రొత్త యుగానికి స్వాగతం పలికే ఉత్సవం వంటిది. ఇందులో ఆలోచనాశీలురైన ప్రతిఒక్కరూ కూడా సంపూర్ణమైన ఉత్సాహంతో పాల్గొనవలసిఉంది. వారి యొక్క ఈ బాధ్యతాయుత భాగస్వామ్యమే రాబోయే నవయుగంలో వేదకాలంనాటి స్వర్ణయుగాన్ని సాకారం చేయగలదు.

*అఖండ జ్యోతి నవంబర్ 1999*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

**దేవ సంస్కృతి విశ్వ విద్యాలయము, హరిద్వార్ వారి దూరస్థ విద్యా కోర్సు (Distance Education) "వ్యక్తిత్వ పరిష్కారము" (Personality Refinement) పరీక్షకు 2008, 2009, 2010 సం॥లో ఎన్‌రోల్ అయిన విద్యార్థులకు 2010 జూన్‌లో నిర్వహించవలసిన పరీక్షలు 2010 ఆగస్టు 21, 22 (శని, ఆది) తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించబడతాయి. విద్యార్థులు అసైన్‌మెంట్స్ & ప్రాజెక్ట్ వర్క్ సమర్పించవలసి ఉంటుంది. ఇతర వివరములకు సంప్రదించండి.**

**సీతారామ్ .వి కో-ఆర్డినేటర్**

**సెల్ : 9963578680, 9490935988, 9848979969**

**E-mail : seethu_honey@yahoo.com, aruna.vinapamula@yahoo.com**

**2010 సం॥నకు గాను జూన్-డిసెంబర్ బ్యాచ్‌నకు అడ్మిషన్స్ మొదలయినాయి.**

**ఆలోచనలే అసలైన విత్తనాలు.**

వ్యక్తి నిర్మాణము

# నాలుగు ఆదర్శములు - యుగధర్మము

21వ శతాబ్దిలో సామాన్యుల జీవితం నాలుగు ఆదర్శముల మేలు కలయికగా ఉంటుంది. 1. ఇంగిత జ్ఞానం (సమఝ్‌దారీ) 2. నిజాయితీ (ఇమాన్‌దారీ) 3. బాధ్యత (జిమ్మేదారీ) 4. సాహసము (బహాదూరీ). ఈ నాలుగు ఆదర్శములు నాలుగు వేదముల సారము. ధర్మమునకు ఇవే నాలుగు పాదాలు. అభినవ సమాజ వాతావరణము ఈ ఆదర్శములను స్వీకరించుటవలనే నిర్మించబడుతుంది. నవయుగము యొక్క నీతి శాస్త్రము, ధర్మశాస్త్రములు కూడా ఈ నాలుగు సత్యములపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని అవహేళన చేయడం వలననే అనేక దుర్భావనలు, దుష్ప్రవృత్తులు చిగురించాయి.

**1. ఇంగిత జ్ఞానము (సమఝ్‌దారీ) :** త్వరగా వచ్చే లాభము కొరకు వెంపర్లాడి భవిష్యత్తులో రానున్న దాని దుష్పరిణామాలు అర్థము చేసుకోకపోవుటనే తెలివిలేనితనము లేక ఇంగిత జ్ఞానము లేకపోవుట అంటారు. ఈ పరిస్థితే అనేక సమస్యలు, కష్టాలు, విపత్తులు, విభీషికలకు మూల కారణము.

పక్షులు కుప్పలుకుప్పలుగా తిండి సంపాదించుకోవాలనే లోభముతో వలలో చిక్కుకుంటాయి. చేప కూడా ఎరకోసము వచ్చి గాలములో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకుంటుంది. బెల్లపు పాకమున్న పాత్రలోకి ముందు-వెనుక చూడకుండా వెళ్లే ఈగలకు దుర్గతి పడుతుంది.

అసంయమపరులు, అనాచారులు, దుర్వ్యసనపరులు తాత్కాలిక లాభమునే చూస్తారు, కానీ ఈ తప్పిదమువలన రాబోయే రోజులలో ఎటువంటి దుష్పరిణామాలు ఎదుర్కోవాలి అనే విషయము గమనించుకోరు. దృష్టిదోషము ఉన్నవారు దగ్గరలో ఉన్నవే చూడగలుగుతారు. దూరంలో ఉన్న ఏ వస్తువూ కనిపించదు. అందుచేత మాటమాటికి ఎదురుదెబ్బలు తింటూ, తడబడుతూ, క్రిందపడుతూ ఉంటారు.

ఈ రోజులలో వ్యక్తి మరియు సహజమునకు ఎదురుగా అనేక సమస్యలున్నాయి. వీటన్నింటికీ ఒకే కారణము తెలివిలేనితనము, ఇంగిత జ్ఞానము లేకపోవుట. అసంయమపరులు, పైపై మెరుగులకు ప్రాధాన్యత నిచ్చేవారు, అహంకారులు, దురలవాట్లకు బానిసలై తమ వ్యక్తిత్వమును హేయమైనదిగా మార్చుకుంటారు. తమకు తామే హానిని కలిగించుకుంటారు.

ఈ రోజులలో తెలివిలేనితనము మహమ్మారిలాగా అందరి నెత్తిన ఆవరించిఉన్నది. భ్రష్టచింతనము, దుష్టఆచరణ ఈ కారణముగానే కల్గినాయి. **మనఃస్థితియే పరిస్థితులకు జన్మనిస్తుంది.** మానవుడు దారితప్పిన దేవత అనేది సత్యము. మనిషి తన భాగ్యమును కూడా తనే నిర్మించుకుంటాడు, కొనసాగుతున్న ప్రవాహగతిని మార్చగలిగే పరిపూర్ణ సామర్థ్యము అతనికున్నది. అన్నివిధాల మనిషి దారితప్పడానికి కారణము సరైన దిశాబోధ లేకపోవడమే. ఆదర్శముల పట్ల శ్రద్ధ మరియు తర్క, తథ్య ప్రమాణములతో వివేకమును కూడా సమన్వయించగలిగితే జీవితం అనే నావను కష్టాలు అనే తుఫాన్ నుండి దాటించటం చాలా సులభము.

**2. నిజాయితీ (ఇమాన్‌దారీ) :** ఇతరులు మనపట్ల ఏవిధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో మనము కూడా ఇతరులపట్ల ఆ విధంగానే ప్రవర్తించాలి. నిజాయితీకి ఇదే సమగ్ర పరిభాష. మనము ఇతరులనుండి స్నేహము, సహకారము, సద్భావనము, సద్వ్యవహారములను ఆశిస్తాము. సరిగ్గా అదే విధంగా మనము ఇతరులతో వ్యవహరించాలి. నిజాయితీ యొక్క సమస్త ఉదాహరణలు ఈ సత్యమునే నిరూపిస్తాయి. నీకే తప్పు అనిపించే పని ఇతరులపట్ల నీవు చేస్తే అది నిజాయితీ లేనితనము అవుతుంది.

మోసగించుట, కష్టము కలిగించుట, నిష్ఠూరములాడుట, అసభ్యముగా ప్రవర్తించుట, మనపట్ల ఇతరులు చేస్తే మనము సహించము. మరి అదే పని ఇతరులపట్ల మనము ఎందుకు చేయాలి? ఎదుటివారి స్థానములో మనమే ఉంటే వారినుండి మనము ఎటువంటి ప్రవర్తన ఆశిస్తాము? ప్రతి ప్రసంగములోనూ, ప్రతిక్షేత్రములోను ఈ గీటురాయిపై మనము నిజాయితీగా ఉన్నామా లేదా నిర్ణయించుకోవాలి. నిజాయితీయే ధర్మము. దీని కొరకు పెద్ద పెద్ద గ్రంథాలు చదువనవసరము లేదు. విద్వాంసులను అడుగవలసిన అవసరమూ లేదు. దానికి సంబంధించిన సుయోగ్యమైన న్యాయమూర్తి కేవలము మన అంతరాత్మే అవుతుంది. మనల్ని మనము ప్రతిసారి ప్రశ్నించుకోవాలి. మనము ఆచరిస్తున్నామో లేదో చూసుకోవాలి. ఇతరులు నిజాయితీ లేకుండా వ్యవహరించినా, కాని మనము ఆ స్థాయికి దిగజారిపోకూడదు.

**3. బాధ్యత (జిమ్మేదారీ) :** మానవుడు అనేక కర్తవ్యములు పాటించవలసి ఉంటుంది. శరీరమును స్వచ్ఛంగా ఉంచుకొనుటకు

ప్రతి విషయంలోను అవకాశాన్ని చూస్తాడు ఆశావాది - ప్రతి అవకాశంలోనూ కష్టాన్ని చూస్తాడు నిరాశావాది.

ఆహార, విహారాలలో మర్యాదలను పాటించాలి. మనస్సును సంతులితంగా ఉంచుకొనుటకు సద్భావనలనే నింపుకోవాలి. ఆర్థిక సంకటములు పెరగకుండా నిర్వహణ చూసుకోవాలి. కుటుంబములోని సభ్యులను సుయోగ్యులుగా, స్వావలంబులుగా, సంస్కారవంతులుగా ఉంచుటకు అనవతరము ప్రయత్నిస్తే ఎవరైనా సుఖముగా, సమున్నతులుగా ఉండగలుగుతారు. ఈ బాధ్యతలను ఎవరు ఉపేక్షిస్తారో, వారు అనేక కష్టములు భరించవలసి ఉంటుంది. దుఃఖములను సుఖములను పంచుకోవడం, కలిసిమెలసి జీవించడము వంటి పద్ధతులు పాటించేవారు స్వయముగా శ్రేయస్సు పొందుతారు మరియు వారిని అనేకులు అనుకరిస్తారు.

సృష్టికర్త మనిషిని తన జ్యేష్ఠపుత్రుడిగా, యువరాజుగా సృష్టించాడు. మరియు సృష్టిని సువ్యస్థితముగా, సమున్నతముగా, సుసంస్కృతంగా తయారుచేసే బాధ్యతను అప్పగించాడు. ఆ బాధ్యతను పూర్తిచేయుటకు నిమగ్నుడైనప్పుడే అతను జీవిత లక్ష్యమును సాధించగలుగుతాడు. ఈ ఆధారము పైనే మానవుడు దేవమానవస్థాయిని పొందుతాడు. ఇంతతెలిసి లోభము, మోహము, అహంకారములలో ఇరుక్కుంటే సురదుర్లభమైన సుయోగమును పోగొట్టుకున్నవాడవుతాడు, అది భయంకరమైన తప్పు అవుతుంది. ఇటువంటి బాధ్యతారాహిత్యము ఈ రోజులలో ఎక్కడా కనిపించకూడదు.

**4. సాహసము (బహాదూరీ) :** ఒక సమయములో బలవంతులు, బలహీనులపై విజయము సాధించి తమను తాము యోగ్యులుగా, శూరవీరులుగా భావించేవారు. ఇప్పుడు అటువంటి రీతులు మానవీయ శ్రేష్ఠతగా స్వీకరింపబడుటలేదు. పులులు లేళ్ళను, కుందేళ్ళను వేటాడుతాయి. పెద్ద చేప చిన్న చేపను మ్రింగుతుంది. దురాచారులు, బలహీనులపై దమనకాండ సాగించి వారిని పీడిస్తారు. వీరిని ఎవరైనా శూరవీరులు అని అంటారా? బందిపోట్లు, హంతకులు, కసాయివారు నిత్యము మరణకాండ జరుపుతూనే ఉంటారు. ఎందరి ప్రాణాలనో హరిస్తుంటారు. వారిని సహసవంతులు అనే గొప్పదనాన్ని ఎవరు, ఎక్కడ, ఎప్పుడు యిచ్చారు?

కాలము, సమాజము, సంస్కృతిని దీప్తివంతముచేస్తూ వ్యక్తి గొప్పతనము పొంగి పొరలినప్పుడే దానిని సాహసము, పరాక్రమము అంటారు. సత్ప్రవృత్తి సంవర్ధన మరియు దుష్ప్రవృత్తి నిర్మూలన అనే రెండు పురుషార్థములకు ఇప్పుడు ఎంతటి ఆవశ్యకత ఉన్నదంటే ఇంతటి ఆవశ్యకత ఇంతకుముందు ఎన్నడూ లేదు.

దుష్కర్మలు చేసేవారు అసంఖ్యాకముగా ఉన్నారు. అంధవిశ్వాసము, అనాచారములకు కొరత లేదు. నీరు పల్లానికే ప్రవహిస్తుంది. నికృష్టత వైపు వెళ్లేవారి పూర్వజన్మల సంచిత సంస్కారములు కూడా వారిని చెడుమార్గము వైపే తోస్తాయి. నేటి కాలప్రవాహములో దుష్ప్రవృత్తులే నిండిఉన్నాయి. చెడు సాంగత్యములు, అవాంఛనీయ వాతావరణముల దుష్ప్రభావము తక్కువ శక్తివంతమైనదేమీ కాదు. వీటన్నింటి సమన్వయముతో సామాన్యస్థాయి ప్రజలు పొట్టకూటికి, సంతానోత్పత్తికి మాత్రమే పరిమితమై హేయమైన జీవితము గడపవలసిన పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటినీ ఎదుర్కొంటూ కూడా తమని తాము ఉచ్చస్తరీయ ఆదర్శవాదులుగా తీర్చిదిద్దుకొనే వారిని శూరవీరులు అనవచ్చు.

దుష్టజనులు తమతమ సమూహములను తయారు చేసుకుంటారు. పరస్పరము సహాయసహకారాలు అందించుకుంటారు. కాని సజ్జనులు వారి పనిలో మాత్రమే రుచి, తత్పరత చూపిస్తారు. లోకహితముయొక్క ప్రయోజనం కొరకు సంఘటితులై కటిబద్ధులగుట నుంచి తప్పించుకుంటారు. వీరియొక్క ఈ ఒక్క బలహీనత మిగిలిన అన్ని గుణములను, సామర్థ్యములను పనికిరానివానిగా చేస్తుంది. **మన్యు (వివేక పూర్ణ సహసముతో కూడిన క్రోధము) యొక్క లేమియే దీనికి మూల కారణము.** సాహసంతోకూడిన పని ఏమిటంటే బుద్ధిని ధర్మచక్ర ప్రవర్తన, గాంధీజీ సత్యాగ్రహ ఆందోళనలో పాలుపంచుకున్నవారి వంటి సజ్జనుల సముదాయమును ఒక చోటికి చేర్చుట.

ధర్మ-దర్శనము, ఆధ్యాత్మ-తత్త్వదర్శనము యొక్క అనేక నియమములు నిర్ధారితమై ఉన్నాయి. వాటి మధ్య ఉన్న అభిప్రాయభేదాలు, హెచ్చుతగ్గులు సాధారణముగా జనమానసములను ప్రభావితము చేస్తాయి. కానీ రాబోయే రోజులలో ఇవి పూర్తిగా మారిపోతాయి. **ఇంగిత జ్ఞానము, నిజాయితీ, బాధ్యత, సాహసము (సమఝ్‌దారీ, ఇమాన్‌దారీ, జిమ్మేదారీ, బహుదూరీ) యొక్క ఈ నాలుగు ఆదర్శముల పరిధిలోనే ఉత్కృష్టత యొక్క సమస్త సిద్ధాంతములు ఉంటాయి. ఇంత చిన్న ధర్మశాస్త్రముతో యుగానికి చెందిన సమస్యలకు సమాధానము లభించడము సంభవమే.**

రాబోయే రోజులలో ఆలోచనాపరులు ఆత్మనిరీక్షణ సాధనలో ఏదోఒక రూపములో సమ్మిళితము కావల్సిఉంటుంది. పైన చెప్పిన నాలుగు ఆదర్శములు అంతఃకరణములో ఎంత లోతుగా ప్రవేశించాయో గమనించి కార్యరూపము రావడానికి ఎంత శ్రమపడవలసివచ్చిందో పరిశీలించి ఏదైనా లోటువుంటే దానిని సవరించుకునేందుకు భావనాశీలురైన ప్రతివ్యక్తి రాబోయే రోజులలో నిరంతరము ప్రయత్నము చేయవలసి ఉన్నది.

– క్రాంతి ధర్మి సాహిత్యము-2 నుండి

**పవిత్రతలేనిచోట ప్రేమ ఉండదు-ప్రేమలేని చోట శాంతి ఉండదు.**

## ఆదిశక్తి యొక్క లీలాకథలు - 2

# శ్రీ దుర్గాసప్తశతీ యొక్క రహస్యార్థం

ఆదిశక్తి యొక్క లీలలే గాథలై శ్రీదుర్గాసప్తశతీగా రూపుదాల్చి అవతరించినది. ఆదిశక్తి నిత్యమైనది. ఆమె లీలలుకూడా నిత్యమైనవి.

ఆ లీలలను వర్ణించేటటువంటి కథ అయిన ఈ దుర్గాసప్తశతీకూడా నిత్యమైనదే! దేవి యొక్క ఇతర అవతారాల వలెనే యుగయుగాలలో ఇది కూడా ప్రకటీకృతమైనది. మన యొక్క ఈ యుగంలో ప్రస్తుతం అమలులో ఉన్న శ్రీదుర్గాసప్తశతీ యొక్క రూపాన్ని గురించి పురాణంలో ఈ విధంగా చెప్పబడింది. వ్యాసమహర్షి శిష్యుడైన జైమిని మార్కండేయమహర్షిని ఈ కథల యొక్క విచిత్రతను, విశిష్టతను గూర్చి ప్రశ్నించగా, ఆయన తనకు తగినంత సమయం దొరకనందున, ద్రోణముని నలుగురు కొడుకులైన పింగాక్షుడు, వివోధుడు, సుపుత్రుడు, సుముఖుడు అనువారి వద్దకు ఆయన జైమినిని పంపించారు. తమ తండ్రి ఇచ్చిన శాపకారణంగా పక్షియోనిలో జన్మించిన ఆ నలుగురు ఆ సమయంలో వింధ్యపర్వతం యొక్క గుహలలో నివసిస్తున్నారు. మార్కండేయముని, కోష్టుకి (భాగురి)కి చెప్పిన 14 మన్వంతరాల విశేషాల సంవాదాన్ని ద్రోణపుత్రులు వినియుంటిరి. ఆ వివరాలను వారు జైమినికి చెప్పారు. అందులో ఎనిమిదో మన్వంతరానికి చెందిన విశేషాలలో ఈ దుర్గాసప్తశతీయొక్క కథ వస్తుంది.

ఈ గాథలను గురించిన విశేషాలకు ఉపనిషత్తులలోని వేదాంతచర్చను జోడించినచో, తల్లియైన ఆదిశక్తి వలెనే, ఆమె కథలు కూడా పూర్ణమైనవే అన్న విషయం మనకు బోధపడుతుంది.

**'ఓం పూర్ణమద: పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥**

అని ఉపనిషత్తు వాక్యం. బృహదారణ్యకోపనిషత్తులోని పంచమోధ్యాయం యొక్క ప్రథమ బ్రాహ్మణమునకు చెందిన మొట్టమొదటి ఖండికలో ఇమిడివున్న భావం ద్వారా భావమయి అయిన ఆ దేవి పూర్ణమైనది. ఆమె యొక్క ఈ సప్తశతీలోని కథావతారం కూడా పూర్ణమైనదే. ఎందుకనగా ఆ పూర్ణత్వంలోనుండే ఈ పూర్ణత్వం ఉదయించినది. అంతేకాదు, పూర్ణంలోనుండి పూర్ణమును తీసివేసినప్పటికి పూర్ణత్వమే మిగిలిఉంటుంది అని కూడా మనకు అర్థమౌతుంది.

ఉపనిషత్తులు ఏ బ్రహ్మ గురించి చర్చించునో, ఆ బ్రహ్మం జగదంబయే!! దేవ్యథర్వశీర్షంలో ఆమెయే స్వయంగా **'అహం బ్రహ్మస్వరూపిణి'** అనగా నేను బ్రహ్మ రూపమును అని ప్రకటించింది. అంతేకాదు **వేదోహం** అని కూడా సెలవిచ్చినదామె. అనగా నేనే వేదాన్ని అని అర్థం. ఆదిశక్తి యొక్క ఉపాసకులైన సాధకులు ఒకొక్కయుగంలోనూ అనుభూతి చెందిన ఈ అంశం ఎంతో సత్యమైనది. ఆ తల్లి వేదమేకాదు, వేదజననికూడా! సూత్రరూపంలో ఆమె గాయత్రీ అయితే, శాస్త్రరూపంలో శ్రీదుర్గాసప్తశతీగా విలసిల్లుతున్నది. వేదాలలో చెప్పబడిన విషయమే మంత్రరూపంలోనూ, సూత్రరూపంలోనూ, గాయత్రీమంత్రం యొక్క 24 అక్షరాలలో, 9 శబ్దాలలో, మూడు చరణాలలో కూడా వ్యక్తీకరించబడియున్నది. ఈ తత్త్వమే శ్రీ దుర్గాసప్తశతీ యొక్క మూడు చరిత్రలలో, 13 అధ్యాయాలలో చెప్పబడియున్నది.

శ్రీ దుర్గాదేవి యొక్క 9 రూపాలలో గాయత్రీమంత్రం యొక్క 9 శబ్దముల మర్మం ఇమిడిఉన్నది. శ్రీదుర్గాసప్తశతీ యొక్క సంపూర్ణతత్త్వమును తెలియజేయుటకు భగవంతుడైన సదాశివుడొక్కడే సమర్థుడు. మహాకాలుడైన ఆ పరమేశ్వరుడు మహాకాళియైన పరమేశ్వరి యొక్క లీలలనుగూర్చి తెలిసినవాడు. మేరుమంత్రములో ఆయన ఈ క్రిందివిధంగా వచించియున్నాడు.

**సప్తశత్యాశ్చ సకలం తత్త్వం వేద్యయమేవహి ।**
**పాదోనం శ్రీహరిర్వేత్తి వేత్యర్థం తు ప్రజాపతిః ॥**
**వ్యాసస్తుర్యాంశకం వేత్తి కోట్యంశమితరే జనః ॥**

ఎవరికాళ్ళ మీద వారు నిలబడాలి - ఎవరి బలహీనతల మీద వారు కలబడాలి.

అనగా “శ్రీదుర్గాసప్తశతీ యొక్క సంపూర్ణమైన రహస్యాన్ని గూర్చి నాకుమాత్రమే సంపూర్ణంగా తెలియును. విష్ణుభగవానునకు దీనియొక్క మూడు పాదాలను గురించిన విషయాలు తెలుసు. బ్రహ్మదేవునికి రెండు పాదాలను గురించిన జ్ఞానమున్నది. ఇతరులైన జనులు దీనిగురించి కేవలం కోటిలో ఒక వంతు మాత్రమే తెలుసుకొనగలరు' అని అర్థం.

ఈ ఒకవంతు కూడా ఎంత మహత్త్వపూర్ణమైనదంటే దీని అనుభూతి చెందిన తరువాత జీవితంలో ధర్మార్థ కామమోక్షములనే చతుర్విధపురుషార్థములు వాటంతట అవే లభ్యమవుతాయి. ఆతల్లి యొక్క దయ అనే కొంగునీడలో కూర్చున్నంతమాత్రముననే సమస్తమైన కష్టములు, ఆపదలు వాటంతట అవే తొలగిపోతాయి. అన్నిరకములైన భౌతిక, ఆధ్యాత్మిక సంపదలు తామే స్వయంగా నడచివచ్చి సాధకుని చెంతకు చేరగలవు. శ్రీ దుర్గాసప్తశతీని ఒక పుస్తకం అని మాత్రమే అని భావించేవారు మూర్ఖులే అవుతారు. తన సంతానం పట్ల ఎంతో వాత్సల్యం కలిగిన తల్లియొక్క మంత్రరూపమిది. దీని చెంతకు వచ్చినవారికి జగన్మాత యొక్క ప్రేమ, మమతలేకాదు, వారు కోరుకున్నవి ఏదైనాసరే ప్రతిక్షణమూ లభిస్తూనే వుంటాయి. ఇంతకన్నా అధికంగా ఏమి చెప్పగలం? దీని సహాయంతో అసంభవమనుకున్నవి కూడా సంభవమైతీరుతాయి.

వేదమయి, దేవజనని యొక్క రూపమైన శ్రీ దుర్గాసప్తశతీని ఏ సాధకుడైనాసరే ఎంతో సహజంగా అర్థం చేసుకొనగలడు. వేదాలకు ఆరు అంగాలు ఉంటాయి 1. శిక్ష 2. కల్పం 3. వ్యాకరణం 4. నిరుక్తం 5. ఛందశ్శాస్త్రం 6. జ్యోతిష్యం. ఈ ఆరు వేదాంగముల వలెనే శ్రీ దుర్గాసప్తశతీకి కూడా ఆరు అంగాలు ఉన్నాయి. 1. శ్రీదేవీ కవచము 2. అర్గళా స్తోత్రము 3. కీలకం 4. ప్రాధానిక రహస్యం 5. వైకృతిక రహస్యం 6. మూర్తి రహస్యం. ఈ ఆరు అంగాలలోనూ జీవితం – సృష్టి ఈ రెండింటికి సంబంధించిన వివిధరకాలైన రహస్యాలు ఇమిడిఉన్నాయి. తన మూలరూపంలో శ్రీ దుర్గాసప్తశతీ మూడువేదముల స్వరూపం. ఋగ్వేదస్వరూపమైన ప్రథమ చరిత్ర – సృష్టి జ్ఞానాలకు చెందిన మొట్టమొదటి (తొలి) రహస్యాలను వెల్లడిచేస్తుంది. యజుర్వేదస్వరూపమైన రెండవ చరిత్రలో జీవితం సృష్టి ఈ రెండింటి యొక్క అభివృద్ధికి చెందిన ఆధ్యాత్మిక సూత్రములున్నాయి. ఇక మూడవ చరిత్ర సామవేదస్వరూపం. ఇందులో పరా–అపరా ప్రకృతికి చెందిన జ్ఞానానికి సంబంధించిన గీతములు గానం చేయబడ్డాయి.

గాయత్రీమంత్రం వేదాలయొక్క సారం. ఆ విధంగానే నవార్ణమంత్రం శ్రీ దుర్గాసప్తశతీయొక్క సారం. గాయత్రీమహామంత్రం యొక్క ప్రథమ బీజాక్షరమైన **'ఓంకారం'** యొక్క భావం నవార్ణమంత్రం యొక్క వాగ్బీజమైన **'ఏం'తో** కలుస్తుంది. వ్యాహృతీ త్రయం యొక్క ఉత్కృష్టభావం మాయాబీజరూపమైన **హ్రీం** శబ్దముతో కలుస్తుంది. వ్యాహృతులు సంపూర్ణమైన క్రియాశీలతను కలిగి ఉంటాయి. నవార్ణంలో మాయను గూర్చి చెప్పబడియున్నది. గాయత్రీమంత్రం యొక్క ఒకటవ, రెండవ పాదాలకు..... 'ఆ తేజోమయుడైన, శ్రేష్ఠుడైన, సర్వవ్యాపకుడైన భగవంతుడిని నేను ధ్యానిస్తున్నాను” అని అర్థం. మనస్సు దేనినైతే ధ్యానిస్తుందో ఆ రూపంలోకి మారిపోతుంది. సాధకుడు సవితామయుడుగా మారే భావం నవార్ణమంత్రం యొక్క **'క్లీం'** బీజంలో నిహితమైయున్నది. **'ధియోయోనః ప్రచోదయాత్'** అనగా 'ఎవరైతే నా బుద్ధిని సన్మార్గంవైపు ప్రేరేపించుచున్నారో' అని అర్థం **చాముండాయై విచ్చే** అనే శబ్దం కూడా ఇదే భావాన్ని కలిగియున్నది. అనగా 'చాముండీదేవిలో నేను అర్పితం కాగోరుతున్నాను' అని అర్థం. గాయత్రీ మంత్రంలో సాధకుడు స్థితిలో గతిని' కోరుకుంటున్నాడు. నవార్ణమంత్రంలో సాధకుడు 'ఎవరిలోనైతే ఈ విశ్వం యొక్క ఉత్పత్తి, స్థితి, లయ ఈ మూడు కూడిఉన్నాయో, ఎవరైతే ఈ విశ్వం యొక్క గతిని పర్యవేక్షిస్తున్నారో, 'చణ్డవేగేతిచాముణ్డా' అని చెప్పకే ఆ చాముండిలో (తీవ్రమైన వేగంలో), **విచ్చే** శరణు పొందగోరుతున్నాడు లేదా అర్పణ చేసుకొనగోరుతున్నాడు.' ఈ విధంగా గాయత్రీ మంత్రం యొక్క సంపూర్ణ భావం నవార్ణమంత్రంలో ఉంది.

ఇంతేకాదు శ్రీదుర్గాసప్తశతీ స్వయంగా గాయత్రీ

**సంపదలతోపాటు సుగుణాలు ఉండటం మహా భాగ్యం.**

మంత్రమయమే!! గాయత్రీ మంత్రం యొక్క మూడు పాదాలు శ్రీదుర్గాసప్తశతీ యొక్క మూడు చరిత్రలకు ఆధారమైయున్నది. గాయత్రీ మంత్రం యొక్క మొదటి చరణమైన **'తత్సవితుర్వరేణ్యం'** దుర్గాసప్తశతీ యొక్క ప్రథమ చరిత్ర. ఈ చరిత్ర యొక్క అధిష్ఠాన దేవత మహాకాళి. ఋషి–బ్రహ్మ. సృష్టి ఉత్పత్తి సమయంలో, అంధకారాన్ని నశింపచేయుటకై మహాకాళి క్రియాన్వితమౌతుంది. గాయత్రీమంత్రంలోని మొదటి పాదాన్ని సాధకుడు హృదయంగమం చేసుకుని, ఎప్పుడైతే సవితాదేవతను తన ఆరాధ్యదైవంగా ఎన్నుకుంటాడో, అప్పుడే అతని అస్తిత్వంలోని అంధకారం తొలగిపోవడంతోపాటు, ఆధ్యాత్మిక ఉషోదయం ప్రారంభమౌతుంది కూడా!!

గాయత్రీ మంత్రం యొక్క రెండవ పాదమైన **'భర్గోదేవస్యధీమహి'**కి విస్తృతమైన వివరణ శ్రీదుర్గాసప్తశతీ యొక్క మధ్యమ చరిత్రలో ఉన్నది. ఈ చరిత్రకు అధిష్ఠానదేవత శ్రీ మహాలక్ష్మి, ఋషి–శ్రీమహావిష్ణువు, **'భర్గోదేవస్యధీమహి'** అనగా సవితాదేవత యొక్క తేజస్సును ధరించిన సాధకునకు యోగం, ఐశ్వర్యం లభ్యమౌతాయని అర్థం. అతనికి పాలనా, పోషణా సామర్థ్యం కలుగుతుంది. దీనినే విష్ణుతత్త్వంగా, మహాలక్ష్మియొక్క కృపగా తెలుసుకొనవలెను. గాయత్రీమంత్రం యొక్క మూడవపాదం **'ధియోయోనః ప్రచోదయాత్.'** దీనియొక్క వివరణ శ్రీదుర్గాసప్తశతీ యొక్క మూడవచరిత్రలో పొందుపరచబడినది. దీనికి మహాసరస్వతి అధిష్ఠానదేవతకాగా, ఋషి– రుద్రభగవానుడు. ఈస్థితిలో సాధకుడు తన కర్మబీజాలను సంపూర్ణంగా నశింపజేసుకొని, మోక్షాజ్ఞానాన్ని పొందుతాడు. ఇదే గాయత్రీమంత్రం యొక్క చరమలక్ష్యం. ఇక్కడ భగవంతుడైన రుద్రదేవుని కృప, మహాసరస్వతియొక్క జ్ఞానం ప్రకటీకృతమౌతాయి. శ్రీదుర్గాసప్తశతీకి చెందిన రహస్యార్థములు ఇంకా మరెన్నో కలవు. వాటినన్నింటినీకూడా మున్ముందు క్రమంగా వివరించబడతాయి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

★★★

## అసలైన పుణ్యం

*కాశీ నగర రాజు పుణ్యాన్ని కొనుటలో ప్రసిద్ధుడు. అక్కడ ఒక త్రాసు ఉంచారు. పుణ్యం అమ్మేవారు తాము నిజాయితీగా సంపాదించిన పుణ్యం గురించి వ్రాసి త్రాసు యొక్క సిబ్బిలో ఉంచేవారు. దానిననుసరించి త్రాసు బంగారు నాణాలను స్వయంగా ఇచ్చే ఏర్పాటు ఉన్నది.*

*ప్రక్కనే ఉన్న జయనగరంపై శత్రువులు దాడిచేయడం, వలన ఆ రాజు సతీసమేతంగా అర్ధరాత్రి ఉత్తచేతులతో పారిపోవలసి వచ్చింది. మరుసటి రోజు వారు ఒక చెట్టు నీడలో కూర్చుని పొట్టకూటికి ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తున్నారు. రాణి సలహా చెప్పింది. మీరు జీవితంలో చాలా దానం చేసి పుణ్యం సంపాయించుకున్నారు. దానిలో కొంత కాశీనగర రాజుకు అమ్మి ధనం తీసుకుందాం. రాజు అంగీకరించాడు. కాని ఆకలి కడుపుతో కాశీనగరం చేరేదెలా? రాణి ఒక ఉపాయం చెప్పింది. ఇక్కడ గ్రామస్థుల ఇళ్ళలో పిండి విసరి, నిత్యం తినే దానిలో కొంత మిగులుస్తాను అన్నది. రాజుగారు రొట్టెలు చేసేవాడు.*

*ఒక రోజు ఆ రాజు రొట్టెలు కాలుస్తున్నాడు. ఇంతలో ఒక బిచ్చగాడు వచ్చాడు. ఆకలిగొన్న ఆ రూపాన్ని చూసి రాజు చలించిపోయాడు. కాని ఇది కూడా ఇస్తే ఇంకా తినేదేమిటి? అప్పుడు రాణి అన్నది "మనం ఇంకొక రోజు ఆకలితో ఉండాలి" రాణి సలహాపై రొట్టెలన్నీ బిచ్చగాడికి ఇచ్చేశాడు. నెమ్మది నెమ్మదిగా పది రోజుల తరువాత కాశీనగరం చేరుకున్నారు.*

*జయనగర రాజు తన పూర్వ పుణ్యాన్ని తలచుకుని వివరణ వ్రాసి త్రాసు సిబ్బిలో ఉంచారు. కాని ఏమి లభించలేదు. అక్కడ ఉన్న పురోహితుడు మీరు శ్రమ చేసి సంపాదించిన దానిని దానం చేసి ఉంటే దాని వివరణ వ్రాసి ఉంచండి అన్నాడు. రాజుకు బిచ్చగాడికి రొట్టెలు ఇచ్చిన సంగతి గుర్తుకు వచ్చి దానిని వ్రాసి తక్కెడలో ఉంచాడు. దానికి బదులుగా బంగారు నాణేలు లభించాయి. పురోహితుడు అన్నాడు "నిజాయితీతో శ్రమ పూర్వకంగా సంపాదించిన దానిని దానం ఇచ్చినపుడే పుణ్యఫలం లభిస్తుంది".*

*రాజు, రాణి ఆ రోజు ఇచ్చిన సలహాకు, పరోపకార ప్రవృత్తికి ధన్యవాదాలు అర్పించాడు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**సంతృప్తిలేని జీవితానికి శాంతిలేదు - అసంతృప్తి లేని జీవితానికి వృద్ధి లేదు.**

నావారితో నామాట : 2011 - 2012 జన్మ శతాబ్ది సంవత్సరం

# అగ్ని పరీక్ష నుండి రక్షింపబడడానికి మహాకాలుని ఆహ్వానం

## శ్రావణ పూర్ణిమ పర్వసందర్భంగా ఆత్మావలోకన

పాఠకులకు గాయత్రీ జయంతి గురుపూర్ణిమ పర్వాల సందర్భంగా గురుసత్తాను ప్రకటించడం జరిగింది. 1984లో సూక్ష్మీకరణ సాధనను ప్రారంభిస్తూ కార్యకర్తల స్వాధ్యాయం కొరకు ఒక పుస్తకం ప్రచురించబడింది. దాని ఆధారంగానే కేంద్రంలో ప్రశిక్షణ ఇవ్వబడుతూ ఉంది. అదే పద్ధతిలో ఇప్పుడు క్షేత్రాలలో కూడా ప్రశిక్షణా తరగతులు నడుస్తూ ఉన్నాయి. దీనిపై మూడు వంతులు చర్చించడం జరిగింది. ఇక 4వ వంతు మిగిలిఉంది. ఈ చివరి భాగంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా స్వాధ్యాయం చేయాల్సి ఉంది. పరమపూజ్య గురుదేవులు హనుమంతుని స్థాయిలో స్ఫూర్తిని, సమర్పణ భావాన్ని కోరుకున్నారు, కోరుకుంటున్నారు. ఇప్పుడు నాల్గవ భాగాన్ని గూర్చి చర్చిద్దాం.

## అలసిపోయారా?

"మీ అలసటను, సౌకర్యాలను గురించి ఆలోచించకండి. ఏది చేయగలిగారో దానిని మీ గొప్పదనంగా భావించకండి. మనం చేస్తున్న శ్రమ, చేస్తున్న ఆలోచనలు ఎంతవరకు సఫలం అవుతున్నాయి అని బేరీజు వేసుకోండి." అని గురుదేవులు ఏనాడో చెప్పారు. పరోక్షంగా చెప్తూనే ఉన్నారు. "మీకిది అగ్ని పరీక్ష. ప్రతి కార్యాకర్త యొక్క జీవితంలో రెండు మలుపులు వస్తాయి. 1. పని భారం వల్ల అలసట. 2. అదే పనిని సమర్పణ భావంతో చేసినట్లైతే అదే సాధన అవుతుంది. అలసట అనేది పేరుకు కూడా ఉండదు" అని గట్టిగా చెప్పారు. అనేకమంది కార్యకర్తలను చూస్తూ ఉంటాం. వారు రోజులో 18 గంటలు పని చేస్తూనే ఉంటారు. అయినా ఎప్పుడూ అలసిపోరు. నిజమైన సమర్పణకు అలసట అనేది ఉండనే ఉండదు. కొంతమంది కార్యకర్తలు గురుసత్తాను ప్రచారం చేసేపనిలో పగలు-రాత్రిని గుర్తించరు. వారికి శనివారం, ఆదివారం అని ఉండదు. అన్ని రోజులు ఒకటిగానే పని చేస్తారు. అన్ని వేళలు ఒకటిగానే పనిచేస్తారు. ఒక వేళ శారీరిక బాధలు ఉత్పన్నమయితే పరీక్షలు చేయించుకోవాలి. తగిన చికిత్స పొందాలి. మనస్సుకు అలసటను రానీయకూడదు.

## సౌకర్యాలపై కోరిక

ప్రతి దానికీ ప్రత్యేక సౌకర్యాలు కావాలని కోరుకోవడం వల్ల అసంతృప్తి పెరిగిపోతుంది. సకల సౌకర్యాలను ప్రత్యేకంగా కావాలని కోరుకోవడం మానవ సహజమే. మనకర్తవ్యాన్ని మనమే నిర్ణయించుకోవాలి" నా అవసరం ఎంతవరకు ఉంది? ఎంత సమయంలో బ్రాహ్మణోచితంగా మిషన్ పనిని చేయగలుగుతాను? అని ప్రశ్నించుకోవాలి. వ్యక్తిగత సౌఖ్యం కోసం పరితపిస్తున్నానా? నాలో అహంకారం ప్రవేశిస్తోందా? అని మనస్సులోనే తర్కించుకోవాలి. కార్యకర్తకు అహంకారమే ప్రథమ శత్రువు. గురుదేవులు "నేను చేశాను" అని ఎన్నడూ అనలేదు. అహంకారం అనేది ఎలాంటివారికైనా శోభనివ్వదు. అజ్ఞాని మాత్రమే అహంకరిస్తాడు. మనః స్ఫూర్తిగా, సంతోషంగా మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ప్రతీక్షణం మనం పరీక్షింపబడుతూనే ఉంటాం. మంచి ఆలోచనలు చేసేవారు ఎన్నడూ చిన్న చిన్న విషయాలకు నొచ్చుకోరు. మనస్సు నిమగ్నం చేసి పనిచేయాలి. అదేయోగం అవుతుంది. స్థూల శరీరంతో చేసే శ్రమను గురుదేవులు సాధన అన్నారు. దానిని ఎప్పుడూ తప్పు అనరాదు. పొరపాటున కూడా కష్టపడి పనిచేసే వారిని చిన్నచూపు చూడరాదు.

## శ్రద్ధను పెంచుకుందాం

"శ్రద్ధతో పనిచేసేవారికే గౌరవం లభిస్తుంది. సమర్పణకు సార్థకత లభిస్తుంది. మీతోటి వారి శ్రద్ధను తగ్గిపోకుండా చూడండి. వారి శ్రద్ధను ప్రోత్సహించండి" అన్నారు గురుదేవులు. పైన తెలిపిన విధంగా నడుచుకున్నవారి సమర్పణకు మూల్యాంకనం జరుగుతూ ఉంటుంది. మూల్యాంకనం అనేది ధనములోను, సాధనలోనూ, దానధర్మాలలోను జరగదు. గురుదేవుల పాదపద్మాలకు అహంకారాన్ని సమర్పిస్తే అంతకు మించిన కానుక ఉండదు. "ఆధ్యాత్మిక రంగంలో శ్రద్ధకు ప్రముఖ స్థానం ఉన్నది. ఈ సత్యాన్ని గ్రహించండి. రాజనీతి, సమాజనీతి, ఇతర రంగాలలో జరిపే క్రియాకలాపాలలో శ్రద్ధను పాటించండి. తోటివారు ఏదైనా సమస్యలో చిక్కుకుంటే వారిలో శ్రద్ధను పెంపొందించండి. మన

**నిజంగా మనం భయపడాల్సింది భయం గురించే.**

పరిజన బృందంలో ఆదర్శాల పర్వతం కనిపించేలా నడుచుకోండి. శ్రద్ధను పెంచుకోండి" అన్నారు గురుదేవులు.

## అనేకరెట్లు విస్తరింపబడతాయి

"బాగా గుర్తుపెట్టుకోండి. రాబోయే రోజుల్లో మిషన్ కార్యక్రమాలు అనేక రెట్లు విస్తరింపబడతాయి. అందునిమిత్తం మీ శ్రద్ధను ఉన్నత స్థాయిలో అందించాల్సి ఉంటుంది" అని గురుదేవులు నొక్కి వక్కాణించారు. పరిజనులు, పాఠకులు ఈ వాక్యాల్ని మరల మరల చదవండి. 1984 నుండి 2010 వరకు సుదీర్ఘయాత్రలో మిషన్ ఎంతగా వృద్ధి చెందిందీ గుర్తు చేసుకోవాలి. జాతీయ సమైక్యతా సమ్మేళనాలు, లక్షదీపాలను లక్ష్యంగా పెట్టుకుని జరిపిన దీపయజ్ఞాలు, గురుసత్తాకు నిదర్శనాలు. గురుదేవులు మహాప్రయాణం తర్వాత వందనీయ మాతాజీ నేతృత్వంలో దేవ సంస్కృతి దిగ్విజయ ఉద్యమంలో అశ్వమేధాలు, సంస్కార మహోత్సవాలు మొదలైనవి ఎన్నెన్నో నిర్వహించబడ్డాయి. చూస్తూ ఉండగానే పరివార సంఖ్య లక్షలు, కోట్లలో పెరిగిపోయింది. శాంతికుంజ్ హరిద్వార్, గాయత్రీ తపోభూమి, యుగతీర్థం అవల్‌ఖేడా అన్నీ ఎంతో అభివృద్ధిని సాధించాయి. 1990 నుండి 2000 వరకు గల 10 సంవత్సరాలలో పరివార విస్తరణ బాగా జరిగింది. 2001 నుండి 2010 వరకు మిషన్ యువశక్తిలో చైతన్యాన్ని తీసుకువచ్చింది. దేవసంస్కృతి విశ్వవిద్యాలయం స్థాపించబడింది. బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ పరిశోధనాకార్యాలలో ముందుకు దూసుకుని పోయింది. దాని ద్వారా అంతులేని యువత మిషన్‌లో ప్రవేశించింది. యువామండల్, యూత్ గ్రూప్ (GPYG) దియా ఉద్యమాన్ని కొనసాగించారు. ఇది గొప్పమహత్వ పూర్ణ ఉద్యమంగా ఘనతకెక్కింది. దేవ సంస్కృతీ విశ్వవిద్యాలయం విశ్వవ్యాప్తంగా విస్తరించింది. శాంతికుంజ్ పరిసరాలు సంగఠనాత్మకంగా విలసిల్లాయి. గురుసత్తాను చాటిచెప్పుతూ మిషన్ అనేక విధాలుగా విస్తరిల్లింది.

## రామపంచాయతనంలో చేరిపోయాడు

రామపంచాయతనంలో ఆరవవాడుగా హనుమంతుడు చేరిపోయాడు. అదే విధంగా ఉన్నత శ్రేణిలో ఒకరుగా చేరిపోవాలంటే మీరు కూడా ఉన్నత శ్రేణి నైపుణ్యాన్ని చూపించాలి. మీరు చూపిన శ్రద్ధాసక్తులే మీ అంతరాళాలలో మంచి అనుభవాన్ని అందిస్తాయి. గురుసత్తా ఆనందానికి అవధులు ఉండవు. ప్రేరక సత్తా మీ శక్తి సామర్థ్యాలను రుజువు చేస్తుంది. ఇది చాలా అందమైన ప్రోత్సాహక నైపుణ్యం అనేది సంకల్ప బద్ధంగా ఉండాలి. అది ఇంద్రియాల కలయికతో అనేకరెట్లుగా మారిపోతుంది. స్ఫూర్తిదాత తలపెట్టిన కార్యాన్ని చివరి వరకు తీసుకునివెళ్లడంలో ఏ మాత్రం వెనుకంజవేయడు. నైపుణ్యం హనుమాన్‌కి సరిజోడీ కనుకనే రాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు, సీతలతో పాటు హనుమంతుడు మాత్రమే నేర్పుగా ఆరవ వానిగా చేరిపోగలిగాడు. ఇదే స్థాయిలో మనం మన గురుదేవులతో పాటు వారి కార్యక్రమాలలో ప్రవేశించి, ప్రతీక్షణం దివ్యమైన అనుభూతిని పొందగలం. ఆవిధంగా ప్రవేశించిన మనల్ని చూసి, మన గురుదేవులు పరమానంద భరితులు అవుతారు. ఇది ప్రజలు గుర్తించినా, గుర్తించకపోయినా, మీడియా అర్థం చేసుకున్నా, చేసుకోకపోయినా మనకేమీ బాధ లేదు. గురుదేవుల ఎడ మన సమర్పణాభావం చరమస్థాయికి చేరుకుంటుంది.

## రోజువారీ ఉపదేశం

11వ సూత్రంలో సారాన్ని సంక్షిప్తం చేస్తూ రోజువారీ సాధనకు సూత్రాలు తయారుచేశారు. అవి జీవితసారాన్ని తెలియజేస్తాయి. రోజూ మనం చేసే పనుల గురించి అంతరాత్మను అడుగుతూ ఉండాలి. ఏమైనా తప్పు చేశానా? సోమరితనంగాని, నిర్లక్ష్యంగాని చోటు చేసుకోలేదు కదా? అని ప్రతీక్షణం చూసుకోవాలి. ఇదే మనం నిత్యం చేసే సాధన కావాలి. ఆత్మవలోకనం వల్ల మనమీద మనకు శ్రద్ధ పెరుగుతుంది. తప్పులు తెలిసివస్తాయి. మన తప్పులు మనకు అంత తొందరగా కనిపించవు. కానీ మనల్ని పరిశీలిస్తూ ఉన్నవారికి చక్కగా కనిపిస్తాయి. "నేనే అందరికన్నా శ్రేష్ఠుణ్ణి. నేను చేసే పనులే గొప్ప పనులు. నేనే గొప్ప కార్యకర్తను. "అన్న అహంకారం కార్యకర్తను సర్వనాశనం చేస్తుంది. సంగఠనా శక్తి క్షీణిస్తుంది. ఆజ్ఞాపాలన చేయలేనివారు అన్ని విధాలా అవమానాలపాలు అయిపోతారు. ఆజ్ఞాపాలనయే కార్యకర్తను తన గురువుతోనూ, తమ సంస్థతోనూ కలిపి ఉంచుతుంది. అహంకారం మద్యంలాగా మత్తులో

**పవిత్రతలేనిచోట ప్రేమ ఉండదు-ప్రేమలేని చోట శాంతి ఉండదు.**

ముంచివేస్తుంది. రాజకీయ రంగంలో ఇది మహా భయంకరమైనది. ఆధ్యాత్మరంగంలోనూ, సేవారంగంలోనూ ఇది మహావినాశకారి. "ఆధ్యాత్మరంగం శ్రేష్ఠత్వం, వినయశీలతల మీద ఆధారపడి ఉంటుంది'', యుగశిల్పి అహంకారపు పంజానుండి రక్షించుకోవాలి" అని గురుదేవులు వ్రాసిన రెండు వాక్యాలు పరిజనులేకాక సర్వులు చదువవలసి ఉంది. వీటిని స్వీకరించి ఆచరించిన వారు యుగ నిర్మాణానికి పునాది రాళ్ళుగా నిలువగలుగుతారు.

## యోగీశ్వరరూపంలో ఘోషణ

చివరగా 12వ సూత్రంలో గురుదేవులు అభయ మిచ్చారు. "ఈ విరాట్ యోజన పూర్తి అయితీరుతుంది. ఏ మాత్రం అనుమానం వద్దు. ఇది దైవీ ఉద్యమం. దీనిని ఎవరూ ఆపలేరు. ఇది మానవ మాత్రుని రూపాంతర అవతరణకు యోజన. ఈ విషయాన్ని మనం మాటమాటకి చెప్తూ ఉండాలి. అర్థం చేయిస్తూ ఉండాలి. అందువల్ల వారు జాగ్రత్తగా ఉంటారు. ఈ అగ్ని పరీక్షా సమయంలో శరీరం, మనస్సు, వ్యవహారం అన్ని విషయాలలో ఎలాంటి గడబిడలు లేకుండా జాగ్రత్తపడతారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో, ఉన్నతమైన పనులు చేస్తూ ఉంటారు. పరిశ్రమ, మనోయోగం, త్యాగం, నిరహంకారితలే మానవుని ఉన్నత స్థాయికి తీసుకుని పోతాయి. ఆ ఉన్నతత్వమే మున్ముందు చేయబోయే కార్యక్రమాల్లో ఎలాంటి కొరత రాకుండా చూసుకుంటుంది.

## నాలుగు గీటురాళ్ళమీద పరీక్షిద్దాం

మనం ఉన్నతులం కావాలి అనుకుంటే నాలుగు గీటురాళ్లమీద మనల్ని మనం పరీక్షించుకుందాం. 1. శ్రమ 2. మనోయోగం 3. త్యాగం 4. నిరహంకారం. మనకు మనమే రోజూ నాలుగు ప్రశ్నలు వేసుకుంటే ఏ గడబిడ ఉండదు. శ్రమ అంటే కష్టించి పని చేయడం. మనో యోగం అంటే ధ్యానం. త్యాగం అంటే ప్రతి ఫలాన్ని కోరకుండా చేసేది. నిరహంకారిత అంటే సేవా భావం. ఈ నాలుగువిషయాల మీద మనల్ని మనం నిగ్గుతెల్చుకుంటే చాలు గురుదేవులు దగ్గరకు తీసుకుంటారు. అందువల్ల ప్రతీక్షణం అత్యంత జాగరూకత ప్రదర్శిస్తూ గురుదేవుల కార్యాన్ని పూర్తి చేయాలి.

★★★

## శృంగి ఋషి యొక్క సుసంస్కార శిక్షణ

*లోమశ మహర్షి తన పుత్రుడైన శృంగిని తన కంటే ఉన్నత శ్రేణికి చెందిన ఋషిగా చేయదలిచి అతనికి ప్రత్యేక శిక్షణ, సాధనలనే కాక ఆహార విహారాల పట్ల కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ఆశ్రమంలో స్వయంగా పెంచిన వృక్ష ఫలాలను మాత్రమే అతని చేత తినిపించేవాడు. కనీసం స్త్రీ గురించిన విషయ పరిజ్ఞానాన్ని కూడా పుత్రునికి తెలియనీయలేదు. దశరథుడు వశిష్ఠుడు ఇతనిని పరీక్షింపదలచి అప్సరసల చేత మృష్టాన్న భోజనాన్ని పంపించారు. ఏనాడు ఏ స్త్రీని దర్శించని శృంగి వారు ఎవరని ప్రశ్నించగా- అప్సరసలు తాము కూడా విదార్థులమని, శీతల ప్రధాన క్షేత్రమైన గురుకులం కారణంగా తమకు ఇంకా గడ్డాలు, మీసాలు రాలేదని చెప్పి ఆ మృష్టాన్న భోజనమే తమ ఆశ్రమంలోని మధుర ఫలాలని చెప్పి ఆయనను నమ్మించారు. పుత్రుని ద్వారా విషయాన్ని విన్న లోమశ మహర్షి వాస్తవాన్ని తెలుసుకోదలచి ఆశ్రమం బయటకు రాగా అప్సరసలతో పాటు దశరథుడు వశిష్ఠుడు కంటబడ్డారు. వారి రాకకు గల కారణాన్ని మహర్షికి విన్నవించి తాను చేయబోయే పుత్రకామేష్ఠి యజ్ఞానికి కావలసిన శక్తివంతమైన వాక్కు కేవలం శృంగి ఋషికి మాత్రమే కలదని, మంత్రాలను వల్లించే అసంఖ్యాకులైన విద్వాంసులు ఉన్నప్పటికి వారి వలన తాను ఆశించిన యజ్ఞఫలం సిద్ధించదని దశరథుడు తెలియచేశాడు.*

*శృంగి ఋషి నిర్వహించిన పుత్రకామేష్ఠి యజ్ఞం వలన రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు రూపంలో నలుగురు పుత్రులు దశరథునికి కలిగారు. బ్రహ్మతేజస్సును ఆర్జించటానికి కేవలం తపోసాధనలే గాక ఇంద్రియ నిగ్రహం, ఆహార నియమం మొదలైనవి కూడా అనివార్యం.*

– ప్రజ్ఞా పురాణం నుండి

ప్రశాంతంగా జీవించేవారిని ఎవ్వరూ అవమానించలేరు.

## దేవ సంస్కృతి విశ్వవిద్యాలయము

# తక్షశిలా విశ్వవిద్యాలయం - 2

తక్షశిలా విశ్వవిద్యాలయములో విద్వాంసులందరి కలయిక ఒక పరిషత్తుగా ఏర్పడి ఉండేది. ఈ విద్వాంసులందరూ ఒక్కొక్క శాస్త్రంలో నిష్ణాతులు. అప్పుడప్పుడు వీరు విశ్వవిద్యాలయంలోని అధ్యయనాంశాలను పరిశీలించి తగిన మార్పులను సూచించేవారు. వీరిని శాస్త్రానికి ప్రతీకలుగా భావించేవారు. బౌద్ధ స్థానాల్లో, విహారాలలో సంస్కృతాధ్యయనం ఉచ్ఛస్థానంలో ఉండేది. ఈ విశ్వవిద్యాలయాల విద్యాప్రణాళికలు గమనిస్తే, హిందూ, బౌద్ధ మతాల ధర్మాలకు నడుమ సామరస్య, సహజీవనం కొనసాగినట్లుగా తెలియవస్తున్నది.

పొరుగు దేశాలైన టిబెట్, జావా, సుమిత్రా, కొరియా, గ్రీసు, ఇరాన్ మరియు అరేబియాలనుంచి విద్య నేర్చుకోవడానికి విద్యార్థులు వచ్చేవారు. వీరు ఇక్కడ 10 సంవత్సరాలకు పైగా ఉండి తర్క, వైద్య, ఖగోళ శాస్త్ర సంబంధమైన విషయాలు నేర్చుకునేవారు. భారతదేశాన్ని ఒక పవిత్ర క్షేత్రంగా, విద్యాకేంద్రంగా భావించి వేలాది మైళ్ళు ప్రయాణం చేసి విద్యాభ్యాసం చేసిన వారిలో ఫాహియాన్, హుయాన్ త్యాంగ్ ఉన్నారు. ఫాహియాన్ తన యాత్రా చరిత్రలో ఇక్కడి విద్వాంసులు విద్యను, శాస్త్రాన్ని సమగ్రంగా, రహస్యాలను కూడా నేర్పేవారని, గ్రంథ రహస్యాలను, తాత్పర్యాన్ని వ్యాఖ్యానించగలవారని పేర్కొన్నాడు. గురుకుల వ్యవస్థలో అంశాలను గ్రహించి పద్దెనిమిదో శతాబ్దంలోనే విదేశీ విద్వాంసులు ఇంగ్లాండు మొదలైన దేశాలలో తమ విద్యావిధానాన్ని పరివర్తన చేసుకున్నట్లుగా వారు వ్రాసిన నివేదికల వల్ల తెలుస్తున్నది.

చాణుక్యుడు, ధౌమ్యముని, ఆత్రేయ, జీవకుడు, శుశ్రుతుడు, పాణిని, చరకుడు మొదలైనవారు ఇక్కడ ఆచార్యులుగా, శిక్షకులుగా, ఉపన్యాసకులుగా ఉండేవారు. మునులు, ఋషులు ఇక్కడికి విజిటింగ్ ప్రొఫెసర్స్‌గా వచ్చేవారు.

ఆనాటి విశ్వవిద్యాలయంలో విద్యాసంవత్సరం శ్రావణ పూర్ణిమ నాడు ఉపక్రమణమనే ఉత్సవంతో ప్రారంభమై, పుష్య శుద్ధ పూర్ణిమ నాటి ఉత్సర్గం అనే ఉత్సవంతో పూర్తయ్యేది. ప్రతి విశ్వవిద్యాలయంలోనూ విద్యార్థులకు వారి విద్యాభ్యాసము ముగిసిన పిమ్మట స్నాతకోత్తర ఉత్సవం జరిగేది. ఈ సమయములో ఆచార్యులు విద్యార్థులకు వారు బాహ్య ప్రపంచములో ప్రవర్తించవలసిన విధానమును, వారు చేయవలసిన కార్యములను తెలియజేసి పంపటము ద్వారా వారి లక్ష్యాలను, సమాజము పట్ల వారి బాధ్యతలు నిరంతరము నిర్వహించే ఉత్సాహాన్ని నింపేవారు. ఇక్కడ నివసించిన యోగులు రాజులకు, అధ్యాపకులకు, విద్యార్థులకు, సామాన్యులకు కూడా మార్గదర్శనం చేసేవారు. అలెగ్జాండరు ఇక్కడ నుండి గొప్ప తత్వశాస్త్ర పండితులను తన రాజ్యానికి తీసుకొని వెళ్ళాడు. అలెగ్జాండరును భారతదేశము నుండి వెనక్కు తిప్పి పంపిన ఘనత కూడా ఇక్కడ నివసించిన యోగులదే.

భారతదేశంలో నివసించే యోగులు, వారి అద్భుత శక్తుల గురించి గ్రీకు దేశ ప్రజలు విని ఉన్నారు. అలెగ్జాండర్ ప్రపంచ దండయాత్రకు బయలుదేరబోయే ముందు అక్కడి ప్రజలు ఒక భారతీయ యోగిని తమ దేశానికి తీసుకురావాల్సిందిగా కోరారు. ఒకసారి అలెగ్జాండర్ భారతదేశంలో ఒక అడవి గుండా ప్రయాణిస్తున్నాడు. మార్గ మధ్యంలో ఒక చెట్టు క్రింద తపస్సు చేసుకుంటున్న యోగి కనిపించాడు. అలెగ్జాండర్ అక్కడ కాసేపు ఆగి, ఆ ఋషి కనులు తెరచేదాకా ఎదురు చూశాడు. ఆయన వదనం ప్రశాంతంగా, తేజోవంతంగా ప్రకాశిస్తూ ఉంది. "మేము మీకు మా రాజ్యంలో సకల సౌకర్యాలు కల్పిస్తాం. దయచేసి మాతో మా దేశానికి విచ్చేయండి. మా ప్రజలు మీ పట్ల ఎనలేని అనురాగం కనబరుస్తారు.'' అని అభ్యర్థించాడు. ''క్షమించండి. నాకే సౌకర్యాలూ, సంపదలు అక్కర్లేదు. నాకు ఇక్కడ చాలా సంతోషంగా ఉంది. నేనక్కడకు రాలేను" అని సున్నితంగా తిరస్కరించాడా యోగి.

అప్పటి దాకా అలెగ్జాండర్ తన ఆజ్ఞను ధిక్కరించిన వాళ్ళనే చూడలేదు. ఈయన తన అభ్యర్థననే తోసి పుచ్చుతున్నాడు. పట్టరాని కోపం వచ్చింది. తనను తాను నియంత్రించుకోలేక పోయాడు. చటుక్కున ఒరలోంచి కత్తి దూసి "నువ్వెవ్వరితో మాట్లాడుతున్నావో తెలుసా? ప్రపంచ విజేత అలెగ్జాండర్ చక్రవర్తిని నేను. నా ఆజ్ఞను ధిక్కరించిన మరుక్షణం నీ శరీరం ముక్కలు ముక్కలవుతుంది" అంటూ హుంకరించాడు. ఆ యోగి ఏ మాత్రం తొణక్కుండా "నువ్వు నన్ను చంపలేవు. కేవలం నా శరీరాన్ని మాత్రమే చంపగలవు. ఈ దేహం కేవలం నేను ధరించిన వస్త్రం మాత్రమే. నేను దేహాన్ని కాదు. దేహంలో నివసించే ఆత్మను." "ఏమిటీ నువ్వు చక్రవర్తివా? నేను చెప్పనా నువ్వెవరో." "నువ్వు నా బానిసకు బానిసవు" అన్నాడు. దిగ్భ్రాంతి చెందిన అలెగ్జాండర్ "నేనా! బానిసనా! అదెలా సాధ్యం?" అంటూ ప్రశ్నించాడు. ఆ యోగి శాంత స్వరంతో" నేను కోపాన్ని జయించాను. అది నా బానిన. క్షణ కాలంలో నువ్వు దానికెంత సులభంగా లొంగిపోయావు? కోపానికి బానిసవైపోయావు. ఇప్పుడు చెప్పు నువ్వు నా బానిసకు బానిసవు కాదా?'' అన్నాడు. మరేమీ మాట్లాడలేక అలెగ్జాండర్ ఆ యోగికి నమస్కరించి వెళ్ళిపోయాడు. ఈ సంఘటన తర్వాత అలెగ్జాండర్‌లో పూర్తి స్థాయి మార్పు వచ్చింది. తన రాజ్య కాంక్షను వదిలి తన దేశానికి ప్రయాణమయ్యాడు. **ఒక ప్రపంచ విజేత అయిన చక్రవర్తిని తన మాటతో వెనక్కు పంపగల సామర్థ్యం గల యోగులు తక్షశిలలో (భారతదేశములో) నివసించేవారు.**

**కోపం తెచ్చుకోవడం తేలికే - కాని అవసరమైనప్పుడు అవసరమైన వ్యక్తిపై అవసరమైనంత కోపం తెచ్చుకోవడం అంత సులభం కాదు.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గోళ్ళపాడు గ్రామంలో గాయత్రీ జయంతి

21.6.2010 గుంటూరు జిల్లా ముప్పాళ్ళ మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో గాయత్రీ జయంతి పర్వదిన సందర్భమున 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ గారి సారథ్యంలో శ్రీ అశ్విని సుబ్బారావు గారి (దక్షిణ భారత సంచాలకులు, గాయత్రీ పరివార్) పర్యవేక్షణలో ఈ మహా యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించడమైనది.

ఈ మహాయజ్ఞ సందర్భమున ముందురోజు 20.6.2010 సాయంత్రం శ్రీ రామాంజనేయ స్వామి ఆలయం నుండి 300 మంది మహిళలతో కలశయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరామకృష్ణ మాష్టారు ఈ కలశయాత్రలో స్వయంగా పాల్గొని యజ్ఞస్థలికి వేంచేసి కార్యకర్తలలో ఉత్సాహాన్ని ఇనుమడింప చేశారు.

ఈ యజ్ఞము కొరకు 108 మంది కార్యకర్తలు 24 రోజులు 30 మాలల గాయత్రీ మంత్ర జపం అనుష్ఠానం చేశారు. దాదాపు 70 గ్రామములనుంచి దాదాపు 6000 మంది పరిజనులు ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు.

21.6.2010 ఉదయం 7.30 గంటలకు శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ తోషన్ నాయకత్వంలో శ్రీ పూల్‌సింగ్, శ్రీ చిరంజీవి, శ్రీ శేఖర్ గార్ల యుగసంగీతంతో యజ్ఞ కార్యక్రమం ప్రారంభించబడింది. శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణ గారు తమ ప్రవచనంలో పూజ్య గురుదేవుల జన్మశతాబ్దికి ఆంధ్రప్రదేశ్ నుండి లక్షమంది కార్యకర్తలు శాంతికుంజ్ కార్యక్రమానికి హాజరుకావలసినదని, తగు ప్రయత్నాలు చేయవలసినదని ఉద్బోధించారు. శ్రీ అశ్విని సుబ్బారావు గారు ప్రసంగిస్తూ గాయత్రీ మంత్రార్థాన్ని, మంత్ర విశిష్ఠతను, ప్రాశస్త్యాన్ని వివరించారు.

యజ్ఞ కార్యక్రమాన్ని శ్రీ తోషన్ బృందం నిర్వహించారు. గుంటూరు జిల్లా కన్వీనర్ శ్రీ పేరిశాస్త్రి ఈ మహా యజ్ఞ కార్యక్రమాన్ని దృఢ సంకల్పంతో కార్యక్రమ విజయానికి అహర్నిశలు పాటుపడ్డారు. యజ్ఞ సందర్భమున 30,000 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

## విశాఖపట్నంలో

విశాఖపట్నంలో 12 ప్రజ్ఞామండలుల, 12 మహిళా మండలుల ఏర్పాటు జరిగింది. ప్రతి ఆదివారం ఉదయం 9 గం॥ల నుంచి యజ్ఞం, సంస్కారములు జరుపుతున్నారు. యజ్ఞోపతిని అందరికి పరిచయం చేస్తున్నారు. ప్రతి బుధవారం సాయంత్రం 7 గం॥ల నుంచి 8 గం॥ల వరకు సత్సంగం నిర్వర్తిస్తున్నారు.

18.6.2010 గాయత్రీ పరివార్ కార్యకర్త శ్రీ శ్యామలరావు గారి అమ్మాయి దివ్య–చక్రీల వివాహ సందర్భమున వధూవరుల ప్రతిజ్ఞలు, సప్తపది శ్రీమతి & శ్రీ దుర్గా మల్లిఖార్జునరావు నిర్వహించారు.

గాయత్రీ జయంతి సందర్భమున 20.6.2010న పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం, 21.6.2010 సాయంత్రం 108 దీపాలతో దీపం యజ్ఞంతో పాటు వివాహదిన సంస్కారం జరిగింది. సుమారు 200 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాలు శ్రీ సోమ్‌చంద్ భరద్వాజ, శ్రీ దుర్గా మల్లిఖార్జునరావు గార్లు నిర్వహించారు. శ్రీ గణేష్, శ్రీ సింహాచలం, శ్రీ లక్ష్మీనరసింహా, శ్రీ రామ్మూర్తి, శ్రీ రామశేషు, శ్రీ నూకరాజు, శ్రీ అప్పల నాయుడు, శ్రీ సహాయ్, శ్రీ బెనర్జి సహాయ సహకారములందించారు.

## మలక్‌పేటలో

హైదరాబాద్‌లో మలక్‌పేటలో నం.1 ఆంధ్రా బ్యాంక్ కాలనిలోని గాయత్రీ కేంద్రమందు పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సందర్భమున గాయత్రీ జయంతి నుండి ప్రతి నిత్యం ఉదయం 7 నుండి 8.30 గంటల వరకు గాయత్రీ యజ్ఞం నిర్వహించబడుతున్నది. ఈ సమయమందు సంస్కారములు కూడా నిర్వహించబడతాయి. మూడవ అంతస్థులో యజ్ఞశాల నిర్మాణం కూడా జరుగుతున్నది. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించు కోవలసినదిగా నిర్వాహకులు కోరుతున్నారు. వివరములకు శ్రీమతి విజయా విశ్వనాథ్: 9949088261, కుమారి రమ్య: 9985390586.

'విజ్ఞానం-అవగాహన' భయాన్ని పోగొడతాయి.